www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం 19 ఫిబ్రవరి 2025
సంపుటి :06 సంచిక : 262 , పేజీలు : 12 వెల:రూ.5/-
తెలుగు దినపత్రిక
TELANGANA, ANDHRA PRADESH

## తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త

- పంటల రక్షణకు మరో పథకం
- పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ స్కీం పెట్టే యోచన
- డ్రిప్, తుంపర సేద్య పరికరాలు అందించేందుకు సిద్ధం
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు ): తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో శుభవార్త చెప్పనుంది. పంటల రక్షణ కోసం కొత్త స్కీం తీసుకురానుంది. దీంతో పాటు.. రైతుల అవసరాలకు 2 లో..



## వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివ రాత్రి ఉత్సవాలు

- ఉత్సవాలకు సీఎం, రవాణా శాఖ మంత్రి లకు ఆహ్వానం



2 లో..

## సమాజానికి సవాలుగా మారిన సైబర్ నేరాలు







- నేరాలను నియంత్రించడంలో దేశానికి తెలంగాణ ఆదర్శం కావాలి
- హెచ్ఐసిసిలో రెండు రోజుల జరుగనున్న సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్-2025 జాతీయ స్థాయి పోలీసు సదస్సులో సీఎం

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 18:
సమాజానికి ఒక సవాలుగా మారిన సైబర్ నేరాలను నియంత్రించడంలో తెలంగాణను దేశానికే రోల్ మాడల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆకాశమే హద్దుగా కొత్త రూపాలు సంతరించుకుంటున్న సైబర్ నేరాలను అరికట్టడంలో పరిమితమైన విధానాలతో కేవలం ఒక రాష్ట్రం చేసే ప్రయత్నాలు ఫలితాలను ఇవ్వవని, రాష్ట్రాలన్నీ సమన్వయంతో దేశం ఒక యూనిట్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఎచ్ ఐ సి సి లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి "సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్ -2025" ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి 2 లో..

## భూ భారతి స్ఫూర్తితోనే విధి విధానాలు

- తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా భూభారతి చట్టం చేశాం
- విధివిధానాలపై కలెక్టర్లతో వర్క్ షాప్
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు,హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 18
ప్రజాస్వామ్యయుతంగా అసెంబ్లీలో డ్రాఫ్ట్ బిల్లు పెట్టి ఆ తర్వాత మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు సూచనలు తీసుకొని దేశానికి ఆదర్శంగా ఉండేలా భూ భారతి ఆర్వోఆర్ 2025 చట్టాన్ని తీసుకువచ్చామని అదే స్ఫూర్తితో ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో, విస్తృత స్థాయిలో అభిప్రాయాలను సేకరించిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టం రూపకల్పనకు ఎంత కష్టపడ్డామో ఈ చట్టానికి 2 లో..

## మా అయ్యప్ప, హనుమాన్ భక్తులు చేసిన పాపమేంది?



- రంజాన్ భక్తులకు మాత్రమే డ్యూటీ మినహాయింపు ఇస్తారా?
- అయ్యప్ప, భవానీ, హనుమాన్ భక్తులకు మినహాయింపు ఎందుకివ్వరు?
- కాంగ్రెస్ నేతలారా అసలు మీలో హిందువుల రక్తం ప్రవహిస్తుందా?
- బీసీ జాబితాలో ముస్లింలను చేరిస్తే స్పందించరా?
- ఇవన్నీ ప్రశ్నిస్తుంటే మాపై మతతత్వ ముద్ర వేస్తారా?
- కేంద్రం నిధులివ్వడం లేదని అవాకులు పేలుతారా?
- తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర వాటాపై చర్చకు సిద్ధమా?
- కాంగ్రెస్ సర్కార్ పై నిప్పులు చెరిగిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- బీసీ జాబితాలో ముస్లింలను కలిపితే బిల్లును ఆమోదించే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- మాపై మతతత్వవాదులని ముద్ర వేసినా డోన్ట్ కేర్ అని వ్యాఖ్య

2 లో

మంచిర్యాల వెలుతురు ఫిబ్రవరి 18:
"ఇయాళ సర్క్యులర్ చూసిన. రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులందరికీ సాయంత్రం 4 గంటలలోపే విధులను ముగించుకుని వెళ్లిపోవచ్చని మినహాయింపు ఇచ్చారు. మరి మా అయ్యప్ప, హనుమాన్, భవానీ భక్తులు ఏం పాపం చేశారు? అయ్యప్ప మాల వేసుకునే భక్తులు భిక్ష చేయడానికి ఎన్ని ఇబ్బందులుంటాయో అందరికీ తెలుసు. మధ్యాహ్నం భిక్ష చేయకుండా పస్తులుండి దీక్ష తీసుకునే పరిస్థితి. ఒకవేళ టైంకు రాకుంటే సస్పెండ్ చేస్తారనే భయంతో డ్యూటీలకు పోతరు. అట్లాగే భవానీ భక్తులకు, హనుమాన్ భక్తులదీ అదే పరిస్థితి. కానీ రంజాన్ భక్తులకు మాత్రమే మినహాయింపు ఎట్లా ఇస్తారు?"అని ప్రశ్నించారు.

## కెసిఆర్ హయాంలో రైతు దర్జాగా బతికాడు

- ఇప్పుడేమో బిచ్చమేసినట్లుగా రైతుభరోసా
- రుణమాఫీ పేరుతో రైతులకు టోకరా
- 15వేలు అని చెప్పి అన్నదాతలను మోసం చేశారు
- ఏడాది దాటినా ఎవ్వరికీ ప్రయోజనం లేదు
- ఆమన్‌గల్ రైతు ధర్నాలో కెటిఆర్ విమర్శలు



రంగారెడ్డి,ఫిబ్రవరి18( వెలుతురు ):
పదేండ్ల పాటు కేసీఆర్ హయాంలో రైతు ఒక రాజులాగా బ్రహ్మాండంగా బతికాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పదిహేను నెలల కాలంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఎవరికీ న్యాయం చేయలేదు. రైతు రుణమాఫీ, రైతుబంధు, తులం బంగారం, మహిళలకు రూ. 2500 రాలేదు. 420 హామీలిచ్చి దొంగమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని విమర్శలు గుప్పించారు. రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్‌లో ఏర్పాటు చేసిన రైతు దీక్షలో కేటీఆర్ ప్రసంగించారు. సొంత నియోజకరవ్గరం, సొంత తాలుకాలో కూడా ఒక్కపని చేయలేదు. సొంతూరికి, అత్తగారి ఊరికి ఏం చేసిండో అడుగదామని వచ్చానని కేటీఆర్ తెలిపారు. రూ. 2 లక్షల రుణమాఫీ చాలా మందికి కాలేదు. రైతుబంధు కూడా రాలేదు. టకీటకీమని పైసలు పడలేదు. గత 6 నెలల నుంచి అన్ని జిల్లాల్లో తిరుగుతున్నాం. గత పదేండ్లలో మోటార్లు కాలలేదు.. ట్రాన్స్‌ఫార్మర్లు 2 లో..

## ఢిల్లీని వెనక్కి నెట్టిన హైదరాబాద్

- పెరుగుతున్న అంతర్జాతీయ పెట్టుబడులు
- గ్రామీణ ప్రాంత ప్రజలు నగరబాట..



హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు ):
హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెట్టుబడులు పెడుతున్నాయి. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు హైదరాబాద్‌లో సెటిల్ అవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని 2 లో..

## విద్యారంగంలో సమూల మార్పులకు యోచన

- స్కిల్స్ పెంచేలా పాఠ్యాంశాల్లో మార్పులు
- సింఘానియా స్కూల్స్‌తో ఒప్పందంలో మంత్రి లోకేశ్



2 లో..



2 లో..

## కుంభమేళాలో పవన్ దంపతుల పుణ్యస్నానం

- తర్పణాలు వదిలి వస్త్రదానం చేసిన పవన్
- కుంభమేళాకు రావడం అదృష్టమని వ్యాఖ్య

## ఆక్వాలో టెక్నాలజీ జోడిస్తే మంచి ఫలితాలు

- రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి ఆక్వా గ్రోత్ ఇంజిన
- ఆక్వాలోనూ ప్రకృతి సేద్యం సాధించాలి
- ఆక్వాటెక్ ముగింపు ఉత్సవంలో సిఎం చంద్రబాబు



అమరావతి,ఫిబ్రవరి18( వెలుతురు ):
టెక్నాలజీ వాడకంతో అక్వా రంగంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి ఆక్వారంగం గ్రోత్ ఇంజన్‌గా నిలుస్తుందన్నారు. టెక్నాలజీ వాడకం, నూతన పద్ధతులతో ఈ రంగంలో నిలకడగా 30 గ్రోత్‌రేట్ సాధ్యమేనన్నారు. ఆక్వాలో ప్రకృతి సేద్యంతో ప్రపంచ వ్యాప్తంగా మన ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడుతుందని సీఎం వివరించారు. ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయంలో మంచి ఫలితాలు వస్తున్నాయని.. ఆక్వాలో కూడా ఆ తరహా విధానాలు అమలు చేయాలన్నారు. ఆక్వా ఫీడ్ విషయంలో తగు మార్పులు చేయాలని అన్నారు. మన ఉత్పత్తులకు వ్యాల్యూ యాడ్ చెయ్యడం ద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందవచ్చని సీఎం చెప్పారు. ప్రస్తుతం 4 లక్షల ఎకరాల్లో ఆక్వాను సాగు చేస్తున్నారని.. 2029-30నాటికి 10 లక్షల ఎకరాలకు పెరగాలని సీఎం ఆకాంక్షించారు. అయితే కాలుష్య రహితంగా ఆక్వా ప్రయాణం సాగాలన్నారు. ఆక్వాలో ప్రధాన సమస్యగా ఉన్న కాలుష్యానికి పరిష్కార మార్గాలు ఉన్నాయని.. 8 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివ రాత్రి ఉత్సవాలు

( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 18:**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన మహా శివరాత్రి మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆహ్వానించారు. ప్రభుత్వ విప్, శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ తో పాటు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అర్చకులు, అధికారులు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మంగళ వారం నాడు కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందించారు.ఈ సందర్భంగా వేములవాడ ఆలయ అభివృద్ధి పనుల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను కలిసిన ప్రతినిధి బృందాన్నిఅడిగితెలుసుకున్నారు. ?భూసేకరణ, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని అధికారులను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.అలాగే వేములవాడలో జరిగే మహా శివరాత్రి వేడుకలకు రావాలిందిగా కోరుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను సచివాలయంలో కలిసి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరియు వేములవాడ ఆలయ అధికారులు,అర్చకులు తదితరులు పాల్గొన్నారు,

## తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త

సంబంధించిన పరికరాలను అందించే యోచనలో సర్కార్ ఉన్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. అడవి జంతువులు, కోతుల నుండి పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ స్కీంను ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అంతేకాకుండా.. పామాయిల్‌తో పాటు ఇతర పంటలకు డ్రిప్, తుంపర సేద్య పరికరాలను అవసరం మేరకు రైతులకు అందించాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో పాటు.. రాష్ట్ర అవసరాలు తీర్చే విధంగా కూరగాయల సాగు పెంపునకు పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. జూన్ మొదటి వారంలోపు రాష్ట్రంలో మరో ఆయిల్ పామ్ కర్మాగారం అందుబాటులోకి రానుందని.. మరో రెండు ఫ్యాక్టరీల నిర్మాణ పనులు ఆరంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. అలాగే.. మెకడమియా పంట సాగుకు అవసరమైన పరిస్థితులను.. అనువైన ప్రాంతాలను అధ్యయనం చేయాల్సిందిగా ఉద్యానశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రగతి చూపని ఆయిల్ పామ్ కంపెనీలపై చర్యలు ఆరంభించాలని.. ఇప్పటికే విశ్వతేజ ఆయిల్ పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసినట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. రైతులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం తాజాగా రైతు భరోసా నిధులను విడుదల చేసిన సంగతి తెలిసిందే.. మొత్తం మూడు ఎకరాల వరకు సాగులో ఉన్న భూములకు రైతు భరోసా నిధులు జమ చేశారు. మొదటగా ఒక ఎకరం ఉన్నవారికి, మరోసారి రెండు ఎకరాలు ఉన్నవారికి, ఈనెల 12న మూడు ఎకరాల ఉన్న రైతుల అకౌంట్లో రైతు భరోసా నిధులను జమ చేసింది.

## కెసిఆర్ హయాంలో రైతు దర్జాగా బతికాడు

పేలలేదు. అప్పుడు అప్పు అడిగే పరిస్థితి లేదు. నాట్లు వేసే నాటికి రైతుబంధు పడుతుండే. రేవంత్ రెడ్డి కొత్త పదం పట్టుకుని టకీ టకీమని పడుతాయ్ అన్నాడు. టకీ లేదు టుక్ లేదు అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతుబంధు కేసీఆర్ బిచ్చమేసినట్లు రూ. 10 వేలు ఇస్తుండు.. నేను రూ. 15 వేలు వేస్తా అన్నాడు. కనీసం 10 శాతం మందికి కూడా రైతుబంధు ఇవ్వలేదు. ఒకేసారి రుణమాఫీ చేస్తా అని అన్నాడు. చారణా కూడా రుణమాఫీ చేయలేదు. 10 శాతం మందికి కూడా బోనస్ పడలేదు అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పాలనతో ఏ వర్గమూ సంతోషంగా లేదని కేటీఆర్‌అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని ఆ పార్టీ నేతలు మళ్లీ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మళ్లీ మోసపోతే ఎవరూ కాపాడలేరన్నారు. 'కేసీఆర్ హయాంలో రైతు రాజులా బతికాడు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక సోనియాగాంధీ పుట్టినరోజు రెండుసార్లు వచ్చింది.. కానీ రుణమాఫీ 25 శాతం కూడా కాలేదు. 35 సార్లు దిల్లీ విమానం ఎక్కారు.. 35 పైసలూ తీసుకురాలేదు. అప్పులు కట్టలేదని రైతుల తలుపులు ఎత్తుకెళ్లారు.. రేపో మాపో పుస్తెలతాడు కూడా లాక్కెళ్లిపోతారు. ఓట్ల కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయాలి. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అని డ్రామాలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ గురించి తెలియదు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు సొంత ఊరు, అత్తగారి ఊరు కల్వకుర్తిలో ఏమైనా చేశారా? అని అడగడానికి ఇక్కడకు వచ్చాం. కులగణన పేరుతో బీసీలను రేవంత్‌రెడ్డి మోసం చేశారు' అని కేటీఆర్ ఆరోపించారు. మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో సమూల మార్పులకు యోచన

**అమరావతి,ఫిబ్రవరి18( వెలుతురు ):**
విద్యార్థుల్లో స్కిల్స్ పెంచేలా విద్యావిధానంలో మార్పులకు కృషి చేస్తున్నామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అందుకు అనుగుణంగా మార్పులు చేస్తున్నామని అన్నారు. ఏపీలో విద్యారంగాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అమలు చేస్తోన్న మూస పద్ధతులకు స్వస్తి చెప్పి సృజనాత్మకత పెంపొందించేలా కేజీ టు పీజీ విద్య కరిక్యులమ్‌లో సమూల మార్పులు తెస్తున్నామన్నారు. కళాశాల నుంచి బయటకు వచ్చే విద్యార్థికి వెనువెంటనే ఉద్యోగం లభించేలా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. జాతీయ విద్యావిధానం లక్ష్యసాధనలో భాగంగా రాష్ట్రంలో విద్యానైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్ట్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఏపీ ప్రభుత్వంతో సింఘానియా గ్రూప్, ఏపీ ప్రభుత్వ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, నాణ్యత, ఉపాధ్యాయ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణతో పాటు జాతీయ విద్యావిధానంతో సమాంతరంగా సాంకేతికత అనుసంధానం వంటి అంశాల్లో విద్యా నైపుణ్యాన్ని తీసుకురావడం ద్వారా పాఠశాలల నిర్వహణలో మార్పులు తేవాలని నిర్ణయించారు. ఐదేళ్ల వ్యవధిలో అమలుచేసే ఈ కార్యక్రమం ద్వారా లక్ష మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందనుంది. ఆ తర్వాత అమరావతి, విశాఖపట్నం, కాకినాడకు కూడా ట్రస్ట్ సేవలను విస్తరించ నున్నారు. విద్యార్థులను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యవంతంగా తయారు చేయడమే లక్ష్యమని సింఘానియా గ్రూప్ చైర్మన్ తెలిపారు. విద్యార్థులకు మరింత ప్రభావవంతమైన, ఆకర్షణీయమైన అభ్యసన విధానాల్లో బోధన చేసేందుకు వీలుగా ఉపాధ్యాయుల సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు విజయవాడ, వైజాగ్, అమరావతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పాఠ్యాంశాల్లో సాంకేతికతను మెరుగుపరచడం, ఆంగ్లంలో విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలను బలోపేతం చేయడం ద్వారా విద్య నాణ్యతను పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## కుంభమేళాలో పవన్ దంపతుల పుణ్యస్నానం

**ప్రయాగ్‌రాజ్,ఫిబ్రవరి18( వెలుతురు ):**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సమేతంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో పర్యటించారు. మహా కుంభమేళాలో పాల్గొన్న ఆయన కుటుంబ సభ్యులతో కలిసి త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరించి గంగాదేవికి పూజలు చేసి, హారతులిచ్చారు. ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న కుంభమేళాకు సామాన్యభక్తులతో పాటు ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కుమారుడు అకీర నందన్ కూడా తండ్రి వెంటే ఉన్నాడు. ప్రయాగ్ రాజ్ మహాకుంభమేళాలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దంపతులు పుణ్యస్నానం చేశారు. ఈ సందర్భంగా గంగానదికి పవన్ కళ్యాణ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు కుంకుమ, పువ్వులు సమర్పించి పవన్ కళ్యాణ్ దంపతులు హారతి ఇచ్చారు. పితృదేవతలకు తర్పణాలు వదిలి, బ్రాహ్మణులకు వస్త్ర దానం చేశారు. ఇది మనందరికీ గొప్ప అవకాశం అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. మనం భాష లేదా సంస్కృతి విషయంలో భిన్నంగా ఉండవచ్చు, కానీ ఒక మతంగా, మనం అంతా ఒక్కటే. మహా కుంభమేళాను నిర్వహించినందుకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. ఇక్కడికి రావాలనేది చాలా దశాబ్దాలుగా నాకున్న అతిపెద్ద కోరిక. ఈరోజు, నాకు ఇక్కడికి వచ్చే అవకాశం వచ్చిందని ఆయన అన్నారు.మహా కుంభమేళాలో భక్తుల ప్రవాహం ఏమాత్రం తగ్గడం లేదు. సోమవారం నాడు కూడా దాదాపు 1.35 కోట్ల మంది స్నానాలు చేశారు. ఇప్పటివరకు 54.31 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహా కుంభమేళా నుండి భక్తులను వారి గమ్యస్థానాలకు చేర్చడానికి రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. మరోవైపు, మహా కుంభమేళా మీదుగా ప్రతి గంటకు 8 కి పైగా విమానాలు ఎగురుతున్నాయి. ఈ క్రమంలో విమానయాన సంస్థలు తమ ప్రయాణీకులకు ఏరియల్ వ్యూ ఎక్స్ పీరియన్స్ ఇస్తున్నాయి.

# సమాజానికి సవాలుగా మారిన సైబర్ నేరాలు

**(మొదటి పేజీ తరువాయి..)**
ప్రారంభించారు. "బాధితులకు రక్షణ కవచంగా సైబర్ భద్రత – డిజిటల్ భవిష్యత్తు" (#SHIELD2025) అన్న అంశంపై జరుగుతున్న ఈ సదస్సు నుంచి ముఖ్యమంత్రి కొత్తగా రూపుదిద్దుకున్న సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ , సైబర్ ఫ్యూజన్ సెంటర్ లను విర్చువల్‌గా ప్రారంభించారు.

అనంతరం సీఎం మాట్లాడుతూ, సైబర్ నేరాలను నియంత్రించడంలో జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందని కేంద్ర ప్రభుత్వం కితాబిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే, మారుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని, తొలి ప్రయత్నంగా అందుకు అవసరమైన ఒక వారధిని నిర్మించేందుకు చొరవ తీసుకున్నందుకు తెలంగాణ సైబర్ క్రైమ్ విభాగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు.

సైబర్ క్రిమినల్స్ ఇటీవలి కాలంలో దాదాపు 22 వేల కోట్ల రూపాయలను కాజేసినట్టు అంచనాలు వచ్చాయని, ప్రజల జీవన స్థితిగతులను, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఇలాంటి ప్రమాదకరమైన పరిణామాలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో పాటు ఫేక్‌న్యూస్, సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచార వ్యాప్తి సమాజానికి చేటు కలిగిస్తున్నాయని అన్నారు.

సమాజంలో కొంతమంది జరగని నేరాలు జరిగినట్టు, జరగని దాడులు జరిగినట్టు లేదా మరో కారణం చేతనైనా డీప్ ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తున్నారని, ఆర్థిక నేరాలతో పాటు ఇలాంటి వాటన్నింటినీ నియంత్రించాల్సిన అవసరం ఉందని చెప్పారు."సైబర్ నేరాలను అరికట్టడానికి ఐటీ సంస్థలు, నిపుణులతో కలిసి తెలంగాణ నిబద్ధతతో పనిచేస్తోంది. ఈ నేరాలను అరికట్టడంలో 24 గంటలూ సైబర్ హెల్ప్ లైన్ 1930 పనిచేస్తుంది. ఈ విషయాన్ని అందరికీ చేరవేయాలి. గతేడాది తెలంగాణలో కొత్తగా 7 సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించాం. ఇదే క్రమంలో సైబర్ నేరాలతో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

"అకాశమే హద్దుగా ప్రతి క్షణం ఏదో ఒక సైబర్ నేరం జరుగుతుందని, సైబర్ నేరం ఎక్కడి నుంచి జరిగింది. నేరం చేసిందెవరని గుర్తించడం, వారిని పట్టుకోవడం, శిక్షించడం వంటి అనేక సవాళ్లతో పాటు అసలు నేరం జరక్కుండా నిరోధించాల్సిన బాధ్యత కూడా పోలీసులపైనే ఉంది.

సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి ఆయా రాష్ట్రాలతో సమన్వయం సాధించడానికి దేశంలో ఒక కనెక్టింగ్ బ్రిడ్జ్‌లా ఈ సదస్సు ద్వారా ప్రయత్నించడం అభినందనీయం. సైబర్ నేరాలను నియంత్రించడంలో తెలంగాణ ఈ దేశానికే రోల్ మాడల్‌గా నిలబడుతుంది. ఆదర్శంగా ఉంటుంది" అని పేర్కొన్నారు.

హోం శాఖ కార్యదర్శి రవిగుప్తా, రాష్ట్ర డీజీపీ జితేందర్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్ , సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతీ వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఈ కాంక్లేవ్ లో పాల్గొన్నారు.

# మా అయ్యప్ప, హనుమాన్ భక్తులు చేసిన పాపమేంది?

**(మొదటి పేజీ తరువాయి..)**
"కాంగ్రెస్ లో హిందువులారా.... మీలో నిజంగా హిందూ రక్తమే ప్రవహిస్తే నా ప్రశ్నకు సమాధానం చెప్పాలి"అని డిమాండ్ చేశారు.

మంచిర్యాల పట్టణంలో మంగళవారం రోజున నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు బీజేపీ ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షులు రఘు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ చేసిన ప్రసంగ పూర్తి పాఠం వివరాలిలా ఉన్నాయి...

ఈనెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం పట్టభద్రులు, ఉద్యోగ, ఉపాధ్యాయులంతా ఎదురు చూస్తున్నారు. 3 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలుపు ఖాయమని ఏ సర్వే చూసినా స్పష్టం చేస్తున్నాయి. నరేంద్రమోదీ ప్రభుత్వంపై విశ్వాసం, భరోసా ప్రజలకు ఉంది. దీంతోపాటు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా బీజేపీ చేసిన పోరాటాలతోపాటు కాంగ్రెస్ అవినీతి, అరాచకాలు, మోసాలను చూసి ప్రజలంతా బీజేపీ పక్షాన నిలబడేందుకు సిద్ధంగా ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులందరికీ రూ.12.75 లక్షల ట్యాక్స్ మినహాయింపు ఇచ్చింది. 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా నిధులను కేటాయించి తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తోంది. కేంద్రం నిధులివ్వడంలేదని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ కు నేను సవాల్ చేస్తున్నా... కేంద్ర నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా? ఇదే అంశాన్ని రెఫరెండంగా తీసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లోకి రావాలని కాంగ్రెస్ కు సవాల్ చేస్తున్నా.

కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పరిస్థితి గందరగోళంగా మారింది. ఆయనకు ఏజెంట్లు లేరు. ప్రచారం చేసే నాయకులు లేరు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆయనకు గెలిపించాలనే ఆలోచనే లేదు. చివరకు ఆయన సొంత కాలేజీ స్టాఫ్ ను పట్టుకుని తిరుగుతున్నడు. ఆయన గెలిస్తే ఉన్న ఉద్యోగాలు పోతాయోమోననే సొంత స్టాఫ్ భావిస్తోంది. మంచిర్యాలలో కొంత మంది దాదాగిరి చేస్తున్నరు. ఇంకెన్నాళ్లు... మహా అంటే 6 నెలలకంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండే పరిస్థితి లేదు. అవినీతికి రాష్ట్ర ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. సీఎం వ్యాఖ్యలే నిరూపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలోని టాప్ 5లో ఉన్న వాళ్ల దోపిడీ, అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కమీషన్లకు కక్కుర్తి పడుతున్నరు. కానీ ఉద్యోగుల పీఆర్సీని అమలు చేయరు. డీఏలు ఇవ్వాలని అడిగితే పైసల్లేవంటున్నరు. ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, గ్రాట్యుటీ పైసలు కూడా ఇయ్యకుండా సతాయిస్తున్నరు. ఆ డబ్బుల కోసం సచివాలయం చుట్టూ, మంత్రుల చుట్టూ తిరిగే దుస్తితి ఏర్పడింది. కానీ 15 శాతం కమీషన్లు ఇస్తే మాత్రం కాంట్రాక్టర్లకు అప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తున్నారు.

ఇవన్నీ బయటపడుతుంటే మోదీ బీసీ కాదని ఆయన కులం గురించి అవాకులు పేలుతున్నరు. అసలు రాహుల్ ఖాన్ గాంధీ తండ్రి పేరు ఏమిటి? ఫిరోజ్ ఖాన్ గాంధీ...అసలు గాంధీ అని పేరు యాడ్ చేసుకుని గాంధీ పరువు తీస్తున్నరు. మహాత్మాగాంధీ ఆత్మ బాధపడుతోంది. ఫిరోజ్ ఖాన్ గాంధీ కొడుకు, మనవడు ఏమైతెరు? హిందువులైతె కానే కాదు... అందులో డౌటే లేదు. అసలు కాంగ్రెస్ నేతలను అడుగుతున్నా... మీరు హిందువులేనా? మీలో హిందువు రక్తం ప్రవహిస్తుందా?

ఇయాళ సర్క్యులర్ ఇచ్చారు. రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులంతా సాయంత్రం 4 గంటలలోపే విధులను ముగించుకుని వెళ్లిపోవచ్చట... మరి అయ్యప్ప ఏం పాపం చేశారు? అయ్యప్ప మాల వేసుకునే భక్తులు భిక్ష చేయడానికి ఎన్ని ఇబ్బందులుంటాయో అందరికీ తెలుసు. మధ్యాహ్నం భిక్ష చేయకుండా పస్తులుండి దీక్ష తీసుకునే పరిస్థితి. ఒకవేళ టైంకు రాకుంటే సస్పెండ్ చేస్తారనే భయంతో డ్యూటీలకు పోతరు. అట్లాగే భవానీ భక్తులకు, హనుమాన్ భక్తులదీ అదే పరిస్థితి. మరి రంజాన్ భక్తులకు మాత్రమే మినహాయింపు ఎట్లా ఇస్తారు? ఇవన్నీ ప్రశ్నిస్తే మమ్ముల్ని మతతత్వ వాదులంటారా?

అనేక దేశాల్లో నిషేధిత తబ్లిగీ జమాతే సంస్థ సమావేశాలు నిర్వహిస్తే... 2.5 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తారా? సిగ్గుండాలే. మీరు హిందువులు కాదా? మీరు బొట్టు పెట్టుకోవడం లేదా? మీలో హిందూ రక్తం ప్రవహించడం లేదా? బీసీ హిందువుల్లో ముస్లింలను ఎట్లా కలుపుతారు? మీ అయ్య జాగీరా? బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి.. ఆ జాబితాలో 10 శాతం ముస్లింలను కలిపితే బీసీలకు అన్యాయం జరిగినట్లు కాదా? మళ్లీ చెబుతున్నా... బీసీ జాబితాలో ముస్లింలను కలిపితే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదు. ఆ జాబితాను లామినేషన్ చేసుకుని ఇంట్లో పెట్టుకోవాల్సిందే తప్ప దాంతో ఏమీ చేసుకోలేరు? ముస్లింలకు బీసీ రిజర్వేషన్లను వర్తింపజేస్తే భవిష్యత్తులో తెలంగాణలో ఎన్నికలొస్తే గెలిచేది ముస్లింలే... ఒకే వర్గానికి కొమ్ము కాస్తూ గెలుస్తున్నామని విర్రవీగుతున్న కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత మేధావి వర్గంపై ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు బీజేపీకి మాత్రమే ఉంది. 317 జీవోకు వ్యతిరేకంగా కొట్లాడింది మేం. లాఠీదెబ్బలు తిన్నది మేం. రక్తం చిందించింది మేం. జైలుకు పోయింది మేం. ఆనాడు నా ఆఫీస్ లో నేను దీక్ష చేస్తుంటే...నా ఆఫీస్ గేట్లు బద్దలు కొట్టి జేసీబీతో కూల్చి అరెస్ట్ చేసి లోపలేయాలని పోలీసులను ఆదేశించిండు... మరి ఇప్పుడు కాంగ్రెస్ పక్షాన పోటీ చేస్తున్న నాయకులను అడుగుతున్నా... ఆనాడు మీరెటు పోయారు? పీఆర్టీయూ, ఎస్టీయూ, యూటీఎఫ్, డీటీఎఫ్ సహా ఏ ఒక్క సంఘమైనా మాకు అండగా నిలిచారా? టీచర్లకు మద్దతుగా పోరాడారా? ఆనాడు రేవంత్ రెడ్డిసహా ఎవరైనా మీ పక్షాన పోరాడారా? మీకోసం జీవితాలను ఫణంగా పెట్టి పోరాడింది బీజేపీ.

అంతేకాదు నిరుద్యోగుల పక్షాన పోరాడింది మేమే. గ్రూప్ 1 అభ్యర్థుల పక్షాన పోరాడింది మేమే. గ్రూప్ అభ్యర్థుల పక్షాన మేం పోరాడుతుంటే హిందీ పేపర్ లీకేజీ చేశానంటూ నాపై దొంగ కేసులు పెట్టి జైలుకు పంపారు. మళ్లీ చెబుతున్నా... భవిష్యత్తులో ఉద్యోగులు, టీచర్లు, నిరుద్యోగులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉండేది మేం. పోరాడేది కూడా బీజేపీ. అంతే కాదు, ధర్మానికి, సమాజానికి ఆపదొచ్చినా బీజేపీయే అండగా ఉంటుంది. కాబట్టి ఓట్లు అడిగే హక్కు కూడా మాకే ఉంది...

కాంగ్రెస్ ప్రభుత్వ దాదాగిరి మహా అంటే 5, 6 నెలలే. ఆ తరువాత మీ ప్రభుత్వం ఉంటదో, ఊడతదో మీకే తెల్వదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే. మేం అధికారంలోకి వస్తే అడ్డగోలుగా వ్యవహరించే వాళ్ల సంగతి చూస్తాం... అసలు కాంగ్రెస్ కు ఎందుకు ఓటేయాలి?... ఇగ నిరుద్యోగులకైతే మోచేతికి బెల్లం రాసి నాకిచ్చినంత పనిచేసిన్రు... 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నరు. నెలనెలా 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నరు. ఉపాధికి ఢోకా లేకుండా చేస్తమన్నరు. ఇయాల్టికి నయాపైసా కూడా భృతి ఇయ్యలే... 25 వేల పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చి 55 వేల పోస్టులు భర్తీ చేసుకున్నట్లు ప్రచారం చేసుకున్నరు. ఇప్పటికీ రాష్ట్రంలోని అన్ని శాఖల్లో 2 లక్షలకుపైగా ఖాళీలున్నయ్. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను గల్లా పట్టి నిలదీయండి. టీచర్ల, ఉద్యోగులారా... 2023 జూలై నుండి పీఆర్సీ పెండింగ్ లోనే ఉంది. పెండింగ్ లో ఉన్న 5 డీఏలన్నీ ఇస్తామని ఇయ్యలే. గల్లాపట్టి నిలదీయండి...

ఇయాళ పేపర్ల చూసిన.. ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో వెంటనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సీఎం ఆదేశించినట్లు. అబద్దాలు చెప్పి మోసం చేసి ఓట్లు దండుకోవడంలో కాంగ్రెసోళ్లు కేసీఆర్ ను మించి పోయిన్రు...

అసెంబ్లీ ఎలక్షన్లప్పుడు రేవంత్ రెడ్డి సహా కాంగ్రెసోళ్లు ఏమన్నరో గుర్తుందా?.. ఓటేసి గెలిపిస్తే 100 రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామన్నరు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున తొలి ఏడాదిలో రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి లబ్దిదారులతో గృహ ప్రవేశం చేయిస్తామని హామీ ఇచ్చారు. బడ్జెట్ లో 7 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు ప్రకటించారు. అధికారంలోకి ఏడాది దాటిపోయింది. ఒక్కటంటే ఒక్క ఇల్లయినా కట్టించారా? ఇప్పటి వరకు ఒక్క ఇల్లు ఇవ్వలేదు. ఐదేళ్లలో 25 లక్షల ఇళ్లు నిర్మిస్తామని చెబితే నమ్మేదెవరు? 20 లక్షల మందికి రుణమాఫీ చేసినం... ఎన్నికలైపోంగనే పంద్రాగస్టులోపు మిగిలిన 20 లక్షల మందికి రుణమాఫీ చేస్తామని ప్రకటించిండు.. ఫలితాలొచ్చి 8 నెలలైంది. ఇంతవరకు ఆ రైతులకు నయాపైసా రుణమాఫీ చేయలే. 6 గ్యారంటీలు, 66 హామీలను పూర్తిగా గాలికొదిలేసిండు... ఇవన్నీ నిలదీస్తుంటే... కాళేశ్వరం, డ్రగ్స్ కేసు, ఫార్ములా ఈ రేస్ స్కాం కేసులో ఇదిగో అరెస్ట్...అదిగో అరెస్ట్ అంటూ మీడియాలో వార్తలు రాయించుకుంటూ కాలయాపన చేయడం తప్ప కాంగ్రెస్ సాధించిందేమిటి? బీఆర్ఎస్ చేసిన స్కాంలు... ఢిల్లీలోని కాంగ్రెస్ నేతలకు ఏటీఎంలాగా మారాయి. ఒక్క స్కాం బయటకు వస్తే.. ఢిల్లీ పెద్దలకు రూ.వెయ్యి కోట్లకుపైగా పైసలు దండుకుంటున్నారు. మోసాల కాంగ్రెస్ కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ది చెప్పాలని కోరుతున్నా...

# భూ భారతి స్ఫూర్తితోనే విధి విధానాలు



సంబంధించిన విధివిధానాలను తయారు చేయడానికి అదే స్థాయిలో కసరత్తు చేయాలని అధికారులను కోరారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా చిన్న చిన్న తప్పులకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా విధివిధానాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. భూభారతి చట్టానికి సంబంధించి విధివిధానాలను రూపొందించడంపై హైదరాబాద్ లోని ఎం.సీ.ఆర్.హెచ్.ఆర్.డి.లో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న వర్క్ షాప్ లో మొదటి రోజు మంగళవారం నాడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ "ఎలాంటి విధి విధానాలు తయారు చేయకుండానే 2020 ఆర్వోఆర్ చట్టాన్ని ఆనాటి ప్రభుత్వం అమలులోకి తీసుకురావడంతో ఎదురైన ప్రతికూల పరిస్థితులు మన కళ్లముందే కనిపిస్తున్నాయి. ఆనాటి పాలకులు గొప్పగా చెప్పుకున్న ధరణిలో అన్ని లొసుగులు, లోపాలే. నిబంధనల రూపకల్పన లేకుండానే అమలులోకి తీసుకువచ్చిన 2020 ఆర్ఓఆర్ చట్టం వల్లే లక్షలాది మంది రైతులు రోడ్డున పడ్డారు. చట్టం తీసుకువచ్చి మూడు సంవత్సరాలు గడచినా కూడా ఆనాటి ప్రభుత్వం విధివిధానాలను రూపొందించలేదు. సచివాలయంలో కూర్చొని రూల్స్ ఫ్రేమ్ చేయకుండా విస్తృత స్థాయిలో అధికారులు, మేధావులు, అనుభవజ్ఞుల సలహాలు సూచనలు తీసుకొని అందరి అభిప్రాయాలను క్రోడీకరించి పకడ్బందీగా భూ భారతి విధివిధానాలు తయారు చేస్తున్నాం. వీలైనంత త్వరగా భూభారతి చట్టానికి సంబంధించిన విధివిధానాలను తయారుచేసి చట్టాన్ని అమలులోకి తీసుకువస్తాం. కొత్త సమస్యలు రాకుండా ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యేలా రైతులకు ప్రయోజనం కలిగేలా, అధికారులు తప్పుచేయడానికి ఆస్కారం లేకుండా విధివిధానాలను రూపొందిస్తున్నాం. తెలంగాణలో నూతన రెవెన్యూ చట్టం భూభారతి భూ పరిపాలనలో పెను మార్పులను తీసుకురాబోతుంది.భూ హక్కులను రక్షించడం, భూ వ్యవహారాలలో పారదర్శకత తీసుకురావడం భూ లావాదేవీలను సులభతరం చేయడం, సామాన్యులకు సైతం రెవెన్యూ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ఈ చట్టం తరతరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుంది.భవిష్యత్తులో మరింత మెరుగైన విధానాలు, సాంకేతికతను ఉపయోగించుకొని భూపరిపాలనను మరింత సమర్ధవంతంగా కొనసాగిస్తాం, ఈ నూతన చట్టం ద్వారా భూ యాజమాన్య హక్కులనే గాకుండా వారి జీవితాలను ఆత్మగౌరవాన్ని ఆర్థిక స్వతంత్ర్యాన్ని తీసుకువస్తుంది" అని మంత్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సిసిఎల్ఏ పీడీ సిఎంఆర్ఓ మకరంద్, భూ చట్ట నిపుణులు భూమి సునీల్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్గిరి, వికారాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల కలెక్టర్లు వివిధ జిల్లాల ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీని వెనక్కి నెట్టిన హైదరాబాద్

ప్రజలు కూడా నగరబాట పడుతున్నారు. నగరంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉండటంతో సిటీలో సెటిల్ అయ్యేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. దీంతో హైదరాబాద్ నగర జన సాంద్రత పెరిగుతోంది. జన సాంద్రత విషయంలో తాజాగా దేశ రాజధాని ఢిల్లీని హైదరాబాద్ వెనక్కి నెట్టింది. తెలంగాణ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్–2024 నివేదిక గణంకాలు వెల్లడించింది. నగరంలో చదరపు కిలోమీటరుకు 18,161 మంది జనాభా సాంద్రత ఉన్నట్లు వెల్లడించింది. ఈ సంఖ్య రాజధాని ఢిల్లీలో చదరపు కిలోమీటరుకు 11,313 మాత్రమే ఉన్నట్లు పేర్కొంది. జన సాంద్రత విషయంలో ఇండియాలో ముంబై తొలి స్థానంలో ఉంది. అక్కడ చదరపు కిలోమీటరుకు 28,508 ఉన్నట్లు గణాంకాల ద్వారా వెల్లడైంది. ప్రపంచంలో అత్యంత జనసాంద్రత కలిగిన నగరంగా ఫిలిప్పీన్స్‌లోని మనీలా నిలిచింది. అక్కడ ఒక చదరపు కిలోమీటరులో 43,079 మంది నివసిస్తున్నారు. అయితే వేగవంతమైన పట్టణీకరణ ఓ సవాల్ లాంటిదేనని నిపుణులు అంటున్నారు. అది రెండు వైపులా పదును ఉన్న కత్తి లాంటిందని చెబుతున్నారు. జనాభా పెరుగుదలతో ఓ వైపు హైదరాబాద్ నగరం వృద్ధి పథంలోకి వెళ్తున్నా.. అదే సమయంలో అందుకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించటం ప్రభుత్వానికి శక్తికి మించిన పని అంటున్నారు. పెరగుతున్న జనాభా మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలు, ఇండ్ల నిర్మాణంపై ఒత్తిడిని పెంచుతాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. ఓ వైపు హైదరాబాద్ నగరంలో జన సాంద్రత పెరుగుతుండగా.. తెలంగాణలో మాత్రం పరిస్థితి వేరుగా ఉంది. 2011 జనాభా లెక్కల డేటా ప్రకారం.. రాష్ట్ర జనాభా 3.5 కోట్లుగా ఉంది. తెలంగాణ మొత్తం 1,12,077 చదరపు కిలోమీటర్ల భౌగోళిక విస్తీర్ణాన్ని కలిగి ఉంది. చదరపు కిలోమీటరుకు 312 మంది జనాభా సాంద్రతను కలిగి ఉంది. 2031 నాటికి ఇది మరింత తగ్గే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో యువ జనాభా కూడా తగ్గుతున్నట్లు అంచనా వేస్తున్నారు. 2031 నాటికి 39 ఏళ్ల వయస్సు లోపు ఉన్నవారి జనాభా 0.23 శాతం తగ్గే ఛాన్స్ ఉందని అంటున్నారు. అదే సమయంలో 40 ఏళ్లు పైబడిన వారి సంఖ్య పెరుగుతుందని.. దీని కారణంగా రాష్ట్రంలో వృద్ధ జనాభా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ అంశం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది.

# మహా కుంభాభిషేకం ప్రసాదాన్ని కాంగ్రెస్ అధిష్టానానికి పంపిన మంత్రి కొండా సురేఖ

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 18:



కాళేశ్వరంలో మహా కుంభాభిషేకం ప్రసాదాన్ని కాంగ్రెస్ అధిష్టానానికి పంపిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,కాళేశ్వర ముక్తీశ్వర స్వామి క్షేత్రంలో ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో మూడు రోజులు పాటు జరిపిన మహా కుంభాభిషేకం ప్రసాదం, కాళేశ్వరుడి ప్రతిమ, త్రివేణి సంగమం(గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదులు) జలం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఎల్ఓపీ రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఎంపీ ప్రియాంక గాంధీలకు ప్రత్యేకంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పంపించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిందని,ఈనెల 7న మాఘ శుద్ధ దశమి నుంచి 9వ తేదీ మాఘ శుద్ధ ద్వాదశి వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయని,42 ఏండ్ల తర్వాత నిర్వహించినట్టు ఏఐసీసీ రాసిన లేఖలో తెలిపిన మంత్రి సురేఖ.కాళేశ్వరం దేవాలయంలో 1982లో మహా కుంభాభిషేకం జరిగిందని అప్పటి నుంచి మళ్లీ ఇప్పుడే ఈ వేడుకలు జరగలేదని వివరించారు.ఈ మహా కుంభాభిషేకం కార్యక్రమంలో శృంగేరి జగద్గురువులు భారత తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి, తుని తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి పాల్గొనన్నారని దీని ద్వారా ఆ దేవాస్థాన సంప్రోక్షణ చేయడం ద్వారా దాని పవిత్ర మరింత పెరుగుతుందని లేఖలో మంత్రి కొండా సురేఖ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగరాదు

- ఎపి ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలిస్తోంది
- నీటిపారుదలశాఖ మంత్రుల భేటీలోమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హైదరాబాద్,బ్రవరి18( వెలుతురు ):
కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగకుండా కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. ఏపీ ప్రభుత్వం కృష్ణాజలాలను అక్రమంగా తరలిస్తోందని, కేంద్రం అడ్డుకోవాలన్నారు. జయపురలో కేంద్ర జలశక్తిశాఖ ఆధ్వర్యంలో జరిగిన నీటిపారుదలశాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఉత్తమ్.. నీటి నిల్వ సదుపాయాలు, నీటి సరఫరా నిర్వహణపై ప్రజెంటేషన్ ఇచ్చారు. కృష్ణా జలాల వినియోగాన్ని లెక్కించేందుకు టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరారు. 55 కిలోమీటర్ల పొడవునా చేపడుతున్న మూసీ పునరుజ్జీవ, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వాలని.. గంగా, యమునా పునరుద్ధరణ తరహాలో మూసీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రి అన్నారు. మూసీ వెంట ట్రంక్, సీవరేజ్ నెట్ వర్క్ కోసం రూ.4వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు గోదావరి జలాలను తరలించే పనులకు రూ.6వేల కోట్లు ఇవ్వాలని కోరారు. కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా కేంద్రం చొరవ తీసుకొని తెలంగాణకు న్యాయం చేయాలన్న ఉత్తమ్.. పాలమూరు – రంగారెడ్డి, సమ్మక్క–సారక్క, సీతారామసాగర్ ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పనులు కొనసాగుతోన్న సాగునీటి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో రుణాలు సమకూర్చాలని, రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడికతీతకు అయ్యే వ్యయాన్ని కేంద్రమే భరించాలని కోరారు. మేడిగడ్డ ఆనకట్టకు సంబంధించి ఎన్డీఎస్ఏ విచారణ నివేదిక త్వరగా ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన కార్యాచరణ సూచించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఐఏఎస్‌లను అవమానించేలా సిఎం రేవంత్ వ్యాఖ్యలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్, ఫిబ్రవరి18 ( వెలుతురు ):
రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అవమానపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పచ్చకామెర్ల వానికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. మీరు బ్యాగులతో దొరికారని అందరూ మీ లాగానే బ్లాక్‌మెయిల్ దందాలు చేస్తారని సెటిల్‌మెంట్లు, దందాలు చేస్తూ బతుకుతున్నారని అనుకోవడం తప్పు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మన దేశ ప్రజాస్వామ్యానికి వెన్నెముకలు అని కేటీఆర్ పేర్కొన్నారు. సివిల్ సర్వెంట్స్ అంటే.. కార్యాచరణ రూపొందించడంలో నిష్ణాతులు.. కానీ ఏసీలో ఉండి యాక్షన్ చేసే వారు కాదు. సీఎం రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అవమానించేలా మాట్లాడారు. ఆ మాటలు అమర్యాదగా ఉన్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అధికార వ్యవస్థ ప్రతిష్టను నాశనం చేసేందుకు సీఎం రేవంత్ నిరంతరం చేస్తున్న ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

# రాష్ట్ర స్టార్టప్స్ భాగస్వామ్యానికి బ్రెజిల్ హబ్ గోయస్ తో ఒప్పందం : సీఎం

## హెచ్ ఐ సీసీ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, హబ్ గోయస్ ప్రతినిధులు

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 18:




స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యానికి టీ హబ్ (T-Hub), బ్రెజిల్‌లోని గోయస్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే హబ్ గోయస్ (HUB GOIAS)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి,ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు , హెచ్ఐసీసీలో హబ్ గోయస్ (HUB GOIAS) ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం T-Hub ఫౌండేషన్ సీఈవో సుజిత్ జాగిర్దార్ గారు, బ్రెజిల్ దేశ గోయస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు మన రాష్ట్రంలో అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రి–టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారం పంచుకుంటాయి. మార్కెట్ యాక్సెస్‌తో పాటు కెపాసిటీ బిల్డింగ్ ఇంక్యుబేషన్, సాంకేతిక భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాల మెరుగుదల వంటి కీలక అంశాలపై టీ–హబ్ (T-Hub), హబ్ గోయస్ (HUB GOIAS) కలిసి పని చేస్తాయి. రెండు దేశాల స్టార్టప్ ఎకో సిస్టమ్‌ల మధ్య సంబంధాలను ఈ ఒప్పందం బలోపేతం చేయనుంది.

# రైతులు పార్టీలు చెబితే ధర్నాలు చేయరు

- బిసి కులగణన గతంలో ఎప్పుడూ చేయలేదు
- రాష్ట్రంలో వందశాతం సక్రమంగా కులగణన
- మీడియాతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు ):



రాజకీయ పార్టీలు చెబితే రైతులు ధర్నాలు చేయరని శాసనమండలిలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మరోవైపు రాష్ట్రంలో ప్రభుత్వం 100 శాతం కులగణన సర్వే పర్ఫెక్ట్ చేసిందని తెలిపారు. అసలు కులగణన మీద బీసీల జనాభాపై లెక్క ఎక్కడ ఉంది.. దేశంలోనే ఇదే మొదటిసారి బీసీ కులగణ చేసిందని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గుత్తా సుఖేందర్ రెడ్డి చిట్ చాట్ నిర్వహించారు. కేటీఆర్ రైతు దీక్షపై కౌంటర్ ఎటాక్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతు దీక్షలు చేస్తున్నారని ఆరోపించారు. కరెంట్ కట్ అయినా.. ట్రాన్స్ఫర్మర్ కాలిపోయిన రైతులే రోడ్డెక్కుతారు.. సమగ్ర కుటుంబ సర్వే ఆఫిషియల్ రికార్డు లేదు.. బీసీ కులగణన సర్వే సరైనదని తెలిపారు. నాయకుడికి కులం, మతంతో సంబంధం ఉండదు.. ప్రజలతో మమేకమైన వాడే నాయకుడు అవుతాడని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మరోవైపు.. బీజేపీ బీసీ కులగణకు వ్యతిరేకమని అందరికి తెలిసిందే.. వ్యవస్థలపై గౌరవం తగ్గుతున్న మాట వాస్తవమే.. రాజకీయం, ప్రభుత్వ సంస్థలు ఇతర వ్యవస్థలపై సైతం నమ్మకం తగ్గుతుందని ఆయన ఆరోపించారు. కాగా.. ఉచితాలపై ఒక కఠినమైన చట్టం రావాల్సిందేనని అన్నారు. కేసీఆర్ త్యాగాలు చేసింది నిజమే.. తెలంగాణ ఉద్యమం నడిపించింది వాస్తవమే.. కానీ 4 కోట్ల ప్రజలు హీరో అంటే.. మరి ఎన్నికల్లో 4 కోట్ల ప్రజలు ఓట్లు వేయలేదు కదా?! అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నువ్వు నేను కోరుకుంటే ఎన్నికలు రావు.. ప్రభుత్వం పడిపోతుంది అంటే అది అధికారం కోల్పోయిన బాధలో మాట్లాడుతున్నారని ప్రజలు అనుకుంటారు.. ఈ ప్రభుత్వ పాలన పర్వాలేదని గుత్తా తెలిపారు. జమిలి ఎన్నికలపై గుత్తా సుఖేందర్ రెడ్డి స్పందిస్తూ.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు కలిసి వస్తే పార్టీలపై, ప్రభుత్వంపై, అభ్యర్థులపై భారం తగ్గుతుందని అన్నారు. ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో ఒక గ్రాడ్యుయేట్, రెండు టీచర్స్ ఎమ్మెల్సీకి ఎన్నిక జరుగుతుందని చెప్పారు. ఉన్న ఓటర్లే తక్కువ.. ఎన్నికల కోడ్, ప్రభుత్వ పరిపాలనపై ప్రభావం చూపిస్తోందని తెలిపారు. కోడ్ ప్రభావం చూపకుండా చర్యలు తీసుకోవాలని ఈసీకి లేఖ రాశానని చెప్పారు.

# పకడ్బందీగా కొత్త రెవెన్యూ చట్టం అమలు

- భూ భారతి విధివిధానాలు రూపొందిస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,బ్రవరి18( వెలుతురు ):



పకడ్బందీగా కొత్త రెవెన్యూ చట్టం అమలుకు భూ భారతి విధివిధానాలు రూపొందిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని ఎంసీహెచ్ఆర్డీలో రెవెన్యూశాఖ అధికారులతో సమీక్ష జరిపిన పొంగులేటి.. గత సర్కార్ హయాంలోని రెవెన్యూ చట్టంలో అన్నీ లోపాలు,లొసుగులే ఉన్నాయన్నారు. చట్టం తీసుకొచ్చి మూడేళ్ళైనా విధివిధానాలు రూపొందించలేదన్నారు. మేధావులు,నిపుణులతో చర్చించి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టం భూ భారతిని తీసుకొచ్చిందని చెప్పారు పొంగులేటి. భూ భారతి చట్టం తరతరాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తుందన్నారు. వీలైనంత త్వరగా విధివిధానాల రూపొందించి.. భూ భారతి రెవెన్యూ చట్టాన్ని అమలు చేస్తామని తెలిపారు. భూ భారతి చట్టం పెను మార్పులు తీసుకొస్తుందన్నారు. 2024 డిసెంబర్ 20 తెలంగాణ భూ భారతి 2024 బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. జనవరి 9న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు.

# కుంచించుకు పోయిన బతుకమ్మ కుంట

- ఆక్రమనలతో ఆనవాళ్లు మాయం
- పునరుద్ధరణ పనులు చేపట్టిన హైడ్రా

హైదరాబాద్,బ్రవరి18( వెలుతురు ):
అంబర్ పేటలోని బతుకమ్మ కుంట పునరుద్ధరణన పనులను హైడ్రా మొదలు పెట్టింది. పునరుద్ధర లో భాగంగా మంగళవారం బతుకమ్మ కుంటలో హైడ్రా పూడిక తీత పనులు చేపట్టింది. ఇందులో భాగంగా కుంటలో జేసీబీతో కొంత మేర మట్టి తీయగానే నీళ్లు బయటకు వచ్చాయి. గతంలో ఇక్కడ చెరువు ఉండటం వల్లనే నీళ్ళు బయటపడ్డాయని హైడ్రా అధికారులు చెబుతున్నారు. అంబర్ పేట మండలం బాగ్ అంబర్ పేట్ లోని సర్వే నంబరు 563 లో 1962– –63 లెక్కల ప్రకారం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట ఉంది. బఫర్ జోన్ తో కలిపి మొత్తం16.13 ఎకరాలు. అయితే తాజా సర్వే ప్రకారం అక్కడ 5.15 ఎకరాలు మాత్రమే మిగిలింది. దీన్ని హైడ్రా పనరుద్ధరిం చేందుకు చర్యలు చేపట్టింది. ఇక్కడ ఉంటున్న వారికి సమస్య లేకుండా చెరువును పునరుద్ధరించనున్నారు అధికారులు. బ్యూటిఫికేషన్?చేపట్టనున్నారు. ఒకప్పటి ఎర్రకుంటనే కాలక్రమంలో బతుకమ్మ కుంటగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. కాలక్రమంలో బతుకమ్మకుంటలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు లేకుండా పోయిందంటున్నారు. అంబర్?పేట పరిధిలోని బతుకమ్మ కుంట స్థలం తమదేనంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 జనవరి 8న హైకోర్టు కొట్టేసింది. హైడ్రాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో హైడ్రా పునరుద్ధరణ చర్యలు చేపట్టింది.



# జెఎన్‌టియూ విసిగా కిషన్ కుమార్ రెడ్డి



హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు ):
తెలంగాణ ప్రభుత్వం జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీకి వీసీని నియమించింది. వైస్ ఛాన్సలర్ గా టీ కిషన్ కుమార్ రెడ్డిని నియమించింది. వీసీ నియామకానికి సంబంధించిన ఫైల్ పై రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకం చేయడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జేఎన్‌టీయూ వీసీగా కిషన్ కుమార్ రెడ్డి.. పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. గతేడాది మే 21న ఖాళీ అయిన వర్సిటీ వీసీ పోస్టును భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా సాంకేతిక కారణాల రీత్యా నియామక ప్రక్రియ వాయిదా పడింది. తాజాగా జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీకి పూర్తిస్థాయి వీసీని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరో వైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రం లో పలు యూనివర్సిటీలకు ప్రస్తుతం ఉన్న ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ల స్థానంలో రెగ్యులర్ వీసీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# కార్లతో స్టంట్లు చేసిన ఇద్దరు యువకుల అరెస్టు

హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు ):
నగరంలోని ఓఆర్ఆర్‌పై ఇద్దరు వ్యక్తులు రెండు కార్లతో స్టంట్ చేసిన విషయం తెలిసిందే. లగ్జరీ ఎస్‌యూవీ కారుల్లో ఇద్దరు రింగు రోడ్డుపై స్టంట్ చేశారు. ఫార్చ్యూనర్, బీఎండబ్ల్యూ కార్లతో వాళ్లు చక్కర్లు కొట్టారు. ఆ స్టంట్ అక్కడ ఉన్న సీసీటీవీ కెమెరాలకు చిక్కింది. ఫిబ్రవరి 9వ తేదీన ఈ ఘటన జరిగింది. అయిదు లేన్ల రోడ్డుపై వాళ్లు ఆ స్టంట్ పర్ఫార్మ్ చేశారు. లగ్జరీ కార్లతో స్టంట్ చేసిన విద్యార్థుల్ని పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు పోలీసులు వాళ్లను అరెస్టు చేశారు. రాజేంద్రనగర్‌కు చెందిన 25 ఏళ్ల మొహమ్మద్ అబ్దుల్లా, మలక్‌పేటకు చెందిన 25 ఏళ్ల జోహెయిర్ సిద్ధిక్‌లను ఆధీనంలోకి తీసుకున్నారు. లగ్జరీ కార్లను కూడా సీజ్ చేశారు.

## సంపాదకీయం..

# నివురుగప్పిన అవినీతి నిప్పు !

మంత్రులు కమిషన్లు లేనిదే పనిచేయడం లేదన్న బిజెపి ఆరోపణలు..ఇప్పుడు కాంగ్రెస్ పనితీరుపై అనుమానాలను రేకెత్తిస్తోంది. ప్రతి పనికి 10 నుంచి 15 శాతం కమిషన్ ముట్టచెప్పుకోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని అంటున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపి ఈటెల రాజేందర్ తదితరులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఇది నిజమా అని ఆలోచించే సమయం ఆసన్నమయ్యింది. కెసిఆర్ ప్రభుత్వ అవినీతి గురించి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. అలాగే కాంగ్రెస్ అధిష్టానం కూడా నిధుల కోసం తెలంగాణపై ఆధారపడుతోందన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలను సంతృప్తి పరిచేందుకు ఇక్కడ కమిషన్ల కక్కుర్తి మొదలయ్యిందన్న ఆరోపణలు నిజంగానే బాధ కలిగించేవిగా ఉన్నాయి. ఓ రకంగా విపక్ష బిఆర్ఎస్‌కు ఇది అందివచ్చిన అస్త్రం. ఏమాత్రం సమాచారం దొరికినా పట్టుకుని ఏకిపారేసేందుకు వారు సిద్దంగా ఉన్నారు. ఇకపోతే బిల్లులు మంజూరుకు ఓ మంత్రి భార్య నేరుగా కమిషన్లు డిమాండ్ చేస్తోందని కూడా అక్కడా ఇక్కడా గ్రామాల్లో కూడా జనం చర్చించు కుంటున్నారు. బిఆర్ఎస్ అవినీతిపై పోరాడుతున్న కాంగ్రెస్ తానే ఈ బురదలో కూరుకుంటే ఇక చేసేదేమీ లేదు. అలాగే కేంద్రానికి కప్పం కట్టేందుకు అవినీతి కూపంలో దిగితే ప్రజలు గమనిస్తూనే ఉంటారు. బిఆర్ఎస్ ఇలా చేసే మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు బిఆర్ఎస్‌ను అవినీతి పార్టీగా ముద్రవేసి పాలన చేస్తున్న కాంగ్రెస్ కూడా మూల్యం చెల్లించుకోక తప్పదు. తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా ..అని సామెత ఉంది. చేసిన తప్పులన్నీ చేసి..ఇప్పుడు కాంగ్రెస్ మీదపడి ఏడుస్తున్నారని ఇంతకాలం బిఆర్ఎస్ ను విమర్శించి, మనం కూడా అదే ఊబిలో దిగితే కాంగ్రెస్ పార్టీని కూడా ప్రజలు నమ్మరు. ఇంతకాలం బిఆర్ఎస్ పదేళ్ల పాపాల గురించి మాట్లాడారు. ఇప్పుడిక కాంగ్రెస్ అవినీతి గురించి చర్చ మొదలయితే ఆ పార్టీని కాపాడడం కష్టమే. ఎందుకంటే మంత్రులపై సిఎం రేవంత్‌కు పట్టు లేదన్న విమర్శలు వస్తున్నాయి. నిప్పులేనిదే పొగరాదు. బిజెపి చేసిన ఆరోపణలను రేపు బిఆర్ఎస్ చేస్తుంది. అలాగని కాంగ్రెస్ మడిగట్టుకుని కూర్చున్న పార్టీ కాదు. అవినీతిలో ఆరితేరిన చేయి దానిది. ఇంతకాలం తమ పాలనలో అవినీతి వ్యవహారాల గురించి సమాధానం చెప్పడం లేదని ప్రజలు బిఆర్ఎస్‌ను నిందిస్తున్నారు. వారి పాలనలో మల్లన్నసాగర్ రైతులు తిరగబడితే ఎందుకు కేసులు పెట్టారో చెప్పాలని, ఖమ్మం జిల్లాలో రైతులపై ఎందుకు కాల్పులు జరిపారో..ఎందుకు బేడీలు వేశారో చెప్పారని అడుగుతూ వచ్చారు. కాళేశ్వరం అవినీతిపైనా మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలో రైతులను రెచ్చగొట్టిన ఘటనకు సమాధానం చెప్పాలని అన్నారు నిజానికి ఫార్మా కంపెనీల సృష్ట ప్రదాత కెటిఆర్. దానిని ఎవరూ కాదనలేరు. రైతుల భూములను అడ్డంగా లాక్కుని వ్యాపారం చేయడం ఎవరు చేసినా నిలదీయాల్సిందే. కానీ బిఆర్ఎస్ కాదు. అది ప్రజలకు వదిలేయాలి. అవినీతి నేతలు నీతులు వల్లించడం సరికాదు. ఎందుకంటే బిఆర్ఎస్ గురించి చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా అవినీతి కథలు ఉన్నాయి. కానీ ఎదురుదాడి చేయడం, గగ్గోలు పెట్టడం ద్వారా ఎంతోకాలం నమ్మించలేరు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి జరిగిందని అంటున్నారు. నిజంగానే అవినీతి జరిగితే బయటకు లాగాల్సిందే. రేవంత్ అయినా, రాహుల్ అయినా అవినీతి వ్యయహారంఆలపై చర్చ చేయాల్సిందే. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదస్ మున్సీ కూడా వాటాల కోసం డిమాండ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఇప్పటి వరకు ఇవన్నీ ఆరోపణలే కావచ్చు. కానీ నిజం బయటపడితే భగ్గున మండుతుంది. అవినీతిపై చర్చలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి నేతలు ఎవరున్నా వదిలిపెట్టకుండా రచ్చబండ ఏర్పాటు చేస్తే మంచిది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఆ తర్వాత పార్టీలోని కొందరు కీలక నేతలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడం వంటి పరిణామాలతో సహజంగానే బిఆర్ఎస్ పార్టీలో కొంత నీరసం ఆవహించింది. ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెల్చుకోక పోవడం కూడా గులాబీ పార్టీకి రాజకీయంగా భారీ దెబ్బ పడింది. మరోవైపు లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడం కూడా ఆ పార్టీని దెబ్బతీసింది. ప్రతిపక్ష నేతగా చురుకుగా ఉండాల్సిన కెసిఆర్ ఇంటికే పరిమితం కావడం చూస్తున్నాం. అధికారం లేకుంటే అసెంబ్లీలో అడుగు పెట్టమన్న రీతిలో కెసిఆర్, జగన్ తీరు ఉంది. ఈ క్రమంలో తమపై అవినీతి కేసుల దాడి పెరగడంతో ఆత్మరక్షణ కోసం బిఆర్ఎస్ విన్యాసాలు చేస్తోంది. ఎదురుదాడిని ఎంచుకుంది. ఇప్పుడు కాంగ్రెస్‌పై వస్తున్న ఆరోపణల్లో నిజం ఉన్నా లేకున్నా రచ్చ చేసేందుకు బిజెపికి తోడు బిఆర్ఎస్ కూడా ముందుకు రావడం ఖాయం. ఇప్పటికే కాంగ్రెస్ పాలనా వైఫల్యాల ఆధారంగా కెటిఆర్ గత కొద్ది రోజులుగా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావులు ఇద్దరూ అధికార కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. అంశాలవారీగా కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేల చేరిక విషయంలో న్యాయస్థానంలో సవాల్ విసిరారు. బిసి కులగణన,రైతుల రుణ మాఫీ, హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన వంటి అంశాలపై గగ్గోలు చేస్తున్నారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో విదేశీ కంపెనీకి అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రూ.55 కోట్లు నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని, ఈ కేసులో ఏసీబీ విచారణ చేస్తోంది. దీనిపైనా పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. ఇలా తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కిన సమయంలో కాంగ్రెస్ అవినీతి వ్యవహారం అంటూ బిజెపి నేతలు విమర్శలు చేయడం సంచలనానికి దారి తీసింది. బిజెపితో బిఆర్ఎస్‌కు లోపాయకారి ఒప్పందం ఉందని ఆరోపించినంత మాత్రాన ఆరోపణల తీవ్రతను తగ్గించలేం. ఈ క్రమంలో తెలంగాణలో తమపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా మంత్రులు జాగ్రత్తగా ఉండాలి. ప్రజా సమసయలపై శ్రద్ద పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా మంత్రి కేటీఆర్ ఇప్పటికే అమృత్ టెండర్ల వ్యవహారన్ని తెరపైకి తెచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అమృత్ పథకంలో స్కాంకు తెరలేపారని ఆరోపించారు. అంతే కాకుండా రెవెన్యూ మంత్రి పొంగులేటికి సంబంధించిన స్కాంలను బయటపెడతానని కెటిఆర్ గతంలోనే హెచ్చరించారు. తప్పులేదు. రేవంత్, పొంగులేటిలు తప్పు చేసివుంటే కోర్టుకీడ్చాల్సిందే. అందుకే అందిరి అవినీతిపైనా చర్చ జరగాలి. విచారణ జరగాలి. కేసులు వేయాలి. అందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు మాత్రమే పరిష్కారం చూపగలవు. అందుకు రాజకీయ నేతలు సిద్దమా కాదా అన్నది చెప్పాలి.

# అమెరికా ఫస్ట్ విధానంతో ..పట్టు బిగించే యత్నం

- ప్రపంచం మీద పెద్దన్న పెత్తనం కోసం ట్రంప్ వెంపర్లాట

వాషింగ్టన్,ఫిబ్రవరి18( వెలుతురు ):



రెండోసారి ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాక ప్రపంచం మీద అమెరికా ఆధిపత్యం సాధించాలన్న పట్టుదల కనిపిస్తోంది. అక్రమ వలసదారులను నిర్దాక్షిణ్యంగా ఏరిపారేయడం, సుంకాలు పెంచడం, వివిధ దేశాల్లో జోక్యం చేసుకోవడం వంటివన్నీ ఆయన దూకుడు వ్యవహారాన్ని కనబరుస్తున్నారు. వీసా నిబందనలు కఠినంగా అమలు చేయాలని చూస్తున్నాడు. తమగడ్డపై పిల్లను కంటే అమెరికా పౌరసత్వం రాకుండా ఆదేశాలు ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రకాలుగా నిర్ణయాలు తీసుకుంటున్నాడు. మాటల్లో, చేతల్లో తన లక్ష్యం ఆధిపత్యం అన్నది స్పష్టంగా కనిపిస్తున్నది. ఎక్కడా కూడా అయన రాజీ ధోరణి వ్యక్తం చేయడం లేదు. సుంకాల తగ్గింపు కుదరదని మోడీకి మొహం మీదే చెప్పేశాడు. తన దేశ హితమే ముందు అన్న విధంగా అమెరికా ఫస్ట్ సిద్దాంతాన్ని ప్రకటించుకున్నాడు. అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింతగా బలోపేతం చేసేందుకు వాణిజ్యం మీద దృష్టి సారించినట్లుగా కనిపిస్తున్నది. ప్రధానంగా సుంకాల మీద దృష్టి కేంద్రీకరించాడు. ఒకవైపు ఉక్రెయిన్, రష్యా యుద్ధం ఆపాలని కోరుతూనే, గాజాపై కబ్జాకు ఉపక్రమించే పరిస్థితి చూస్తున్నాం. దశాబ్దాలుగా భారతదేశంలో ఇతర దేశాల జోక్యం అంగీకరించని ఇండియాకు చైనాతో ఉన్న వివాదం పరిష్కరిస్తామని కూడా పేర్కొన్నాడు. గతంలో ఒబామా కాలంలో ఇదే విషయం ప్రస్తావనకు వస్తే, అప్పటి పీఎం మన్మోహన్ సింగ్ సున్నితంగా తిరస్కరించారు. ఏ దేశంతోనైనా నేరుగా చర్చించి తన సమస్యను తాను పరిష్కరించుకునే సత్తా ఇండియాకు ఉందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'గాజా' మీద ఇజ్రాయెల్ యుద్దాన్ని అక్కడి ప్రధాని నెతన్యాహును ఒప్పించి ఆపించానని చెప్పాడు. షరతుల ప్రకారం హమాస్ వద్ద, అటు ఇజ్రాయెల్ వద్ద ఉన్న ఇరుపక్షాల ఖైదీలను విడతలవారీగా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గాజా మీద యాజమాన్య హక్కు తనకు ఉంటుందని అక్కడ సముద్రపు ఒడ్డున రిసార్టులు, ఇతర ఏర్పాట్లు చేస్తామని, అందుకు గాజాను ఖాళీ చేయాలని ట్రంప్ తెలిపాడు. ట్రంప్ ప్రకటన నెతన్యాహుకు ఆమోదమే. ఎందుకంటే గాజా నుంచి జనాన్ని ఖాళీ చేయించడమే ఆయన లక్ష్యం. ఇక్కడ వీరిద్దరి ఉద్దేశం ఒక్కటే అని తేలిపోయింది. క్రమంలో హమాస్ తమ వద్ద ఉన్న, అఖరి ఆయుధమైన ఖైదీల విడుదల విషయంలో కొంత ఆలస్యం చేయడమేకాక యుద్ధం, దాడులు మళ్ళీ గాజా ఖాళీ చేయించే విషయంలో నెతన్యాహు, ట్రంప్ కలిసి దాడి చేసే అవకాశం ఉందని అప్రమత్తం అవుతున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు తాము గాజా విడిచి ఎటు పోతామని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి 15న హమాస్ నిర్బంధంలో ఉన్న ఇజ్రాయెల్ ఖైదీలను విడుదల చేయాలని ట్రంప్ వార్నింగ్ జారీ చేశాడు. దీంతో మళ్ళీ గాజా మీద దాడి తప్పదా అనే పరిస్థితి నెలకొన్నది.కొన్నిచోట్ల దాడులు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే గాజాలో పాలస్తీనీయులు వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. 92 శాతం గృహాలు, 70 శాతం పెద్ద భవనాలు, ఆసుపత్రులు నేలమట్టం అయ్యాయి. నిరాశ్రయులు ఉండడానికి షెల్టర్ లేదు. గాజా పునర్‌నిర్మాణానికి పదిహేను ఏండ్లకు పైగా పడుతుంది. అయితే, యుద్ధం, బాంబుల వల్ల భూమి పనికి రాకుండా అయ్యిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో గాజాను కబ్జా చేసే పనిలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నాడు. అయితే, తాజాగా ట్రంప్ మాటలను చైనా ఖండిస్తూ ముమ్మాటికీ గాజా పాలస్తీనా ప్రజలదే అని పేర్కొంది. ట్రంప్ ఆలోచన ప్రపంచ దేశాలలోని మెజారిటీ ప్రజలు విమర్శిస్తున్నారు. మొత్తానికి ట్రంప్ వ్యవహారం ప్రపంచంపైన ఆధిపత్యం సాధించే దిశగా కొనసాగుతోంది. వాణిజ్యంలోనూ అమెరికా నవంబర్ వన్?గా రాణించాలని తహతహలాడుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు ఏం చేస్తాయో వేచిచూడాలి.

# బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్ ఓ ఉగ్రవాది

- దేశానికి తిరిగి వస్తా..ప్రతీకారం తీర్చుకుంటా
- కార్యకర్తలకు మాజీ ప్రధాని హసీనా ఓదార్పు

ఢాకా,ఫిబ్రవరి18( వెలుతురు ):





బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఓ ఉగ్రవాది అంటూ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఘాటు విమర్శలు చేశారు. అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఓ బహిరంగ కార్యక్రమంలో.. హసీనా జూమ్‌కాల్ ద్వారా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె కార్యకర్తలను ఉద్దేశిస్తూ మాట్లాడారు. తాను బంగ్లాకు తిరిగి వస్తానని, పార్టీ కార్యకర్తల మరణాలకు ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. 'అవామీ లీగ్ పార్టీ నాయకులు ఓపికగా.. ఐక్యంగా ఉండాలి. నేను నా దేశానికి తిరిగి వస్తా. పార్టీ కార్యకర్తల మృతికి ప్రతీకారం తీర్చుకుంటా. గతంలో మాదిరిగానే అందరికీ న్యాయం చేస్తా. జులై- ఆగస్టుల్లో జరిగిన నిరసనల్లో మరణించినవారు పోలీసుల కాల్పుల కారణంగా చనిపోలేదు. ఇప్పుడు పోస్టుమార్టం నిర్వహిస్తే నిజాలు రుజువు అవుతాయి. విద్యార్థులు చేసిన ఆందోళనలకు అనేకమంది పోలీసులు, అవామీ లీగ్ కార్యకర్తలు, విద్యావంతులు, కళాకారులు హత్యకు గురయ్యారు. అయినా యూనస్ వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. దేశాన్ని నడపడంలో తనకు ఎలాంటి అనుభవం లేదని గతంలోనే ఆయన అంగీకరించారు. అన్ని విచారణ కమిటీలను రద్దు చేసి దేశాన్ని నాశనం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై, అధికారులపై దాడులు చేయడం యూనస్ అసమర్థతకు నిదర్శనం. ప్రణాళికతోనే నా తండ్రి నివాసాన్ని నాశనం చేశారు. మధ్యంతర ప్రభుత్వం ఏర్పడి ఇన్ని నెలలు గడుస్తున్నా.. అల్లర్లు ఆగలేదు. దేశ ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో ఉంది. శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి, ప్రజల భద్రత ప్రమాదంలో ఉంది. ఈ ఉగ్రవాద ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి' అని ఆమె పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆందోళనల్లో మృతిచెందిన పలువురు పోలీసుల కుటుంబాలతో హసీనా మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో గతేడాది ఆగస్టు 5న దేశం వీడిన షేక్ హసీనా.. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో హసీనాతోపాటు ఆమె మంత్రివర్గంలో ఉన్న నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. ఈక్రమంలో ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఇప్పటికే ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేసింది. మరోవైపు.. యూనస్ సర్కారు ఆపరేషన్ డెవిల్ హంట్‌ను ప్రారంభించింది. దేశాన్ని అస్థిరపరిచే కుట్రదారులను, చట్ట ఉల్లంఘనలకు పాల్పడేవారే లక్ష్యంగా ఈ ఆపరేషన్ చేస్తున్నట్లు బంగ్లా హోం మంత్రి తెలిపారు. ఇక, హసీనా ప్రభుత్వంలో పనిచేసిన 41 మంది పోలీసు అధికారులను సోమవారం బంగ్లా ప్రభుత్వం అరెస్టు చేసింది. విద్యార్థుల ఆందోళన సమయంలో వారిని అణచివేశారంటూ 1059 మంది పోలీసు అధికారులను, సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించింది.

# హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్‌ను దొంగిలించిన ఇన్ఫోసిస్

- కాగ్నిజెంట్ విమర్శలతో రచ్చకెక్కిన విభేదాలు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి18( వెలుతురు ):

ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలైన కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్‌ల మధ్య పోరు కొనసాగుతోంది. యూఎస్‌లో ఓ దావాపై ఈ ఇరు సంస్థలు గత కొంతకాలంగా పోరాడుతున్నాయి. ఈనేపథ్యంలో ఇన్ఫోసిస్‌పై కాగ్నిజెంట్ పెద్దఎత్తున ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. తమ హెల్త్ కేర్ సాఫ్ట్‌వేర్ ట్రైజెట్టో నుంచి వాణిజ్య రహస్యాలని ఇన్ఫీ దొంగిలించిందని విమర్శించింది. ఈవిషయాన్ని ఉటంకిస్తూ ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. నాన్ డిస్‌క్లోజర్ అండ్ యాక్సెస్ అగ్రిమెంట్ ద్వారా ట్రైజెట్టో వాణిజ్య రహస్యాలను దుర్వినియోగం చేస్తూ ఇన్ఫోసిస్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిం దంటూ కాగ్నిజెంట్ ఆరోపించింది. అంతేకాదు ఈవిషయంపై ఆడిట్ చేసేందుకు ఆ కంపెనీ నిరాకరించిందని కాగ్నిజెంట్ తెలిపింది. హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్ ట్రైజెట్టో నుంచి వాణిజ్య రహస్యాలను ఇన్ఫోసిస్ దొంగిలించిందని ఆరోపించిన కాగ్నిజెంట్ 2024 ఆగస్టులో అమెరికా కోర్టులో దావా వేసింది. ఈ ఆరోపణల్ని ఇన్ఫోసిస్ తిరస్కరించింది. కాగ్నిజెంట్ హెల్త్‌కేర్ సొల్యూషన్స్ బహిరంగంగా ఉన్నాయని తెలిపింది. అంతేకాదు.. ప్రస్తుతం కాగ్నిజెంట్‌లో ఉన్న రవికుమార్.. తమవద్ద పనిచేసిన సమయంలో హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్ విడుదల చేయడాన్ని ఆలస్యం చేశారని ఇన్ఫోసిస్ ప్రత్యారోపణలు చేసింది. కాగ్నిజెంట్‌లో ఉద్యోగం కోసం ఆయన చర్చలు జరిపారని పేర్కొంది. ఇన్ఫోసిస్ అధ్యక్షుడిగా వ్యవహరించిన రవికుమార్ 2022 అక్టోబర్‌లో ఆ సంస్థను విడిచిపెట్టారు. ఆ మరుసటి ఏడాది జనవరిలోనే కాగ్నిజెంట్‌లో సీఈఓగా చేరారు. ఈ రెండు ఐటీ కంపెనీలు ఆరోగ్య సంరక్షణ సేవల రంగంలో పోటీపడుతున్నాయి. ఇన్ఫోసిస్ ఆదాయంలో దాదాపు 7.5 శాతం లైఫ్ సైన్సెస్ విభాగం నుంచి పొందుతోంది.







# స్కూళ్లలో పల్లీపట్టీల పంపిణీకి ప్రభుత్వం బ్రేక్

- అరటిపండు, గుడ్డు సరఫరాకు కర్టాటక నిర్ణయం

బెంగళూరు,ఫిబ్రవరి18( వెలుతురు ):

పల్లీపట్టీలతో పిల్లల ఆరోగ్యానికి చేటు అన్న ఆరోపణలు రావడంతో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో ఇకనుంచి పల్లీపట్టీల పంపిణీని నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల జరిపిన పరీక్షల్లో వాటిలో అత్యధికంగా చక్కెర, హాని కలిగించే కొవ్వులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇవి పిల్లల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపే ప్రమాదం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. గడువు తీరిన, సరిగా నిల్వ చేయని పల్లీపట్టీలు కూడా ఉండటంతో పంపిణీని నిలిపివేస్తున్నామని ధార్వాడ్ డిప్యూటీ కమిషనర్ (పాఠశాల విద్య) పేర్కొన్నారు. మధ్యాహ్నభోజన పథకం కింద పాఠశాలల్లో పల్లీపట్టీలకు బదులుగా గుడ్డు లేదా అరటిపండు పంపిణీ చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. 2021 నుంచి మధ్యాహ్నభోజన సమయంలో గుడ్లు తినని పాఠశాల విద్యార్థుల కోసం కర్ణాటక ప్రభుత్వం అరటిపండ్లను లేదా వేరుశెనగ-బెల్లంతో చేసిన చిక్కీలను పంపిణీ చేస్తోంది. 2022 డిసెంబర్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కి పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ డిపార్ట్‌మెంట్ అందించిన డేటా ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 2.27 లక్షల మంది పిల్లలు మాత్రమే వీటిని ఎంచుకోగా దాదాపు 80శాతం విద్యార్థులు గుడ్లును ఎంచుకుంటున్నారు.

# సాంస్కృతిక సంస్థలకు చేయూత నందించాలి





**వెలుతురు సిటీ కల్చరల్ 18, ఫిబ్రవరి :** కళ పోషకులు కళా, సాంస్కృతిక సంస్థలకు చేయూ తనందించాలని ప్రముఖ సంఖ్యా శాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ అన్నారు. ఆర్కా గ్రూప్ సౌజన్యంతో రాగా ఆర్ట్స్ కల్చరల్స్, శ్రీరామ సాంస్కృ తిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కళా పోషకుడు కెయి రాజు పుట్టినరోజు వేడుకల సందర్భంగా తెలంగాణ సారస్వత పరిషత్ లో 'రాజువయ్యా మహారాజువయ్యా' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి జనరంజకంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సరస్వతి ఉపసకులు దైవజ్ఞ శర్మ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. కెయి రాజు సంస్కృతిక రంగానికి చేస్తున్న సేవ లు గొప్పవని తెలిపారు. ఆయన జ న్మదిన వేడుకలు కళాకారుల మధ్య జరుపుకోవడం సంతోషదాయకమ న్నారు. సభకు ముందు గాయని, గాయకులు బాల కామేశ్వరరావు, వినోద్ బాబు, వైఎస్ రామకృష్ణ, భాస్కర్, కె.మోహన్, రాజన్, క్షాస్య, శశికళాస్వామి, సురేఖామూర్తి, అ నురాధ, రేవతి, శ్రీదేవి, శారదా, పవన్, ఉమాపతి, లక్ష్మీగాయత్రి, కేశవ్,చందన, కె.సింధు, చరిత,రవికుమార్, శ్రీమణి, రజని తదిత రులు ఆలపించిన సినీ గీతాలు అల రించాయి. ఈ కార్యక్రమంలో సంగీ త దర్శకులు కె. రామాచారి, సినీ నేపథ్య గాయని విజయలక్ష్మి, చంద్ర శేఖర్ గొర్తి తదితరులు పాల్గొన్నా రు.

# డివిజన్ లోని నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

- డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**
మంగళవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ లోని జైస్వాల్ బాడ లో నెలకొన్న తాగునీటి సమస్యను డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ దృష్టికి తీసుకురావడంతో తాను జలమండలి అధికారులతో కలిసి మంగళవారం రోజున పర్యటించి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్, అనీష్, శేఖర్, సందీప్, బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం..

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 18:**



అమెరికాకు వలస వెళ్లిన భారతీయులను ఆ దేశం ఖైదీల్లా చూస్తోందని,ఈ దుశ్చర్యను బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ అమెరికా నుంచి వందలాదిమంది భారతీయులని బంధించి వారిని యుద్ధ విమానాల్లో తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. అమెరికాలో వలసదారులుగా ఉన్న భారతీయులను కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీల్లాగా పంపించడం తగదన్నారు. యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను కూడా గౌరవంగా చూడాలన్న నిబంధనలు ఉన్నాయని గానీ అమెరికా మాత్రం నిరంకుశంగా వ్యవహరిస్తోందని లింగంగౌడ్ అన్నారు. భారతీయుల పట్ల అమెరికా దుశ్చర్యను పూర్తిగా ఖండించి, వెంటనే ట్రంపు చేసే నిరంకుశ విధానాలకు స్వస్తి పలికే విధంగా ప్రధానమంత్రి, విదేశాంగ శాఖ మంత్రి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో, చర్చలు జరిపి వారి విధానాలకు స్వస్తి పలకాలన్నారు.

# నూతన భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్



**వెలుతురు, హయత్ నగర్, ఫిబ్రవరి 18:** హయత్ నగర్ డివిజన్ సత్య నగర్ కాలనీలో మంగళ వారం నాడు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నూతన భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో కాలనీవాసులకు ఎలాంటి భూగర్భ డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా పైప్ లైన్ నిర్మాణం చేయాలని, అదేవిధంగా గత నాలుగు సంవత్సరాలుగా ఎన్నడూ లేని విధంగా హయత్ నగర్ డివిజన్ అభివృద్ధి చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో హయత్ నగర్ డివిజన్ మరింత అభివృద్ధి పరిచేలా కృషి చేస్తానని నవ జీవన్ రెడ్డి తెలిపారు,ఈ కార్యక్రమం లో జలమండలి మేనేజర్ రాజు ,సూపర్ వైజర్ బాలు ,మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని ప్రైవేటు హాస్పిటల్స్ చట్టపరమైన నిబంధనలు పాటించాలి

- అర్హత కలిగిన డాక్టర్లు మాత్రమే వైద్యము అందించాలి,
- అన్ని ఆస్పత్రులు, ల్యాబ్, క్లినిక్స్ కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి
- చట్టబద్ధంగా ప్రాక్టీస్ చేయాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

(రాపర్తి భాస్కర్ గౌడ్)



**వెలుతురు,హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 18:** హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో అర్హత కలిగిన డాక్టర్లు, సిబ్బందిచే వైద్యము అందించాలని, చట్టపరమైన నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారము హరిహర కళాభవన్ సికింద్రాబాద్ లో ప్రైవేటు ఆసుపత్రులు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఫిజియోథెరపీ, ఎక్రే్స, స్పీచ్ థెరపీ మరియు ఆయుష్ క్లినిక్ల యొక్క మెడికల్ డైరెక్టర్లు యజమానులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విధిగా అర్హత కలిగిన డాక్టర్లు మాత్రమే వైద్యము నిర్వహించాలని, అర్హతకు మించి వైద్యము చేయరాదని, రోగులకు సరియైన వసతులు సదుపాయములు కల్పించాలని, అర్హత కలిగిన సిబ్బంది మాత్రమే సేవలు పరిచర్యలు చేయాలని, రోగుల నుండి అధిక ఫీజులు వసూలు చేయరాదని, ప్రతి సంవత్సరము తమ సర్వీసు రేట్లు సమర్పించాలని, వాటి ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని, ప్రతి ఒక్కరూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పిసి పిఎన్డిటి ఆక్ట్, ఎంటి పీ ఆక్ట్ మరియు సరోగసి చట్టముపై అవగాహన కలిగి, చట్ట పరిధిలోని నిబంధనలు పాటిస్తూ ఆసుపత్రులను నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ విధానాలలో ప్రైవేటు ఆసుపత్రులు భాగస్వామ్యం వహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. చట్టాలను, నిబంధనలను ఉల్లంఘించిన ప్రైవేటు ఆసుపత్రుల పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కొందరు ఆటిజం, వెల్నెస్ సెంటర్లు, బరువు తగ్గిస్తామని, స్పీచ్ థెరపీ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, వీరందరూ కూడా రిజిస్టర్ చేసుకోవాలని పరిధి దాటి వైద్యం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినారు. ఇండియన్ మెడికల్ , స్త్రీల వైద్య నిపుణుల , ప్రైవేటు ఆసుపత్రుల , సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల మరియు డెంటల్ డాక్టర్ల అసోసియేషన్ మరియు అన్నీ అసోసియేషన్ లు తమ సభ్యులకు ఎస్టాబ్లిష్మెంట్,, పి సి పి ఎన్ డి టి, ఎం టి పి మరియు సరోగసి చట్టాల నిబంధనలపై చర్చించి అవగాహన కల్పించాలన్నారు.ఈ నిబంధనలన్నీ పాటించుటలో ప్రైవేటు ఆసుపత్రులు భారంగా భావించకూడదని అన్నారు.అన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లో రిజిస్టర్ కావాలని, ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది యొక్క వివరములు అన్నియు విధిగా నమోదు చేయాలని, విఫలమైనచో చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.ప్రైవేటు ఆసుపత్రులన్నియు, డాక్టర్లందరూ మానవసేవయే మాధవసేవ అనే దృక్పథంతో మంచి వైద్యం అందించాలని విజ్ఞప్తి చేసినారు. ఈ సందర్భంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పీసీ అండ్ పి ఎన్ డి టి యాక్ట్, ఎంపీపీ యాక్ట్, సరగోసి యాక్ట్, ఆయుష్మాన్ భారత్, ఐ హెచ్ ఐపి యాక్ట్ వివరముల పుస్తకాన్ని ఆవిష్కరించారు. వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ బి రవీంద్ర నాయక్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ఉద్దేశ్యము, చట్టంలోని నిబంధనలను వివరించినారు. అన్ని ప్రైవేటు ఆసుపత్రులు మినిమం స్టాండర్డ్స్ పాటిస్తూ వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా పొల్యూషన్ కంట్రోల్ అధికారి, జిల్లా అగ్నిమాపక అధికారి, ప్రైవేటు ఆసుపత్రులు పాటించవలసిన నిబంధనల గురించి వివరించినారు.తదుపరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆశ్రీతరెడ్డి, సదుపాయకర్తలు శ్రీమతి కల్పనా తోరన్, ప్రొఫెసర్ రవికిరణ్ శర్మ అవగాహన కల్పించినారు. జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కన్వీనర్, సెక్రటరీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె వెంకటి ముఖ్య అతిథులకు స్వాగతం పలికి, జ్యోతి ప్రజ్వలన తర్వాత,




కార్యక్రమం యొక్క ఉద్దేశ్యము, ఆశిస్తున్న ఫలితాలపై వివరించి, జిల్లాలో రిజిస్టర్ కాకుండా ఉన్న ప్రతి ఒక్క ప్రైవేటు ఆసుపత్రులు క్లినికులు తక్షణమే రిజిస్టర్ చేసుకోవాలని, ఉల్లంఘించిన వారికి 50 వేల నుండి 5 లక్షల వరకు జరిమానా విధిస్తామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, సహకరించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసినారు. హైదరాబాదు జిల్లాలో సర్వే నిర్వహించి అనుమతి లేకుండా, అర్హత లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈఅవగాహన సదస్సులో అన్ని డాక్టర్ల యొక్క అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తూ, ఈ కార్యక్రమము ఎంతో ఉపయోగకరమని, జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కి సహకరించి నిబంధనలు పాటించి వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిడాక్టర్ వెంకటి, ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు జగన్ మోహన్ రెడ్డి, డాక్టర్ మినహాజ్ నస్రబాది, తానా అధ్యక్షు, కార్యదర్శులు డాక్టర్ సురేష్ గౌడ్, డాక్టర్ నౌ నిహాల్ సింగ్, డాక్టర్ మంజులరావు, నిరంజన్ రెడ్డి, డాక్టర్ సాయి కాంత్, డాక్టర్ తుకారం రాథోడ్, డాక్టర్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజా ప్రభుత్వం హైదరాబాద్ లో కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవీ పాలసీ తీసుకొచ్చాం...

**ఈవీ వాహనాలను ప్రజలు ప్రోత్సహించాలి - టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం...**

**కూకట్ పల్లి ఫిబ్రవరి 18 వెలుతురు:**
రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు, ఉదారత నిర్ణయాలతో రాష్ట్రంలో ఈవీ వాహన యుగం రాబోతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. మంగళవారం న్యూ బోయిన్ పల్లిలోని నెక్స షోరూంలో ఈ విటారా మిస్ప్రెల్స్ మొదటి ఎలక్ట్రిక్ కార్ ను జనరల్ మేనేజర్ సురేష్ బాబు , సీఈఓ హరేరామ సింగ్ , సీనియర్ మేనేజర్ రమణ రెడ్డి, రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సత్యం శ్రీరంగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఈవీ పాలసీ వాహనదారుల్ని ఆకర్షిస్తుండడంతో కార్లు, ఆటోలు, మోటార్ సైకిళ్ళ కొనుగోలు క్రమంగా పెరుగుతోందని పెట్రోల్, డీజీల్ తో నడిచే వాహనాల వల్ల కాలుష్యం పెరుగుతోదంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈవీ కొత్త పాలసీ విధానాన్ని అముల్లోకి




తెచ్చిందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రోడ్ టాక్స్ తో పాటు రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టనుందని అన్నారు. ఆదాయం కంటే హైదరాబాద్‌లో నివసించే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని, హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు పలు విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని, కాలుష్యం కారణంగా ఢిల్లీ ప్రజలు ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతున్నారని సమస్య చాలా తీవ్రంగా మారిందని, హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రాకుండా తెలంగాణ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది అని తెలిపారు. తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుందో, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు, విధానాలు తీసుకుంటుందో ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల స్వీకరణను ప్రోత్సహించడానికి అనేక ప్రాంతాలలో ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ రాజ్ పుత్, హేమంత్, గజానంద్ శేఖర్, రాము గౌడ్, నెక్స షో రూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ జిల్లా నర్సంపేట లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ దేవి తల్లి గారికి నివాళులు అర్పించిన బీజేపీ నాయకులు బోసుపల్లి ప్రతాప్ మరియు గుర్రం చెన్న కేశవ రెడ్డి తదితరులు పాలొన్నారు

**నర్సంపేట వెలుతురు ఫిబ్రవరి 18:**

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు ఎందరో ఉన్నత స్థానంలో ఉన్నారు
- మునగనూర్ లో జ్యోతి రావు పూలే
- గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ తరగతులు




**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 18:** రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మునగనూరు లో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఇన్స్పైర్ & ఇగ్నైట్ ఫౌండేషన్ ద్వారా కిచ్చన్న లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు కార్యక్రమంను నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇన్స్పైర్ & ఇగ్నైట్ ఫౌండేషన్ ద్వారా మానవతా విలువలుబోధించబడవు





ఆచరించబడతాయి,ఒక మనిషి మహోన్నతమైనటువంటి వ్యక్తిగా ఎదగాలంటే విలువలే ప్రధానమనీ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు, మర్యాద ఇవ్వడం పొందడం అనే అంశాల గురించి.మాతృ పితృ ఆచార్యుల గొప్పతనం గురించి. మామూలు మనిషి మహా మనిషి ఎదగాలంటే మానసిక అభివృద్ధి గురించి తదితర విలువలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ఇన్స్పైర్ & ఇగ్నైట్ ఫౌండేషన్ సభ్యులను సత్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ స్టేట్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి , కిచెన్నగారి లక్ష్మారెడ్డి , సీయూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు ,మహాజ్యోతి రావు పూలే గురుకులాల సెక్రెటరీ సైదులు తదితరులు పాల్గొన్నారు. 327 గురుకులాల్లో మనలో ఉన్న అధైర్యం దూరం తొలి మనలో విశ్వాసాన్ని పెంచడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు, క్రమశిక్షణ కు లక్ష్య సాధనకుఈశిక్షణఉపయోగపడుతుంది,1987 లో డిగ్రీ లో కాలేజీ ఎన్నికల్లో గెలిచే ముందు సభలో మాట్లాడాలంటే ఇబ్బంది పడేది. అప్పటి పరిస్థితులు ఉద్యమాలు రాజకీయాల్లో 37 సంవత్సరాలు కష్టపడితే ఈరోజు శాసన సభలో గట్టిగా మాట్లాడే అవకాశం వచ్చిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు,లక్ష్యం సాధించాలంటే దాని




వెనుకలో ఎంత కష్టం ఉంటుంది, అబ్దుల్ కలాం కళలు కనమన్నారు.శ్రమ పడాలి అన్నారు. ప్రపంచ స్థాయిలో మంచి పేరు సాధించాలి.మంచి డాక్టర్ ,ఇంజనీర్ మంచి మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు,సూర్యోదయం కంటే ముందే లేచి మన దినచర్యను ప్రారంభించాలి,మన లక్ష్యాన్ని సాధించడానికి ప్రతి నిమిషాన్ని ఉపయోగించాలి,నా లక్ష్యం చేరడానికి చాలా సంవత్సరాలు పట్టింది,ఇప్పుడు కూడా ఎంత ఉంటే అంత సమయం కష్టపడుతున్నమీ అందరికీ అభినందనలు .ఉపాధ్యాయుల అన్ని రకాలసమస్యలు తొలగించామని మంత్రి తెలిపారు, బదిలీలు , ప్రమోషన్లు , నియామకాలు చేపట్టినా అన్ని రకాల సమస్యలు పరిష్కారం చేసుకుంటూ ముందుకు వస్తున్నాం. రాబోయే పదవ తరగతి పరీక్షల్లో అందరూ మంచి ఫలితాలు సాధించాలి,విద్యా శాఖ అధికారులతో పాఠశాల ప్రిన్సిపల్ లతో హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి గా సమావేశం ఏర్పాటు చేశామన్నారు, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్,ఇతర ఐఎస్ఐ లు కూడా గురుకులాల్లో చదివి వచ్చిన వారే. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు,విద్యా సంబంధ అన్ని వస్తువులు కల్పించాం. శారీరక ,మానసికంగా ఉండాలని శిక్షణ తరగతులు ఏర్పాటు చేశాం. మెస్ ఛార్జీలు పెంచాం.ఆర్థిక సంక్షోభం ఉన్న పాఠశాలలు విద్యార్థుల పట్ల ఉన్న శ్రద్ధ మెస్ ఛార్జీలు సమయానికి పడేలా చేస్తున్నాం. గురుకులాల ప్రైవేట్ భవనాలు అద్దెలు చెల్లించాం. మీరంతా కష్టపడి ఉజ్వల భవిష్యత్ ను పొంది శిఖరాగ్రాలకు ఎదగాలి ఈ దశను సక్సెస్ చేసినప్పుడే భవిషత్ లో మన గమ్యాన్ని చేరడానికి మార్గదర్శకత్వం చేస్తుంది.మీ ఆలోచనలకు అనుగుణంగా అన్ని రకాలుగా ప్రకృతి ,గురువులు అందరూ సహకరించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

## కెసిఆర్ ఫ్లెక్సీలు తీస్తే తీయండి...
## నా ఫ్లెక్సీలు మాత్రం తియ్యకండి ప్లీజ్..

- కూకట్పల్లి ఎమ్మెల్యే ధోరణి, బెదిరింపులు..
- కాంగ్రెస్ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం యుగంధర్ రెడ్డి...



**కూకట్ పల్లి ఫిబ్రవరి 18 వెలుతురు:** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫ్లెక్సీలను తీస్తే తీయండి కానీ నేడు తన జన్మదినం సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను మాత్రం తొలగించొద్దని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రాధేయపడుతున్నానని చెప్పకనే చెబుతున్నాడని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ. బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఎద్దేవా చేశాడు. ఫ్లెక్సీల తొలగింపు విషయంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేస్తూ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న అధికారులను ఒక ఎమ్మెల్యేగా ఉండి నోటికి వచ్చినట్లు తిట్టడం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే పై యుగంధర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు వాళ్ళ విధులు నిర్వహించనీయకుండా ఎమ్మెల్యే బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి... ఫ్లెక్సీల తొలగింపుకు సంబంధం లేదన్నారు. ఫ్లెక్సీల కు సంబంధించిన చట్టం గురించి బిఆర్ఎస్ ప్రభుత్వమే గత పదేళ్లలో ఒక్కటి కూడా ఉండకుండా తేగించిందని చెబుతున్న ఎమ్మెల్యే, మరి ఇప్పుడు ఫ్లెక్సీల తొలగింపుకు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీని తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని ఓపిక కోల్పోతున్నాడని తీవ్రంగా విమర్శించారు.

## గుండె పోటుతో న్యాయవాది మృతి

- విచారం వ్యక్తం చేసిన భిక్షపతి గౌడ్



**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 18:** హై కోర్టు లో కేసు వాదిస్తున్న సమయంలోనే హైకోర్టు న్యాయవాది పసునూరి వేణుగోపాలరావు ఆకస్మికంగా గుండె పోటుతో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది, ఓ కేసు విషయంలో ఆయన వాదిస్తున్న క్రమంలో ఆయన ఒక సరిగా గుండె పోటుకు గురై క్రింద పడి పోవడంతో ఆయన ను వెంటనే న్యాయవాదులు ఆసుపత్రికి తరలించారు, అయితే వేణుగోపాలరావు మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు,న్యాయవాది వేణుగోపాలరావు మృతి పట్ల 21 వ కోర్టు హాల్ లో విచారణ వ్యక్తం చేసింది, అలాగే కోర్టు లో జరిగే అన్ని రకాల వాదనలు, విచారణలు నిలిపివేశారు, కాగా సీనియర్ న్యాయవాది వేణుగోపాలరావు మృతి చెందడం పట్ల హయత్ నగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భిక్షపతి గౌడ్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు.

## మాజీ సీఎం కేసీఆర్ ను కలిసిన సుర్వీ యాదయ్య గౌడ్

**వెలుతురు, హైదరాబాద్, ఫిబ్రవరి 18:**



తెలంగాణ రాష్ట్రా తొలి ముఖ్యమంత్రి తెలంగాణ జాతిపిత మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఎర్రవల్లి ఫాంహౌస్ లో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి కేసీఆర్ కు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు, తెలంగాణ బాపూజీ కేసీఆర్ శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషం గా ఉందని తెలిపారు, అలాగే రైతులు ,కార్మికులు, కర్షకులు సుఖ సంతోషాలతో ఉండాలంటే మళ్లీ మీరే ముఖ్యమంత్రి కావాలని తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడపాలని ఈ సందర్భంగా కేసీఆర్ ను కోరినట్లుగా యాదయ్య గౌడ్ తెలిపారు,

## లంచం తీసుకుంటూ పట్టుబడిన అటవీ శాఖ అధికారులు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏసీబీ అధికారుల కొరడా




**వెలుతురు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 18:** అటవీ ప్రాంతంలో ఉన్న భూమి నుంచి వేరొకరి పట్టా భూమి నుండి మట్టిని తవ్వి రోడ్డు నిర్మాణం కోసం తరలించేందుకు అనుమతి ఇవ్వడానికి లంచం తీసుకుంటూ ఏసీబీ కి పట్టుబడిన అటవీ శాఖ అధికారుల బాగోతం ఇది, దీనికి సంబంధించిన వివరాల ప్రకారం మట్టి తవ్వకాలకు అధికారిక అనుకూలతను చూపేందుకు ఫిర్యాదుధారుని నుండి రూ.30 వేల లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొమరారం అటవీ రేంజ్ అధికారి ఉదయ్ కుమార్, అలాగే అదే రేంజ్ లోని ఇల్లందు డివిజన్, అటవీ బీట్ అధికారి సునావత్ హరిలాల్ లు లంచం తీసుకుంటూ మంగళ వారం నాడు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు, వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన ఏసీబీ అధికారులు కాగా ఈ కేసుతో పాటు ఇతర వివరాల కోసం ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నారు,

## ఘనంగా ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షుని పుట్టిన రోజు వేడుకలు



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు ఫిబ్రవరి 18:** ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి, సంజీవరెడ్డి సి.డ్యా. సి నంబర్,మాజీ ఎంపీ జన్మదిన సందర్భంగా సంస్థాన్ నారాయణపురం ఐ.ఎన్.టి.యు.సి మండల కమిటీ అధ్యక్షుడు దొల గణేష్ అధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.అతడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు నిరహించాడు అని గుర్తు చేసుకున్నారు. అనంతరం పండ్లు వితరణ చేసారు.ఈ కార్యక్రమములో మాజీ ఎంపీపి గుత్తా ప్రేమచందర్ రెడ్డి.కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మునగాల రమణ రెడ్డి.బిచ్యా నాయక్. మైనారిటీ నాయకుడు రహీం షరీఫ్, రాజీవ్‌గాంధీ భవననిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పులమోని శంకర్.సిరిపంగి గోపాల్.సిరిపంగి దశరథ.కురువతి శ్రవణ్.తధితరులు పాల్గొన్నారు.

## కుల గణన డేటా బీసీల సాధికారతకు సహాయపడుతుంది

- పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కూన సత్యం గౌడ్, శిరీష సత్తూర్...



**కూకట్ పల్లి ఫిబ్రవరి 18 వెలుతురు:** సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర కుల సర్వే నిర్వహించి, ఓబీసీల సాధికారత కోసం డేటాను ఉపయోగించాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన కార్యక్రమం దేశానికి దిశా నిర్దేశంగా దేశంలోనే ప్రధమంగా మొదలుపెట్టి రికార్డ్ సృష్టిస్తూ విజయవంతంగా బీసీ కుల గణన సర్వే పూర్తిచేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మంగళవారం శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కూన సత్యం గౌడ్ , శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్ లు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలాగౌడ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## వెలుతురు దినపత్రిక నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గాదె శివ చౌదరి...



**కూకట్ పల్లి ఫిబ్రవరి 18 వెలుతురు:** వెలుతురు దినపత్రిక నూతన క్యాలెండర్ ను కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గాదె శివ చౌదరి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో వెలుతురు పత్రిక చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పత్రికలని, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరవేయడంలో పత్రికల పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ మహిళా ప్రెసిడెంట్ సంధ్య, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు రమణ, వరుణ్, నాగేశ్వరరావు, హనుమంతరావు, శ్రీకాంత్ ,బాలాజీ, చందు,లక్ష్మి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎఫ్ అభ్యర్తి గెలుపు కోసం ప్రచారం

**ఏలూరు,ఫిబ్రవరి18( వెలుతురు ):** ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రులు ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులను గెలిపించాలని కోరుతూ సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు అండగా వుండే అభ్యర్థి, నిరుద్యోగ యువతి యువకుల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం స్వార్థపరుడు నిజాయితీపరులు పోరాట యోధులు దిడ్ల వీర రాఘవులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జన విద్యానవేదిక జిల్లా నాయకులు ప్రత్తి వీరాస్వామి, ప్రతివాడ నాగేంద్ర, శివాజీ, నర్మాల నారాయణ రావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ జయంతినీ ఘనంగా నిర్వహిద్దాం

- కోమ్మాయిగూడెం ఆరే సంఘం అధ్యక్షుడు గడ్డే ప్రభాకర్

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 18**



మండలం కొమ్మాయిగూడెం గ్రామంలో శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకోవాలని వారన్నారు .ఆరే సంఘం ,ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పిద్దాం, ఆరె సంఘం అధ్యక్షులు గడ్డే ప్రభాకర్ శివాజీ యొక్క గొప్పతనాన్ని కొనియాడు పశ్చిమ భారతదేశనా మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొగలిరేకులు ఎదిరించి తన రాజ్యాన్ని నెలకొల్పాడు, తన జీవితాంతం ప్రజా శ్రేయస్సుకై, ఎన్నో గొప్ప నిర్ణయాలు తీసుకొని అందరివాడు అయ్యాడు,అని వారన్నారు. అదేవిధంగా మరాఠా సామ్రాజ్య స్థాపకుడిలో ఛత్రపతి శివాజీ అగ్రకన్యుడు అని వారన్నారు. ఆరె సంఘం అధ్యక్షుడు గడ్డే ప్రభాకర్ గౌరవ అధ్యక్షులు మోటే రవీందర్, మోటి మారయ్య , కార్యదర్శి మోటే నరేష్, ఉపాధ్యక్షుడు కోనాల మల్లేష్, కోశాధికారి మోటే రాజు అందరం కలిసి వేడుకలు నిర్వహిద్దాం, అని పిలుపునిచ్చాడు.

# పెద్దగట్టు జాతరకు విచ్చేసిన నీలం మధు ముదిరాజ్ , పులి దేవేందర్ ముదిరాజ్



**సూర్యాపేట వెలుతురు ఫిబ్రవరి 18:**
తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జాతర గా భావించే పెద్దగట్టు ( గొల్ల గట్టు) జాతరకు మెపా మేపా ( ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కోల కరుణాకర్ ముదిరాజ్ అండ్ ముదిరాజ్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముదిరాజుల యూత్ ఐకాన్ , మెదక్ కాంటెస్ట్ ఎంపీ నీలం ముదిరాజ్, మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ లు ముఖ్యఅతిథిలుగా పాల్గొని లింగమంతుల స్వామి దర్శనం చేసుకొని, మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న, నల్గొండ జిల్లా అధ్యక్షులు కట్ల సైదులు,మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెట్టి యాకయ్య పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నిర్వహించే బైక్ ర్యాలీ నీ విజయవంతం చేయాలి.



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు ఫిబ్రవరి 18:**
సంస్థాన్ నారాయణపురం మండలంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 395 జయంతి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ ద్వారా మండల పరిధిలోని శేరిగూడెం గ్రామంలో గల శివాజీ విగ్రహం దగ్గరికి బైక్ ర్యాలీ ద్వారా చేరుకొని అక్కడ ఘనంగా హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు ఘనంగా జరపాలని నిర్ణయించడం జరిగింది.ప్రముఖులు పాల్గొని ఛత్రపతి శివాజీ మహారాజ్ యొక్క ఆదర్శాలు యువతకు తెలిసే సందేశాలు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో మండల యువకులు, శివాజీ అభిమా హిందూ బంధువులు సంఘటితమై అధిక సంఖ్యలో పాల్గొనవలసినదిగా నారాయణపురం మండలం చత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ ద్వారా కోరడం జరుగుతుంది.

# హిందువుల పండగలను హేళన చేసే చర్యలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి

- అన్యమత ప్రచారం,మద్యం మాంసాలను నిషేధించాలంటూ విశ్వహిందూ పరిషత్ నారాయణపురం మండల కమిటీ తహసీల్దార్ కు వినతి
- సంస్థాన్ నారాయణపురం పోలీస్ అధికారులకు వినతి

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు ఫిబ్రవరి 18:**






రాజులు పోయారు,రాజ్యాలు పోయినాయి కానీ నేటికీ హిందువులకు తెలియకుండానే హిందువుల పండుగలలో ఇతర మతాల చేసే నిర్వకాలు అలానే ఉండిపోయాయి.వాటిని నేటికీ గుర్తించలేక పోతున్నారు హిందువులు. హిందువుల ప్రతి పండగలు తిథుల,పంచాంగ ప్రకారం జరుగుతాయి.ఇతర మతాల వారికి వారు నమ్మే క్యాలండర్ ఉంటుంది. దానికి ప్రకారం వారి పండగలు జరుపుకుంటారు. కానీ ఒక్క శివరాత్రి రోజు మాత్రం మన ప్రాంతంలోని సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని రాచకొండలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయం చుట్టుపక్కల ఇతర మత ఉత్సవాలు నిర్వహిస్తూ మద్యం మాంసాలను ఈ ప్రాంత ప్రజలకు అలవాటు చేశారు. మద్యం ,మాంసాలను నిషేధించాలంటూ విశ్వహిందూ పరిషత్ సంస్థాన్ నారాయణపురం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తాసిల్దార్. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది.విశ్వహిందూ పరిషత్ సంస్థాన్ నారాయణపురం అధ్యక్షులు ఐతరాజు స్వామి మాట్లాడుతూ గత కొంతకాలంగా హిందువుల పర్వదినం సందర్భంగా హిందువులను అగౌరపరుస్తూ హిందువుల పండుగ రోజుల్లో ఇతర మతస్తుల ఆచారాలు పాటించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ హిందువులని అవమానిస్తున్నారు. శివరాత్రి నాడు హిందువులు పరమ పవిత్రంగా భావించే ఉపవాస దీక్షను భగ్నం చేస్తూ రాచకొండలోని శివాలయం పరిధిలో ఇతర మతస్తుల మందిరాలకు వెళ్లే విధంగా హిందువులను ప్రలోభాలకు గురిచేస్తూ. హిందువుల పండగలను హేళన చేసే చర్యలు నేటికీ కొనసాగుతున్నాయి. శివరాత్రి యొక్క ప్రాముఖ్యతను విఘాతం కలగకుండా హిందువులు తమ యొక్క పర్వదినంతో పాటు పవిత్రంగా ఉపవాస దీక్షలు చేసుకునే లా ప్రభుత్వం చర్య తీసుకోవాలని భక్తులకు సరైన సదుపాయాలు కల్పించాలి అని వి.హెచ్.పి బృందం తహసీల్దార్ కి వినతి పత్రాన్ని అందజేశారు. అదేవిధంగాపోలీస్ స్టేషన్ లో వినతి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సహకారదర్శి గరిషే శేఖర్ . మండల కార్యదర్శి పట్నం బాలకృష్ణగౌడ్.మండల ఉపాధ్యక్షులు రాచమల్ల ముత్యాలు. సురివి రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో చిక్కిన మక్తల్ సీఐ చంద్ర శేఖర్

- మరో ఇద్దరు పోలీస్ కానిస్టేబుల్స్

**వెలుతురు, మహబూబ్ నగర్ జిల్లా, ఫిబ్రవరి 18:**




మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ పోలీస్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ చంద్ర శేఖర్ తో పాటు మరో ఇద్దరు పోలీసులు కానిస్టేబుల్ లను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు,కాగా రూ. 40 వేలు డిమాండు చేసి రూ. 20,000/- లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ సర్కిల్ CI జి. చంద్రశేఖర్ సహా ఇద్దరు కానిస్టేబుళ్లు శివరెడ్డి, నరసింహలను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు, అలాగే ఈ కేసుపై దర్యాప్తు జరిపిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు వెల్లడించారు, అంతే కాకుండా ఎవరైనా లంచం అడిగితే 1064 కు కచ్చితంగా కాల్ చేయండి అంటూ ఏసీబీ అధికారులు తెలిపారు,

# జ్ఞాన్ వికాస్ పాఠశాలలో ప్రజాస్వామ్య అవగాహన



**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 18 :**
నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలంలోని జ్ఞాన్ వికాస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రజాస్వామ్య పరిపాలన, ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బస్వరాజ్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి ప్రజాస్వామ్య విలువలు అవగాహన అవసరమని, మంచి నాయకుడిని గుర్తించి ఓటు వేయాలని సూచించారు. అలాగే, డబ్బు కోసం ఓటు అమ్ముకోవద్దని, పోటీదారులు రాజ్యాంగబద్ధమైన అర్హతలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహించిన విద్యార్థి ఎన్నికల్లో ఆరవ తరగతి విద్యార్థి ఎమ్. సాయిరమ్య విజయం సాధించింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ బాపురెడ్డి, ఉపాధ్యాయులు ధన్ రాజ్, శంకర్, లక్ష్మణ్, ఉమాకాంత్, అంబికా, అర్చన, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి ఎమ్మెల్సీల గెలుపుతోనే గ్రాడ్యుయేట్, టీచర్ సమస్యల పరిష్కారం

- పెద్ద శంకరంపేట బిజెపి మండల అధ్యక్షుడు కోణం విఠల్





**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 18 :**
నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట పట్టణంలో ఈనెల 27 తేదీన జరుగనున్న గ్రాడ్యుయేట్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్కా కొమరయ్యలను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బిజెపి పెద్ద శంకరంపేట మండల అధ్యక్షుడు కోణం విట్టల్ పట్టభద్రుల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.. మంగళవారంపెద్ద శంకరంపేట మండల కేంద్రంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇస్తూ ప్రచారం నిర్వహించారు.. . ఈ సందర్భంగా కోణం విఠల్ మాట్లాడుతూ డిగ్రీలు పూర్తిచేసుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న గ్రాడ్యుయేట్స్ సమస్యల పరిష్కారం కావాలంటే అంజిరెడ్డిని గెలిపించుకోవాలని కోరారు.. ఉపాధ్యాయుల సమస్యల్లో ఉన్నారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్యను గెలిపిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.. దేశంలో మోడీ నాయకత్వాన్ని బలపరచదానికి బిజెపిని గెలిపించాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు బొగడాల కృష్ణ. మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్ .. బిజెపి నాయకులు రాజమళ్ళ సాయిలు . సాయి భూషణం భూమేశ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు..

# రాజీవ్ గృహకల్ప కాలనీ లో ఘనంగా గిరిజన బిడ్డల ఆరాధ్యదైవం శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి వేడుకలు

- బంజారా సమాజ అభివృద్ధికి సేవాలాల్ మహరాజ్ బోధనలు మార్గదర్శకం - కాట శ్రీనివాస్ గౌడ్



**అమీన్ పూర్ వెలుతురు ఫిబ్రవరి 18:**
అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీ లో తెలంగాణ బంజారా కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ గారి 286వ జయంతి ఉత్సవాలు ఘనంగా సాగాయి. ఈ కార్యక్రమానికి పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేవాలాల్ మహరాజ్ జీవితం మానవతా విలువలకు ప్రతీక అని, బంజారా సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆయన చూపిన మార్గంలో సమాజ సేవను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు.



## జనార్ధన్‌రావు హత్య కేసులో
# నోరువిప్పిన నిందితుడు

- అలా అనడం వల్లే.. హత్య చేశానని వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు ):



వెల్జాన్ గ్రూపు సంస్థల అధినేత జనార్ధన్ రావు హత్య సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత మనమడే ఆయన్ను 72 సార్లు కత్తితో పొడిచి చంపేయడం తీవ్ర కలకలం పేరింది. ఈ కేసులో నిందితుడు కీర్తి తేజను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, కీర్తి తేజను నాలుగు రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. నాలుగు రోజులుగా నిందితుడిని విచారించిన హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. మొదటి రోజు కీర్తి తేజ నోరు విప్పకపోయినప్పటికీ ఆ తర్వాత హత్యకు గల కారణాలను కీర్తి తేజ పోలీసులకు వివరించాడు. పోలీస్ కస్టడీలో భాగంగా మొదటి రోజు పారిశ్రామివేత్త జనార్ధన్ రావును ఎందుకు హత్య చేశావంటూ పంజాగుట్ట పోలీసులు కీర్తి తేజను ప్రశ్నించారు. రెండో రోజూ నిందితుడిని హత్య జరిగిన ఘటనా స్థలానికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్‌కు ప్రయత్నించారు. అక్కడా నోరు విప్పలేదు కీర్తి తేజ. కానీ, నిందితుడు పారిపోయిన తర్వాత మంటల్లో కాల్చివేసిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ అనంతరం మాత్రం ఎట్టకేలకు కీర్తి తేజ అసలు విషయాలు వెల్లడించాడు. యూ బెగ్గర్ అంటూ తాత జనార్దన్ రావు ప్రతిరోజూ నన్ను అవమానించేవాడు. ఏ రోజూ నన్ను సొంత మనిషిగా చూడలేదు. కుటుంబసభ్యుడిగా భావించలేదు. అందరి కంటే హీనంగా చూస్తూ దారుణంగా వ్యవహరించేవాడు. ప్రతీరోజూ బెగ్గర్.. బెగ్గర్ అంటూ పిలిచేవాడు. ఆఫీసుకు వెళ్తే అక్కడా అవమానించేవాడు. తాత అలా తిట్టడం వల్ల ఆఫీస్ స్టాఫ్ కూడా చిన్నచూపు చూసేవారు. ఆస్తి పంపకాలు, పదవుల కేటాయింపుల్లోనూ తక్కువ చేశాడు. చివరకు డైరెక్టర్ పదవినీ రెండో కుమార్తె కొడుకుకు ఇచ్చాడు. అప్పట్నుంచి నాకు, తాతకు మధ్య గొడవలు పెరిగాయి. అందుకే అతన్ని చంపేయాలని నిర్ణయించుకున్నా. ఇన్‌స్టామార్ట్ నుంచి కత్తి కొనుగోలు చేసా. బట్టలు తగలబెట్టేందుకు అమెజాన్ బ్యూటేన్ గ్యాస్ కొనుగోలు చేశా. హత్య జరిగిన రోజు నాకు, తాతకు మధ్య పెద్దఎత్తున గొడవ జరిగింది. ఆస్తిలో వాటా కావాలని అడిగితే ఇవ్వను అన్నాడు. కోపంతో కత్తితో కసితీరా పొడిచా. హత్య చేసిన తర్వాత బీఎస్ మక్తా ఎల్లమ్మగూడ పక్కనే ఖాళీ స్థలంలో కత్తి, రక్తంతో ఉన్న నా బట్టలు తగులబెట్టానని" తెలిపాడు.

# మూసీపై 17 బ్రిడ్జిలను సర్వే చేయిస్తున్న ప్రభుత్వం

హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు ):

మూసీ ప్రక్షాళనకు సంబంధించి తెలంగాణ సర్కాం మరో ముందడుగు వేసింది. మూసీ బ్రిడ్జిల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టిసారించింది. మూసీపై ఉన్న 17 బ్రిడ్జిలను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సర్వే చేయిస్తోంది. నిజాం కాలంలో కట్టిన బ్రిడ్జిల పటిష్టతను ఇంజనీరింగ్ నిపుణులు పరిశీలిస్తున్నారు. రీబౌండ్ హ్యామర్ టెస్ట్, గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్, డైనమిక్ లోడ్ టెస్టింగ్‌ను సంస్థ నిర్వహిస్తోంది. నాగోల్, ఇమ్లి బండ్, ముస్లింజంగ్, నయాపూల్, పురాణాపూల్, టిప్పు ఖాన్, బాపూఘాట్, అత్తాపూర్, చాదర్ఘాట్, గోల్నాక, సాలార్జంగ్ ప్రాంతాల్లో నిర్మించిన బ్రిడ్జిలను సంస్థ ప్రతినిధులు పరిశీస్తున్నారు. బ్రిడ్జిల పటిష్టతపై మరో నెలలో ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనున్నారు. చాధర్ ఘాట్ బ్రిడ్జి హైట్ పెంచాలని నివేదికను సిద్ధం చేసింది సంస్థ. మూసీ పైనున్న బ్రిడ్జిలను వారసత్వ కట్టడాలుగా ప్రభుత్వం గుర్తించింది. అవసరం అయితేనే పూర్తిగా కూల్చి... వాటి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. మూసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మరో మూడు నెలల్లో మూసరాం బాగ్ హై లెవెల్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. దీన్ని 29.5 మీటర్ల పొడవు, 6 లేన్లతో 20 మీటర్ల క్యారేజ్ వే, 3.5 మీటర్ల ఫుట్ పాత్‌తో నిర్మాణం జరుగుతోంది. దాదాపు రూ.65 కోట్లతో ముసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.

# పచ్చకామెర్లవాడికి ఊరంతా పచ్చగే...

- సీఎం వ్యాఖ్యలపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు ):

పచ్చకామెర్లవాడికి ఊరంతా పచ్చగా కనపడుతుందన్న సామెతలా సీఎం రేవంత్‌రెడ్డికి తను మూటాలు తీసుకుంటున్న మాదిరిగా ఐఏఎస్‌లు తీసుకుంటున్నారని అనుకుంటున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అవమానపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పచ్చకామెర్ల వానికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది. మీరు బ్యాగులతో దొరికారని అందరూ మీ లాగానే బ్లాక్‌మెయిల్ దందాలు చేస్తారని సెటిల్‌మెంట్లు, దందాలు చేస్తూ బతుకుతున్నారని అనుకోవడం తప్పు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మన దేశ ప్రజాస్వామ్యానికి వెన్నెముకలు అని కేటీఆర్ పేర్కొన్నారు. సివిల్ సర్వెంట్స్ అంటే.. కార్యాచరణ రూపొందించడంలో నిష్ణాతులు.. కానీ ఏసీలో ఉండి యాక్షన్ చేసే వారు కాదు. సీఎం రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అవమానించేలా మాట్లాడారు. ఆ మాటలు అమర్యాదగా ఉన్నాయని కేటీఆర్ మండిపడ్డారు. అధికార వ్యవస్థ ప్రతిష్టను నాశనం చేసేందుకు సీఎం రేవంత్ నిరంతరం చేస్తున్న ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

# మహిళల క్యాన్సర్లకు విరుగుడుగా టీకా

- త్వరాలోనే అందుబాటులోకి తెస్తున్నాం
- కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్

ఛత్రపతి శంభాజీనగర్,ఫిబ్రవరి18( వెలుతురు ):

మహిళల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న క్యాన్సర్లను ఎదుర్కొనేందుకు ఐదారు నెలల్లో టీకా అందుబాటులోకి వస్తుందని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ వెల్లడించారు. ఈ టీకా వేసుకొనేందుకు 9 నుంచి 16 ఏళ్ల లోపు వయసు ఉన్న బాలికలు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఈ టీకాపై పరిశోధనలు దాదాపు పూర్తి కావొచ్చాయని.. ట్రయల్స్ కొనసాగుతున్నాయన్నారు. మంగళవారం ఆయన ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. 30 ఏళ్లు పైబడిన మహిళలకు ఆసుపత్రులలో స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ఈ వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు డేకేర్ క్యాన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. క్యాన్సర్ చికిత్సకు వినియోగించే ఔషధాలపై కస్టమ్స్ సుంకాన్ని రద్దు చేశాం. అందుబాటులోకి రాబోయే ఈ టీకా రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్లను నియంత్రిస్తుంది' అని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను ఆయుష్ సౌకర్యాలుగా మార్చడంపై విలేకర్లు ప్రశ్నించగా.. ఆసుపత్రులలో ఆయుష్ విభాగాలు ఉన్నాయని.. ప్రజలు ఈ సౌకర్యాలను పొందొచ్చన్నారు.

# ఆక్వాలో టెక్నాలజీ జోడిస్తే మంచి ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి..)

వాటిని రైతులు, ఉత్పత్తి దారులు పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ సాగు వివరాలను రిజిస్టర్ చేసుకోవాలని.. అలా కాకుండా ఇష్టానుసారంగా చేస్తానంటే మాత్రం నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామని చెప్పారు. ఆక్వాకు ప్రాధాన్యం అనేది తమ అభిమతమన్న సీఎం.. నిబంధనల అమలకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని...పొల్యూషన్ విషయంలో కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు విజయవాడలోని హోటల్‌లో జరిగిన ఆక్వా టెక్ 2.0 కాన్ క్లేవ్ చివరి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. జిఎఫ్ఎస్‌టి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆక్వారంగంలో వస్తున్న మార్పులు, అవకాశాలు, సమస్యలు, పరిష్కారాలు, పాలసీలు, టెక్నాలజీ సహకారం వంటి అంశాలపై చర్చించారు. రైతులు, ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల యజమానులు, ట్రేడర్లుతో పాటు నిపుణులు ఈ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్నారు. రాష్ట్రానికి ఆక్వాను ప్రధాన ఆదాయ వనరుగా మార్చేందుకు ఉన్న అవకాశాలు, అధిగమించాల్సిన అవరోధాలపై ఈ సదస్సుల్లో చర్చించారు. రైతులను చైతన్య పరిచేలా.. టెక్నాలజీ వాడకం పెంచేలా మూడు రోజుల పాటు పలు అంశాలపై ఇక్కడ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. 'ఆక్వా రంగంపై నాకు ప్రత్యేక మైన శ్రద్ధ ఉంది.. మన రాష్ట్రం ఆక్వా సాగుకు అత్యంత అనుకూలం. 2014-19 మధ్య కాలంలో నాడు ఆక్వా రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా నిలిచింది. రాష్ట్ర జీవీఏ(స్థూల విలువ జోడింపు)లో 8.8 శాతం ఆక్వా వాటాగా ఉంది. వియత్నాం వంటి దేశాల్లో మన కంటే తక్కువ ప్రొడక్షన్ ఉన్నా.. వాల్యుయేషన్?లో వాళ్లు ముందు ఉన్నారు. వియత్నాం ఆక్వా ఉత్పత్తుల్లో 3.9 మిలియన్ టన్నుల ఎగుమతులతో 13 బిలియన్ డాటర్లు ఆర్జిస్తుండగా, మనం 5 మిలియన్ మెట్రిక్ టన్నులు ఎగుమతి చేస్తూ 3 బిలియన్ డాలర్లు మాత్రమే ఆర్జిస్తున్నాం. మనం కూడా ఆ దిశగా ప్రయాణం చేయడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయి. మన ఉత్పత్తులను ప్రాసెస్ చేయడం ద్వారా మంచి ధరలు పొందవచ్చు. దీనికి పరిష్కారం వేస్ట్ టు వెల్త్. దీని ద్వారా సమస్యలు పరిష్కారం చూపవచ్చు' అని సీఎం అన్నారు '1995లో నాడు ఐటీ అన్నాను.. నేడు ఏఐ అంటున్నాను. మనం టెక్నాలజీని స్వాగతించాలి. ఖర్చులు తగ్గించుకునేందుకు, నాణ్యత పెంచేందుకు ఏఐను ఆక్వారంగంలోనూ విరివిగా వాడాలి. రొయ్యల రైతులు రకరకాల వైరస్‌ల కారణంగా నష్టపోతుంటారు. వీటి సమాచారాన్ని ఏఐ ద్వారా విశ్లేషించి ఏ జబ్బులు వచ్చే అవకాశం ఉందనేది కూడా తెలుసుకోవచ్చు. తద్వారా సరైన మందులతో ముందుగానే తగు చర్యలు తీసుకోవచ్చు. ఏఐ అనేది నేను చెపుతుంటే కొందరు అర్థం చేసుకోవడం లేదు. కానీ తప్పదు ఏఐ టూల్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. టెక్నాలజీ, అవకాశాలను అందిపుచ్చుకుంటేనే సత్వర ఫలితాలు వస్తాయి. డాటా ఆధారంగా రాబోయే రోగాన్ని ముందే కనిపెట్టి చెప్పవచ్చు.

మరోవైపు పంటల ఉత్పత్తితో పాటు.. ప్రాసెసింగ్ ఉంటేనే అగ్రో బేస్డ్ ఇండస్ట్రీకి భవిష్యత్ ఉంటుంది. ఆ దిశగా జరిగే ప్రయత్నాలకు ప్రభుత్వం అన్ని రకాలుగా పోత్సాహం అందిస్తుంది' అని సీఎం అన్నారు. 'ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయి. దానికి అనుగుణంగా రైతులు కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఆక్వా, హార్టికల్చర్, పామాయిల్, కోకో పంటల సాగుతో మంచి ఫలితాలు వస్తున్నాయి. దీన్ని రైతాంగం అర్థం చేసుకుని సాగులో మార్పులు చేయాలి. అలాగే డైరీ మీద కూడా ఎక్కువ మంది ఆధార పడుతున్నారు. సామాన్య ప్రజల ఎకనమిక్ యాక్టివిటీకి పశుసంపద ఉపయోగపడుతుంది. ఆహార పదార్థాల సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ అనేది రానున్న రోజుల్లో ప్రాధాన్య అంశంగా మారిపోతుంది. ఏ ఆహారం ఎక్కడ ఉత్పత్తి అయ్యింది.. దాని వివరాలు కూడా తెలుసుకునే పరిస్థితి వస్తుంది. తద్వారా ఆయా పంటలకు, ప్రకృతి సేద్యం ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. రానున్న రోజుల్లో దక్కే అవకాశాలను గుర్తించి దానికి అనుగుణంగా ఇప్పటినుంచే పనిచేస్తే ఫలితాలు వస్తాయి' అని ముఖ్యమంత్రి అన్నారు.

# అర్థంపర్థంలేని హామీలతో సీఎం గందరగోళం

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు ఖాయం : ఎంపీ ఈటలరాజేందర్

హైదరాబాద్,ఫిబ్రవరి18( వెలుతురు ):



అర్థంలేని హామీలతో సీఎంరేవంత్ ఆయన గందరగోళానికి గురికావడమే కాకుండా, ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ అభ్యర్థి సరోత్తం రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఈటెల రాజేందర్ పాల్గొని మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బీజేపీకి మద్దతు పలుకుతున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పీఆర్సీ ఏమైంది... డీఏలు ఏమయ్యాయని నిలదీశారు. సీపీఎస్ విధానంపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నారని అడిగారు. గతంలో యూటీఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తే ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు. బీజేపీ పాలనలో దేశం సుభిక్షమని.. అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందన్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీకి ఓటు వేస్తామని ఉపాధ్యాయులు చెబుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయలకు అండగా ఉంటామని.. సమస్యల పరిష్కారానికి కొట్లాడతామని స్పష్టం చేశారు. కులాన్ని విస్మరించలేమని.. కుల గణన జరగాలన్నారు. కాంగ్రెస్‌కు నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే అధికారికంగా లెక్కలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రతి నిర్ణయం బూమరాంగ్ అవుతోందన్నారు. 2011 జనాభా లెక్కలకు ఇప్పటి లెక్కలకు పొంతన లేకుండా చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని.. డ్రామా కంపెనీలా చేయవద్దని హితవుపలికారు. ఈ దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఈ దేశంలో ఎన్నడైనా ఎక్కడైనా కాంగ్రెస్ బలహీన వర్గాలకు పదవులు కట్టబెట్టిందా అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో లేదా ఇప్పుడు బలహీన వర్గాలకు చెందిన నేతలు ముఖ్య మంత్రులయ్యారా అని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకుకి సిద్ధంగా ఉందని వెల్లడించారు. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, లగచర్ల భూములు ఇలా ప్రతి విషయంలోనూ రేవంత్ ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. రాబోయే రోజులలలో కాంగ్రెస్ ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, కొట్లాడతామని ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.

# పై ఓవర్లు కింద గేమింగ్ జోన్స్...



హైదరాబాద్, ఫిబ్రవరి 18, ( వెలుతురు)

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కొత్తగా ఫ్లైఓవర్లు నిర్మించిన సంగతి తెలిసిందే. చాలా ప్రాంతాల్లో కొత్తగా ఫ్లైఓవర్లు నిర్మించారు. కొన్ని ఏరియాల్లో అయితే కి.మీ పొడవునా వీటిని ఏర్పాటు చేశారు. అయితే ఈ ఫ్లైఓవర్ల కింద చాలా విశాలమైన స్థలాలు ఉన్నాయి. ప్రస్తుతం అవి నిరూపయోగంగా ఉండగా.. మల్టీ పర్పస్‌గా వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఎక్కువ వెడల్పు ఉన్న పైవంతెనలను జీహెచ్ఎంసీ అధికారులు గుర్తిస్తున్నారు. ఇప్పటికే షేక్‌పేట ఫ్లైఓవర్‌ను క్రీడా మైదానంలా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.ప్రస్తుతం చాలా కాలనీలకు పార్కులు, ఆట స్థలాల కొరత ఉండగా.. దాన్ని కొంత వరకైనా భర్తీ చేసేందుకు.. ఫ్లైఓవర్ల కింద ఉండే స్థలాన్ని ఉపయోగించుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సీఎం సూచనల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు నగరంలోని ఫ్లైఓవర్లపై అధ్యయనం చేస్తున్నారు. ఎక్కడైతే మల్టీపర్పస్‌గా వినియోగించుకోవటానికి వీలుటుందో వాటిపై అధ్యయనం చేస్తున్నారు. షేక్‌పేట పైవంతెన మొత్తం పొడవు 2.5కి.మీ కాగా, 24మీటర్ల వెడల్పుతో దీన్ని నిర్మించారు. 24 మీటర్ల వెడల్పుతో ఫ్లైఓవర్ కింద ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించారు. సీఎం ఆదేశాల మేరకు అక్కడ పార్కు, గేమింగ్ జోన్ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.ఇక ఆరాంఘర్-జూపార్కు కొత్త ఫ్లైఓవర్, జేఎన్‌టీయూ నుంచి మలేషియన్ టౌన్‌షిప్ ఫ్లైఓవర్, కొత్తగూడ కూడలి ఫ్లైఓవర్, లాలాపేట, నాగోల్, కామినేని కూడళ్ల ఫ్లైఓవర్లు కూడా చాలా ఎక్కువ వెడల్పుతో నిర్మించారు. వాటి కింద క్రీడా వసతులు కల్పించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఒకటో పిల్లరు నుంచి రెండో పిల్లరు మధ్య పచ్చదనానికి పాధాన్యం ఇస్తూ మొక్కలు, వాటి చుట్టూ కుర్చీలు, నడక మార్గం ఏర్పాటు చేస్తారు. రెండు, మూడో పిల్లర్ల మధ్య కార్లు, బైకులకు పార్కింగ్ వసతి కల్పిస్తారు. మూడు, నాలుగో పిల్లర్ల మధ్య యోగా సెంటర్, పిల్లల పార్కు, ఓపెన్ జిమ్ వంటివి ఏర్పాటు చేయనున్నారు. నాలుగు, ఐదో పిల్లర్ల మధ్య స్కేటింగ్ రింగ్, ఐదు, ఆరో పిల్లర్ల మధ్య బ్యాడ్మింటన్ కోర్టు, సీటింగ్ ఏరియా ఏర్పాటు చేస్తారు. ఆరు, ఏడో పిల్లర్ల మధ్య బాక్స్ క్రికెట్. ఏడు, ఎనిమిదో పిల్లర్ల మధ్య మొక్కలు, కుర్చీలు. ఏర్పాటు చేస్తారు. ఒకటో పిల్లరు నుంచి ఎనిమిదో పిల్లరును కలుపుతూ అంచుల్లో వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేస్తారు.

# కవితక్క.. కేరాఫ్ సిద్ధిపేట..

మెదక్, ఫిబ్రవరి 18, ( వెలుతురు )

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న కవిత జైలు నుండి బెయిల్ పై బయటకు వచ్చారు. కొద్దిరోజులు పార్టీ స్థితిగతులు అంచనా వేసిన కవిత, ఆ తర్వాత స్పీడ్ పెంచారు. కవితకు బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ లో స్పెషల్ క్రేజ్ ఉంది. పార్టీ క్యాడర్ కూడా ఆమెకిచ్చే గౌరవంలో ఏమాత్రం తక్కువ చేయరు. ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టడంలో ఎవరైనా కవిత తర్వాతే అంటారు పార్టీ క్యాడర్. అయితే ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలను బట్టి కవిత.. కాస్త బీఆర్ఎస్ అధినాయకత్వానికి భిన్నంగా నడుచుకుంటున్నారని ప్రచారం సాగుతోంది. పలు విషయాలతో విభేదిస్తూ.. తన పని తాను కవిత చేసుకుపోతున్నారట.ఇటీవల శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వాకౌట్ చేసినప్పటికీ కవిత మాత్రం సభలో ఉండిపోయారు. అంతేకాదు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణన సర్వేలో కేసీఆర్, కేటీఆర్ పాల్గొనలేదు. కవిత మాత్రం సర్వేలో పాల్గొని తన వివరాలు అందజేశారు. దీనితో మంత్రులు కూడా కవిత సర్వేలో పాల్గొంది.. మీకేమైంది అంటూ కేటీఆర్, కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. ఇలా కొన్ని అంశాలలో కవిత తనకంటూ ప్రత్యేకత చాటుకుంటూ.. తనకు ఉన్న ఇమేజ్ ను పెంచుకుంటూ పోతున్నారని టాక్.కాగా ఇటీవల సిద్దిపేటపై కవిత ఫోకస్ పెట్టారని బీఆర్ఎస్ క్యాడర్ భావిస్తోంది. సిద్దిపేట నుండి మాజీ మంత్రి హరీష్ రావు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. హరీష్ స్వయాన వరుసకు కవితకు బావ అవుతారు. కేసీఆర్ కుటుంబానికి సమీప బంధువైన హరీష్ రావుకు, కేటీఆర్, కవితలకు మనస్పర్థలు ఉన్నాయని పలుమార్లు వదంతులు వ్యాపించాయి. ఇలాంటి తరుణంలో కవిత ఇటీవల స్పీడ్ పెంచి ఎక్కువగా సిద్దిపేట నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. పార్టీలో తనకంటూ బ్రాండ్ ఇమేజ్ ఉన్న కవిత కన్ను సిద్దిపేటపై పడిందని, రానున్న ఎన్నికల్లో కవిత పోటీ ఇక్కడి నుండే అంటూ ప్రచారం సాగుతోంది.

అలాగే జగిత్యాల నుండి పోటీ చేస్తారని కూడా మరో ప్రచారం సాగుతోంది. కానీ హరీష్ రావుకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే సిద్దిపేటలో కవిత తరచూ పర్యటిస్తున్నారని, రానున్న ఎన్నికలకు ఇప్పటినుండే రూట్ వేస్తున్నట్లు కొందరి అభిప్రాయం. అదే నిజమైతే హరీష్ రావు నెక్స్ట్ పోటీ ఎక్కడి నుండి సాగుతుందనే కోణంలో కూడా చర్చలు సాగుతున్నాయి. మొత్తం మీద మీడియా ముందు మేమంతా ఒకటే అనే నినాదం అంటూ వీరు ప్రచారం సాగిస్తున్నప్పటికీ, విభేదాలు ఉన్నాయ్.. అందుకే సిద్దిపేటపై కవిత ఫోకస్ అంటూ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి ఈ ప్రచారంలో ఎంత మేరకు వాస్తవం ఉందో కానీ, మొత్తం మీద కవిత దెబ్బకు హరీష్ రావు అనుచరులు ఏ క్యాహై అనేస్తున్నారట.

# పాపం... దేవేందర్ గౌడ్



**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ( వెలుతురు )**

దేవేందర్‌గౌడ్ ఒకప్పుడు తెలుగు రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన బీసీ నేత. ఎన్టీఆర్ పిలుపుతో తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి రాజ్యసభ సభ్యుడిగా సుదర్ఘ రాజకీయ అనుభవం ఉంది. ఎన్టీఆర్ కేబినెట్‌లో బీసీ మంత్రిగా, చంద్రబాబు క్యాబినెట్‌లో హెూం మంత్రిపనిచేశారు. ఒక దశలో టీడీపీలో నంబర్ 2గా ఎదిగారు. కానీ ఓ తపుపడు నిర్ణయం అతడి రాజకీయ ప్రయాణానికి బ్రేక్ వేసింది. ఇక చంద్రబాబు నాయుకూడా దేవేందర్‌గౌడ్‌ను బాగా ఎంకరేజ్ చేశారు. 1988 నుంచి 2008 వరకు రాజకీయంగా ఎదురు లేకుండా ఉన్నారు. అయితే 2008లో దేవందర్‌గౌడ్ తీసుకున్న ఓ నిర్ణయం అతని రాజకీయ జీవితానికి శాపంగా మారింది. తెలంగాణ ఉద్యమం విషయంలో టీడీపీని వ్యతిరేకించి పార్టీకి రాజీనామా చేశారు.నవ తెలంగాణ పార్టీ స్థాపించారు. ఈ విషయంలో కేసీఆర్ దేవేందర్‌గౌడ్‌కు సారూప్యత ఉంది. కానీ, అది టీడీపీ నుంచి బయటకురావడం వరకే. కేసీఆర్ తెలంగాణ ఉద్యమంతో ఉవ్వెత్తున ఎగిసారు. రాష్ట్రం సాధించి తెలంగాణకు రెండు పర్యాయాలు ముఖ్యమంత్రి కూడా అయ్యారు. దేవేందర్‌గౌడ్, కేసీఆర్ లక్ష్యం ఒకటే అయినా కేసీఆర్ బానం సరైన దిశగా పయనించింది. దేవేందర్‌గౌడ్ బానం గురి తప్పింది. నవ తెలంగాణ పార్టీ విఫలమైంది. తర్వాత దేవేందర్‌గౌడ్ మరో తప్పు చేశారు. ఆయన పార్టీని ప్రజారాజ్యంలో విలీనం చేశారు. అసెంబ్లీ, పార్లమెంటుకు పోటీ చేసి ఓడిపోయారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నా ప్రజల నాటి పట్టుకోవడంలో విఫలమయ్యారు. ఆ తర్వాత తన తప్పు అర్థమైంది. దీంతో తప్పు ఒప్పుకుని టీడీపీలో చేరి రాజ్యసభ సభ్యుడు అయ్యారు. తర్వాత అనారోగ్యంతో క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యాడు.ఇక చాలాకాలం తర్వాత దేవేందర్‌గౌడ్ మళ్లీ కనిపించారు. టీడీపీతో తన సహచరుడు అయిన రేవంత్‌రెడ్డిచేతుల మీదుగా తాను రాసిన విజయ తెలంగాణ బుక్ ఆవిష్కరింపచేశారు. తొందరపాటు నిర్ణయం కారణంగా రాజకీయాల్లో ఉత్థాన పథనాలకు దేవేందర్‌గౌడ్ ఒక ఉదాహరణ.ఇక నాడు టీడీపీలో దేవేందర్‌గౌడ్ నంబర్ 2గా ఉన్న సమయంలో అట్టడుగున ఉన్నవారు ఇప్పుడు మంత్రులు, ముఖ్యమత్రి అయ్యారు. రేవంత్‌రెడ్డి నాడు ఉనికిలోనే లేరు. ఇక ఎర్రబెల్లి దయాకర్ ఎమ్మెల్యేగా ఉన్నా పెద్దగా ప్రాధాన్యం లేదు. తలసాని ఉన్నా ఆయనకు ప్రాధాన్యం లేదు. కానీ అనేక మంది టీడీపీ నేతలు టీఆర్ఎస్, అలియాస్ బీఆర్ఎస్‌లో చేరారు. తర్వాత మంత్రులు అయ్యారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి సీఎం అయ్యారు. మొత్తంగా సరైన సమయంలో నిర్ణయం తీసుకున్న కేసీఆర్, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. దేవేందర్‌గౌడ్ పొలిటికల్ కెరీర్ మాత్రం ముగిసింది.

# పౌల్ట్రీ రైతులకు కోట్లల్లో నష్టం



**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ( వెలుతురు)**

బర్డ్ ఫ్లూ విజృంభిస్తున్నది. ఇప్పటికే ఏపీలో లక్షలాది కోళ్లు చనిపోయాయి. పౌల్ట్రీ రైతులకు కోట్లల్లో నష్టం వాటిల్లింది.. బర్డ్ ఫ్లూ విస్తరిస్తున్న నేపథ్యంలో చికెన్ తినొద్దని ప్రభుత్వాలు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరులో ఓ వ్యక్తిలో బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపించడంతో.. రెండు తెలుగు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. ఆంధ్ర సరిహద్దుల్లో నుంచి కోళ్లను తెలంగాణలో కిరానివ్వకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్న నేపథ్యంలో చికెన్ అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. మొన్నటిదాకా కిలో చికెన్ ధర 230 నుంచి 250 వరకు పలకగా.. ఇప్పుడు అది 150 కి పడిపోయింది. దీంతో పౌల్ట్రీ సంస్థలు దారుణంగా నష్టపోతున్నాయి. బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్న నేపథ్యంలో చికెన్ కు డిమాండ్ అమాంతం పడిపోయింది. అయితే బర్డ్ ఫ్లూ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు హైదరాబాదులో దాడులు చేయడం మొదలుపెట్టారు. హైదరాబాదులోని రసూల్ పుర అన్నా నగర్ ప్రాంతంలో అధికారులు తనిఖీలు నిర్వహించగా దిమ్మ తిరిగిపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఆ తనిఖీల్లో పాల్గొన్న అధికారులు ముక్కు మూసుకోవాల్సి వచ్చింది.హైదరాబాద్ నగరంలో విస్తారంగా రెస్టారెంట్లు, హెూటళ్లు ఉంటాయి. వీటన్నింటికీ పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల నుంచి చికెన్ సరఫరా అవుతున్నది. చికెన్ కు ప్రస్తుతం డిమాండ్ తగ్గడంతో.. దానిని క్యాష్ చేసుకోవడానికి చికెన్ సప్లయర్స్ సరికొత్త మార్గాన్ని అన్వేషించారు. తక్కువ ధరకు కోళ్లను కొని.. వాటి మాంసాన్ని నిలువ చేయడం మొదలుపెట్టారు. ఇలా నిల్వచేసిన మాంసాన్ని హైదరాబాద్ నగరంలోని వివిధ రెస్టారెంట్లకు, హెూటళ్లకు సరఫరా చేస్తున్నారు.. అయితే దీనిపై సమాచారం అందడంతో అధికారులు రసూల్ పుర ప్రాంతంలోని అన్నా నగర్ లో తనిఖీలు నిర్వహించారు. వారు తనిఖీలు నిర్వహించగా ఐదు క్వింటాళ్ల కుళ్ళిన చికెన్ కనిపించింది. పైగా ఆ చికెన్ తీవ్రమైన దుర్వాసన వస్తున్నది. దీంతో షాక్ కు గురికావడం అధికారుల వంతు అయింది. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ తక్కువ ధరకు దొరుకుతున్న నేపథ్యంలో.. రెస్టారెంట్లకు పాత రేటుకే సప్లయర్స్ అమ్ముతున్నారు. పైగా తక్కువ ధరకు కోళ్లను ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేసి.. వాటిని వధించి ఇలా చికెన్ నిల్వ చేస్తున్నారు. బ్రాయిలర్ చికెన్ ఎక్కువ కాలం నిల్వ ఉండదు. దానిని నిల్వ ఉంచాలంటే రసాయనాలు వాడాల్సి ఉంటుంది. అలాంటి పనిని కొంతమంది సప్లయర్స్ చేస్తున్నారు. అయితే వారి దుర్మార్గం ఇప్పుడు ఇలా అధికారులతో వెలుగులోకి వచ్చింది.. ఇప్పుడు మాత్రమే కాదు.. గతంలోనూ ఈ ప్రాంతంలో ఇలానే కుళ్ళిన చికెన్ నిలువ చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. నాడు అధికారులు ఇలాంటి వ్యవహారాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకున్నారు. కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ సప్లయర్స్ తమ ధోరణి మార్చుకోవడం లేదు. అడ్డగోలుగా దోచుకోవడానికి ఇలా కుళ్ళిన చికెన్ అమ్ముతూ.. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు.

# మహేందర్ రెడ్డి ప్రభుత్వ హాస్పిటల్ లో మహిళ మృతి


**చేవెళ్ల ఫిబ్రవరి 18, వెలుతురు:**

చేవెళ్ల మండలం పరిధిలోని పట్నం మహేందర్ రెడ్డి ప్రభుత్వ హాస్పిటల్ లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ క్యోసం వచ్చిన మమత మృతి చెందింది. మృతురాలి సొంత గ్రామం వికారాబాద్ జిల్లా పూడూరు మండల అంగడి చిట్టెంపల్లి గ్రామం. మమత కి వేసిన ఇంజక్షన్ వికటించడం తో మృతి చెందింది అని బంధువుల ఆరోపణ. వైద్యురాలు కండిషన్ బాగాలేదని తెలుసుకొని డాక్టర్ల దగ్గర ఉండి మెహదీపట్నం ప్రీమియర్ హాస్పిటల్ కి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్టుగా వైద్యులు తెలియజేశారు.

# కాంగ్రెస్ ప్రచారం చేసుకోలేకపోతోందా

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, (వెలుతురు )**

తెలంగాణలో దశాబ్దం తర్వాత అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ.. కేసీఆర్‌పాలనను మరపించేలా పాలన సాగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈమేరకు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. అయితే ఇంకా చాలా హామీలు మిగిలే ఉన్నాయి. అమలు చేసినవాటికన్నా పెండింగ్‌లో ఉన్నవే ఎక్కువగా ఉన్నాయి. దీంతో హస్తం పార్టీకి ఆశించిన మైలేజీ రావడం లేదు. వాస్తవానికి రుణమాఫీ, కొత్త రేషన్‌కార్డుల జారీతో మంచి మైలేజీ వస్తుందని హస్తం నేతలు భావించారు. కానీ, ప్రచారంలో పార్టీ నేతలే వెనుకబడుతున్నారు. అంతర్గత కుమ్ములాటలు, అలకల కారణంగా చేసిన పని చెప్పుకోలేకపోతున్నామని హస్తం నేతలు భావిస్తున్నారు. కలిసి కట్టుగా ప్రభుత్వ చేసే పనులను ప్రజలకు చెప్పాలని పెద్దలు కోరుతున్నారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇదే పనిచేస్తున్నారు. అయినా పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో నేతలు విఫలం అవుతున్నారు.మరోవైపు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్‌పై విపక్షాలు బలంగా వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ అనేక వియాల్లో కాంగ్రెస్ పాలనను తప్పు పడుతున్నాయి. హామీలు అమలు చేయలేదని ఎత్తి చూపుతున్నాయి.సీఎంఢిల్లీ నెలనెలా ఢిల్లీకి వెళ్లడాన్ని హైలెట్ చేస్తున్నాయి. సోషల్ మీడియా ప్రభావంతో ప్రజలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదన్న భావనలోనే ఉంటున్నారు. ప్రతిపక్షాల సోషల్ ప్రచారాన్ని తిప్పి కొట్టడంలో హస్తం పార్టీ సోషల్ మీడియా విఫలమవుతోంది. మరోవైపు పథకాలను కూడా సోషల్ మీడియా వేదికగా పెద్దగా ప్రచారం చేసుకోవడం లేదు. మంచైనా, చెడైనా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే క్షేత్రస్థాయికిచేరుతుంది. దీనిని గుర్తించిన బీఆర్ఎస్ కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారాన్ని



విస్తృతం చేస్తోంది. బలంగా గ్రౌండ్ లెవల్‌కు తీసుకెళ్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో కొన్ని మంచి పనులు చేసింది. మహిళలకు ఫ్రీ బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ. ఇందులో ఫ్రీ బస్సు, రైతు రుణమాఫీ గేమ్ చేంజర్ పథకాలు. కానీ, వీటిని హస్తం నేతలు ప్రచారం చేసుకోవడంలో విఫలమయ్యారు. దీనికి ప్రధాన కారణం నాయకత్వ లోపం, వ్యూహాత్మక తప్పిదం. ఉచిత ప్రయాణంతో నెలకు సుమారు రూ.3 కోట్ల రూపాయలు మహిళలకు మిగులుతున్నాయి. దీనిని ప్రచారం చేసుకోవడం లేదు. క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం లేదు. ఇక రుణమాఫీతో రైతులకు లక్షల మంది రైతులకు కోట్ల రూపాయల లబ్ధి కలిగింది. కానీ దీనిని కూడా సరిగా ప్రచారం చేసుకోలేకపోయింది. రూ.500 సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కారణంగా కూడా పేద, మధ్య తరగతి ప్రజలకు భారీగా లబ్ధి కలుగుతోంది. దీనిని లెక్కలతో సహా వివరించడంలో పాలకులు విఫలమవుతున్నారు. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీ వెనుకబడిపోయింది.ఇదిలా ఉంటే టీపీసీసీ రాష్ట్రంలో క్యాడర్‌ను యాక్టివ్ చేయడంలో విఫలమవుతోంది. బీఆర్ఎస్ ఏ కార్యక్రమం చేసిన క్షేత్రస్థాయిలో సంబురాలు నిర్వహించేది. ఇప్పటికీ ప్రతిపక్షంగా కూడా అదే చేస్తోంది. కానీ, కాంగ్రెస్ పార్టీ ఈ మేరకు కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ఎమ్మెల్యేలు, టీపీసీసీ కూడా ఈమేరకు యాక్టివ్ చేయడం లేదు. పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యం కూడా క్యాడర్‌లో నిస్తేజానికి కారణం. మరోవైపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం కారణంగా కూడా కేడర్ యాక్టివ్‌గా లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా టీపీసీసీ చీఫ్, సీఎం మైలేజీ రావడంలో ఎక్కడ లోపం జరుగుతుందో గుర్తిస్తారా లేదా అన్నది తదుపరి చర్యలతోనే తెలుస్తుంది.

# రజనీ ఫ్రస్టేషన్ పీక్స్...



**గుంటూరు, ఫిబ్రవరి 18, వెలుతురు:**

మాజీ మంత్రి విడదల రజినీ విపరీతమైన ఫ్రస్టేషన్‌లో ఉన్నట్లు కనిపిస్తున్నారు. జగన్ కేబినెట్‌లో మినిస్టర్‌గా ఉన్నప్పుడు కూడా ఎప్పుడూ పరుష పదజాలం వాడని ఆమె ఇటీవల సవాళ్లు విసురుతూ.. తన రాజకీయ గురువు ప్రత్తిపాటి పుల్లారావుని టార్గెట్ చేస్తుండటం అభద్రతాభావంతోనే అన్న అభిప్రాయం వ్యక్తమ వుతుంది. వైసీపీ హయాంలో పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఆమె ఓటమి తర్వాత పార్టీ మారడానికి ప్రయత్నించారన్న ప్రచారం జరిగింది. అయితే అది సాధ్యపడక పోవడంతో ఇప్పుడు కేసుల భయంతో సవాళ్ల పర్వానికి తెర లేపుతున్నారంటున్నారు. అసలు ఆమెలోని కొత్త కోణంపై జరుగుతున్న చర్చేంటి.తనపై కేసు నమోదు అవ్వగానే మాజీ మంత్రి విడదల రజినీ వాయిస్ సడన్‌గా మారిపో యింది. మునుపెన్నడూ లేని విధంగా తెగ ఆవేశపడిపోతున్నారామె.. 2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి టీడీపీ టికెట్ ఆశించిన ఆమె.. అది దక్కక పోవడంతో వైసీపీ బాట పట్టారు. అప్పటికే చిలకలూరిపేటలో టీడీపీ నుంచి సీనియర్ నేత, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చక్రం తిప్పుతున్నారు. రజినీని టీడీపీలోకి తీసుకొచ్చి ప్రోత్సహించింది ఆయనే.. అలాంటి రాజకీయ గురువుపై తిరుగుబాటు చేసిన రజినీ వైసీపీ నుంచి పోటీ చేసి ప్రత్తిపాటి పుల్లారావు లాంటి దిగ్గజాన్ని ఓడించడం అప్పట్లో పెద్ద సంచలనం రేపింది..మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచిన రజినీకి మంత్రివర్గ విస్తరణలో జగన్ కేబినెట్ బెర్త్ ఇచ్చారు. మంత్రిగా పని చేసినప్పుడు కూడా రజినీ ఏనాడు ప్రత్యర్థులపై పరుష పదజాలంతో విరుచుకు పడలేదు. అయితే ఆమె తన పీఏ, కుటుంబ సభ్యులతో కలిసి అవినీతికి పాల్పడి పెద్దఎత్తున కూడపెట్టుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత వివిధ ఆరోపణలకు సంబంధించి ఆమె నగదు తిరిగి చెల్లించి సెటిల్‌మెంట్లు చేసుకున్నా రంట. ఆ క్రమంలో చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌లో రజినిపై.. ఇటీవల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయ్యింది. టీడీపీ అధ్యక్షుడు పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2019 లో సీఐగా ఉన్న సూర్యనారాయణతో పాటు, రజిని పీఏలు నాగఫణీంద్ర, రామకృష్ణపై కూడా కేసు నమోదు చేశారు.తనపై కేసుల నమోదు కావడానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కారణమని భావిస్తున్న రజినీ.. ఓ రేంజ్‌లో చెలరేగి పోయారు. టైమ్ వచ్చినప్పుడు అందరి లెక్కలూ తేలుస్తానని ఆమె అన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ అధిష్టానం ఆదేశాల మేరకు తాను? చిలకలూరిపేట వదలి వెళ్లానని.. అంతే తప్ప.. నియోజకవర్గాన్ని వీడే ప్రసక్తే లేదన్నారు మాజీమంత్రి. 30 ఏళ్ల పాటు తాను అక్కడే ఉంటానంటూ ఘాటుగానే స్పందించారు. అందరికీ ఫ్యామిలీలు ఉన్నాయనే విషయాన్ని పుల్లారావు గుర్తు పెట్టు కోవాలని వ్యాఖ్యానించారు రజినీ. రాజకీయాల నుంచి రిటైర్ అయి పోయినా.. వారిని వదలనంటూ వార్నింగ్ కూడా ఇచ్చేశారు. దానిపై ప్రత్తిపాటి కూడా ధీటుగానే స్పందించారరజినీ ఆ స్థాయిలో సవాలు విసరడం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ డిబేట్‌గా మారింది. మునుపె న్నడూ లేని విధంగా రజినీ అలా చెలరేగిపోవడంపై వైసీపీ నేతలు కూడా ఆశ్చర్యపోతున్నారంట.. గత ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గం కాకుండా.. రజినీని గుంటూరు నుంచిపోటీ చేయించారు జగన్. అభ్యర్థుల అందరిపైనా సర్వేలు చేయించిన వైసీపీ అధినేత.. రాష్ట్రవ్యాప్తంగా పలువురి స్థానాలను మార్చేశారు. రజినీ చిలకలూరిపేటలో గెలవడం అసాధ్యమని సర్వేల్లో తేలడంతో ఆమెను గంటూరు వెస్ట్‌కి మార్చినా ఆమె గట్టెక్క లకపోయారు.రజిని మంత్రిగా ఉన్న టైమ్‌లో మైనింగ్, ఇసుక తరలింపులో దందాలు నడిచారన్న ఆరోపణలున్నాయ. తన పీఏల సాయంతో క్రషర్ యాజమానులను బెదిరించారని.. పెట్రోలు బంకులను కూడా ఆమె లాక్కున్నారంటూ ఆరోపణలు వచ్చాయి. దాంతో పాటు నాడు తెలుగుదేశం నేతలపై కేసులు పెట్టించారని.. తద్వారా ఎంతోమంది కార్యకర్తలు కూడా ఇబ్బంది పడ్డారని.. టీడీపీ ఆరోపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. చాలామందిపై కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో రజినీపైనా కేసు పెట్టడంతో ఆమె తీవ్ర ఆగ్రహానికి గురయ్యారనే టాక్ నడుస్తోంది.30ఏళ్లు చిలకలూరిపేటలోనే రాజకీయం చేస్తానని.. ప్రత్తిపాటి పుల్లారావు ఎక్కడున్నా వదిలేది లేదంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది. రజినీ ఆ స్థాయిలో ఫైర్ అవ్వడానికి భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారడమే కారణమంటున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కొంత కాలం సైలెంట్‌గా ఉన్న విడదల రజినీ.. రాజకీయ అండ కోసం జనసేనలో చేరడానికి ప్రయత్నించారంట. ప్రస్తుతం జనసేనలో ఉన్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ద్వారా జనసేనలోకి వెళ్లడానికి ట్రై చేశారన్న ప్రచారం జరిగింది అయితే ఆమెపై ఉన్న అవినీతిఆరోపణలతో జనసేననుంచి గ్రీన్ సిగ్నల్‌రాలేదంట.. కూట మి పార్టీల్లో చేరే అవకాశం ఎలాగూ లేక పోవడంతో.. ఆమె వైసీపీ లోనే భవిష్యత్తు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.రజినీ కోరికను మన్నించి జగన్ ఆమెను తిరిగి చిలకలూరిపేట ఇన్చార్జ్‌గా ప్రయటిం చడంతో.. ఆమెఅక్కడ తన పునాదులు బలోపేతం చేసుకు నే పనిలో పడ్డారు. తనపై కేసు నమోదవ్వడంతో ఉలిక్కిపడిన ఆమె.. తనలోని మరో కోణం చూపిస్తున్నారు. తన రాజకీయ గురువు ప్రత్తిపాటిపై రజినీ ఆ స్థాయిలో ధ్వజమెత్తడం ఇదే తొలిసారి.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆమె ఎవరినీ దూషించడం కాని, సవాళ్లు విసరడం కాని చేసిన దాఖలాలు లేవు.. వైసీపీ అధిష్టానం నుంచి ఆదేశాలు వచ్చినా ఆమె ప్రత్తిపాటి పుల్లారావుపై గతంలో ఎప్పుడు ఈ స్థాయిలో వార్నింగ్ ఇవ్వలేదు. అయితే తాజాగా ఆమె బరస్ట్ అవ్వడానికి కేసుల భయమే కారణమంటున్నారు. మరి చూడాలి ముమ్ముందు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో?

# బెజవాడ మెట్రో అడుగులు


**విజయవాడ, ఫిబ్రవరి 18, వెలుతురు:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెట్రో రైలు ప్రాజెక్టుపై మరో ముందడుగు పడింది. విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. గతంలో మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి భూమిని సేకరించేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేసినా అప్పట్లో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్అధికారులు మరోసారి భూసేకరణ పనులు ప్రారంభించారు. ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో దాదాపు 90 ఎకరాల భూమి అవసరమని కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సంబందించి ప్రతిపాదనలను అధికారులు తాజాగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కు సమర్పించారు. తొలి దశలో భాగంగా గన్నవరం నుంచి పీఎన్ బీఎస్, పెనమలూరు నుంచి పీఎన్ బీఎస్ కారిడార్ల నిర్మాణం చేపట్టనున్నారు.మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి ఎక్కడెక్కడ ఎంత భూమి అవసరమనే ప్రతిపాదనలను మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు సిద్ధం చేశారు. ప్రాజెక్టులో భాగంగా అధికారులు రెండు కారిడార్లలో 34 స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. గతంలో కూడా భూసేకరణకు నోటిఫికేషన్ రిలీజ్ చేసి టెండర్లు పిలిచారు. అయితే, కొన్ని కారణాల వల్ల ప్రక్రియ ముందుగు వెళ్లలేదు. అందుకే అప్పుడు భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇప్పుడు మరోసారి అధికారులు భూసేకరణ ప్రక్రియ మొదలుపెట్టారు. రెండు




జిల్లాల పరిధిలో మొత్తం 90 ఎకరాల భూమి అవసరం కాగా.. విజయవాడలో 30 ఎకరాలు, మిగిలిన భూమిని కృష్ణా జిల్లా నుంచి సేకరించనున్నారు. నిడమనూర్ లో కోచ్ డిపో ఏర్పాటుకు తొలి ప్రణాళికను కేసరపల్లికి మార్చారు. విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్ట్ ఫేజ్-1 గన్నవరం, పెనమలూరు నుంచి పీఎన్ బీఎస్ కారిడార్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకు అవసరమైన భూమికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాఅల కలెక్టర్లు, మెట్రో రైలు అధికారులతో త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.ప్రాజెక్టులో భాగంగా మొదటి కారిడార్ పీఎన్ బీఎస్ వద్ద ప్రారంభమై విజయవాడ రైల్వే స్టేషన్ ను కలుపుతూ ఏలూరు రోడ్డు మీదుగా రామవరప్పాడు వద్ద నేషనల్ హైవేకి చేరుకుని.. గన్నవరం వరకే కొనసాగనుంది. 12.5 కిలో మీటర్లు ఉండే రెండో కారిడార్ పీఎన్ బీఎస్ వద్ద స్టార్ట్ అయ్యి బందరు రోడ్డు, బెంజ్ సర్కిల్, ఆటో నగర్, కన్నూర్, పోరంకి మీదుగా విక్టోరియా మ్యూజియం, ఇందిరా గాంధీ స్టేడియం, కృష్ణానగర్, తదితర ముఖ్యమైన ప్రదేశాలను కవర్ చేస్తూ పెనమలూరు వరకు కొనసాగనుంది.ముందు ప్రభుత్వం నాలుగు కారిడార్ లు నిర్మించాలని లక్ష్యం పెట్టుకున్నా.. ప్రస్తుతం రెండు కారిడార్ల పైనే దృష్టి పెట్టింది. విజయవాడలోని పీఎన్ బీఎస్ లో రెండు కారిడార్లు అనుసంధానం అయ్యేలా చేసేందుకు సిద్ధం చేసిన ప్రతిపాదనల ప్రకారం అధికారులు భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

# ఇక ఆన్ లైన్ లో ఇసుక బుకింగ్




**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ( వెలుతురు)**

తెలంగాణలో ఇసుక కొరతను తీర్చేందుకు రేవంత్ సర్కారు చర్యలు చేపట్టింది. 24 గంటలు ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇదే సమయంలో.. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) అధికారులు చర్యలు ప్రారంభించారు. దీనికి సంబంధించిన 10 ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.రాష్ట్రంలో ప్రస్తుతం చాలాచోట్ల టీజీఎండీసీ ఇసుక రీచ్‌లను నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఆయా రీచ్‌ల నుంచి ఇసుక సరఫరా అవుతోంది.గతంలో ప్రభుత్వ రీచ్‌లు, డంపింగ్ యార్డుల్లోని ఇసుక నిల్వల వివరాలను రోజూ మధ్యాహ్నం 12 గంటలకు ఆన్‌లైన్‌లో ఉంచేవారు. 12 తర్వాతే ఇసుక బుకింగ్‌కు అవకాశమిచ్చేవారు.ఈ విధానాన్ని మార్చుతూ.. 24 గంటల ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఒక లారీ నంబర్‌పై ఒకసారి ఆన్‌లైన్ బుకింగ్ చేసుకుంటే.. ఆ వాహనం అన్‌లోడ్ అయ్యాకే మళ్లీ డీడీ చెల్లించే సదుపాయం ఉండేది.ప్రస్తుతం ఒక లారీ నంబర్‌పై మూడు డీడీలు చెల్లించే అవకాశమిస్తున్నారు. కానీ.. 15 రోజుల్లోపే ఇసుక తీసుకెళ్లాలనే నిబంధన విధించారు.గోదావరి నది తీరం వెంట ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. గోదావరి నదితో పాటు కిన్నెరసాని, ముర్రేడు వంటి నదుల నుంచి ఇసుక యథేచ్ఛగా తరలుతోంది..స్థానికంగా ట్రాక్టర్ యజమానులు మాఫియాగా ఏర్పడుతున్నారు. నదులు, వాగుల నుంచి ఇసుకను డంప్‌లకు చేరవేస్తున్నారు. అక్కడ్నుంచి టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు..అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు సైలెంట్‌గా ఉండటంపై ఆరోపణలు వపిస్తున్నాయి. భవన నిర్మాణాలు ఊపందుకోవడంతో ఇసుకకు డిమాండ్ పెరుగుతోంది. ఇదే అదునుగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు.అక్రమ రవాణా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 24 గంటలు ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.రీచ్‌ల్లో అక్రమ ఇసుక దందాకు అవకాశం లేకుండా.. పోలీస్, రెవెన్యూ, టీజీఎండీసీ అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ టీమ్‌లు నిరంతరం రీచ్‌లను పర్యవేక్షిస్తాయి...ప్రభుత్వ తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో.. ఇసుక తగినంత అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. అటు ప్రభుత్వానికి కూడా ఆదాయం పెరుగుతుందని అంటున్నారు.

# 19న బీఆర్ఎస్ కీలక భేటీ



**మెదక్, ఫిబ్రవరి 18, ( వెలుతురు )**

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్. ఆ తర్వాత ఫామ్ హౌస్‌కు ఆయన పరిమితమయ్యారు. ఎవరైనా నేతలు, కార్యకర్తలు వస్తే వారితో కాసేపు ముచ్చటిస్తున్నారు. గడిచిన ఏడాది కాలంగా పార్టీ ఆఫీసుకు సైతం దూరమైన సందర్భాలు లేకపోలేదు. పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండడంతో కేసీఆర్ పనైపోయిందనే చర్చ జరుగుతోంది. కనీసం అసెంబ్లీకి కేసీఆర్ వచ్చి ప్రజా సమస్యలు ప్రస్తావించాలని సీఎం రేవంత్ రెడ్డి పదేపదే చెప్పినప్పటికీ బయటకు రాలేదు.ఫిబ్రవరి 19 నాటికి బీఆర్ఎస్ ఏర్పడి 25 ఏళ్లు పూర్తి కానుంది. ఈ క్రమంలో పార్టీ సిల్వర్ జూబ్లీవేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది ఆ పార్టీ. ఈ క్రమంలో అదే రోజు మాజీ సీఎం కేసీఆర్ సమావేశానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనికితోడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఏర్పడి ఏడాది పూర్తి అయ్యింది. రేవంత్ సర్కార్‌కు ఏడాది సమయం ఇవ్వాలని భావించారు కేసీఆర్. అన్నట్టుగానే ఆయన ఇచ్చిన డెడ్ లైన్ పూర్తి అయ్యింది. దీంతో కేసీఆర్ రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. రేవంత్ సర్కార్ ఏడాది పాలనపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.కేసీఆర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దీనిపై నేతలు తలో విధంగా చర్చించుకుంటున్నారు. అధికారం పోయిన తర్వాత కారు పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిపై వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టు తలుపు తట్టింది. న్యాయస్థానం తీర్పు తమకు అనుకూలంగా ఉంటుందని ఆ పార్టీ నేతలు లెక్కలు వేస్తున్నాయి. ఇక్కడే కొత్త సమస్య మొదలైంది. న్యాయస్థానం తీర్పు వచ్చేలోపు బీఆర్ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేసే అవకాశాలున్నట్లు మరోవైపు వార్తలు వస్తున్నాయి.ఆ విషయాన్ని కాసేపు పక్కనబెడదాం. ఫిబ్రవరి 19న పార్టీ సమావేశం వల్ల కొత్త పిక్చర్ వస్తుందని ఆ పార్టీ భావిస్తోంది. ఆ రోజు సమావేశానికి రాని నేతలు మిగతా పార్టీలకు వెళ్లిపోవడం ఖాయమని అంటున్నారు. కచ్చితంగా కీలక నేతలంతా 19న మీటింగ్ కు వస్తారని అంటున్నారు. వచ్చే నేతలెవరు? రాకుండా ఉండేదెవరు? తెలుసుకునేందుకు హైకమాండ్ ఈ స్కెచ్ వేసిందని అంటున్నారు.నేతల భేటీలో ఎవరికి ఏయే విభాగాలను అప్పగించాలనే దానిపై ఓ క్లారిటీ రావచ్చని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కేసీఆర్ నేరుగా బయటకు రాకపోయినా, పార్టీని నడిపించేందుకు సలహాలు, సూచనలు ఇస్తారన్నది కొందరి మాట. తొలుత స్థానిక సంస్థల ఎన్నికలు మార్చి సెకండ్ వీక్ లో ఉంటుందని ఆ పార్టీ భావించింది. ఏప్రిల్ తర్వాత అని చెప్పడంతో సభలను సైతం వాయిదా వేయాలని భావిస్తోంది. పై అంశాలపై బుధవారం జరగనున్న పార్టీ సమావేశంలో ఓ కొలిక్కి రావచ్చని అంటున్నారు.

# చేపలకు అహారంగా కోళ్ల వ్యర్ధాలు

- **చెరువు యజమానికి నోటీసులు**

**భద్రాద్రి, ఫిబ్రవరి 18, ( వెలుతురు ) :**

రెండు తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ లాంటి వైరస్ తో కోళ్లు మృత్యువాత పడుతుంటే... మరోపక్క తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించాలన్న ఉద్దేశంతో చేపల చెరువుల యజమానులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం రాజాపురం గ్రామంలోని ఓ చేపల చెరువులో చనిపోయిన కోళ్లను వాటి వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేస్తున్నారు దీంతో ఆ చెరువు నుండి తీవ్ర దుర్గంధం రావడంతో అక్కడి స్థానికులు మత్స్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసారు. చేపల చెరువును పరిశీలించిన మత్స్యశాఖ అధికారులు కోడి వ్యర్థాలను చేపలకు వేయటం నేరమని భూగర్భ జలాలు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని చెరువు యజమానికి నోటీసులు ఇచ్చి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

# అక్రమ వలసదారులను ఎలా గుర్తిస్తారంటే

**వాషింగ్టన్, ఫిబ్రవరి 18, ( వెలుతురు )**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులను ఆ దేశం నుంచి పంపిస్తున్నారు. ఇందుకోసం దేశమంతా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వందల మందిని తరలించారు. ఇటీవలే 312 మందితో భారత్‌కు కూడా ఓ విమానం వచ్చింది. ఇందులో గుజరాత్, హరియాణా, పంజాబ్‌లకు చెందిన అక్రమ వలసదారులు ఉన్నారు. వారంతా స్వదేశానికి వచ్చారు. అమెరికా ఎవరిని బహిష్కరిస్తుంది.. మళ్లీ వారు అక్కడకు వెళ్లొచ్చా అన్న సందేహాలు కూడా కలుగుతున్నాయి.అమెరికా నుంచి ఎవరిని బహిష్కరిస్తున్నారనే వివరాలను మైగ్రేషన్ పాలసీ రిపోర్టు కొన్ని వివరాలు వెల్లడించింది. అనధికారికంగా ఉంటున్నవారినే బహిష్కరిస్తారని చాలా మంది భావిస్తున్నారు. అయితే దేశంలో చట్టబద్ధంగా నివసిస్తూ సిటిజన్‌షిప్ పొందని వలసదారులు కూడా కొన్ని పరిస్థితుల్లో బహిష్కరణకు గురికావొచ్చు. అనధికారిక వలసదారులు, అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించినవారు, వీసా గడువు ముగిసినా దేశంలో ఉంటున్నవారిని వారి దేశాలకు పంపించవచ్చు. తాత్కాలిక వీసాపై అమెరికాకు వెళ్లి అక్కడే నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్నవారిని కూడా బహిష్కరిస్తుంది. అక్రమ వలసదారులే కాకుండా అమెరికాలోని గ్రీన్‌కార్డు హోల్డర్లు, తాత్కాలిక వీసా హోల్డర్లు కూడా బహిష్కరణకు గురికావొచ్చు. అయితే ఈ కోవలోకి వచ్చే వక్తులు నేరాలకు పాల్పడినట్లు నిరూపణ కావాలి. ఈ నేరాలలో తాగి వాహనం నడపడం, అనుమతి లేకుండా ఆయుధాలతో దొరికిపోవడం, డ్రగ్స్ తీసుకోవడం, తిరగడం, హింసాత్మక నేరాలకు పాల్పడడం వంటివి ఉన్నాయిఅనైతిక చర్యలతో కూడిన నేరానికి పాల్పడిన వ్యక్తిని బహిష్కరించడానికి రెండు మార్గాలు ఉన్నాయి. మొదటిది అమెరికాలో నివసించిన మొదటి ఐదేళ్లలో అనైతికంగా భావించే నేరానికి పాల్పడడం, రెండోది వేర్వేరు కేసుల్లో రెండు లేదా అంతకన్నా ఎక్కువ అనైతిక నేరాలకు పాల్పడడం, రెండోదానికి కాలపరిమితి లేదు. అయితే అనైతిక చర్యలతో కూడిన నేరం అంటే ఏమిటో స్పష్టమైన నిర్వచనం లేదు. ఈ విషయంపై అమెరికా కోర్టులు ఎప్పటికప్పుడు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నాయి. వీటిలో మోసం, వ్యక్తులు లేదా ఆస్తికి హాని కలిగించే ఉద్దేశం, మరణ లేదా దోపిడీకి కారణమయ్యే వారు, భార్యాభర్తల మధ్య హింస మొదలైనవి.అమెరికా ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్వో) అధికారులు ఆ దేశంలో వలస చట్టాలను అమలు చేసే పనిలో ఉంటారు. ఈ అధికారులు నేషనల్ సెక్యూరిటీ వ్యవహారాలు చూస్తుంటారు. ఇమిగ్రేషన్ అమలు ప్రక్రియ అన్ని దశలను ఈఆర్వో నిర్వహిస్తుంది. ఇమిగ్రేషన్ అమలు ప్రక్రియ అన్ని దశలను ఈఆర్వో నిర్వహిస్తుంది. బహిష్కరణకు అర్హత ఉన్నవారి గుర్తింపు, అరెస్టు, నిర్బంధం, వారి దేశాలకు పంపిచే ప్రక్రియ తదితరాలు ఉంటాయి.ఇక బహిష్కరణకు అర్హులైన వ్యక్తులను గుర్తించడానికి లక్ష్య(టార్గెటెడ్), గూఢచార కార్యకలాపాలను ఈఆర్వో నిర్వహిస్తుంది. క్రిమినల్ అరెస్ట్ వారెంట్‌లను అమలుఏయడం, బహిష్కరణకు అర్హత ఉన్న వ్యక్తుల అరెస్టులతోపాటు ఇమ్మిగ్రేషన్ సంబంధిత క్రిమినల్ చర్యల కోసం ప్రాజిక్యూషన్ ప్రారంభించే అధికారం ఈఆర్వోకు ఉంది. ఈఆర్వో విభాగం అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ప్రధానంగాఎందు వర్గాలుగా విభజిస్తారు. ఒకటి అమెరికా పౌరసత్వం ఉన్నవారు, రెండోది అమెరికాలో వారి నేర చరిత్ర ఆధారంగా నిర్ణయిస్తారు..




### అమెరికాలో అమ్మకానికి ఇళ్లు
### 90 రోజుల్లో 1200 ఇళ్లు

అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. జనవరి 20న ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే ఆయన ఎన్నికల హామీలు నెరవేర్చడంపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలోనే మేక్ అమెరికా గ్రేట్ ఎగై న్ నినాదంతో ముందుకు వెళ్తున్నారు. ట్రంప్ నిర్ణయాలతో ప్రపంచ దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. ప్రధానంగా అక్రమ వలసదారులను ఖైదీల్లా స్వదేశాలకు పంపుతున్నారు. జన్మతః సిటిజన్‌షిప్ రద్దు చేశారు. మరోవైపు కెనడా, మెక్సికో, చైనా దిగుమతులపై 25 శాతం సుంకాలు విధించారు. స్టీల్, అల్యూమినియం దిగుమతిపైనా భారీగా పన్ను విధించారు. ట్రంప్ నిర్ణయాలతో ప్రపంచదేశాలతోపాటు అమెరికాలో ఉంటున్న విదేశీయులు ఇబ్బంది పడుతున్నారు. ఆ దేశ ప్రజలు కూడా భయపడుతున్నారు. దీంతో వాషింగ్టన్ డీసీలో రియల్ ఎస్టేట్ మార్కెట్ పతనం అవుతోంది. దీంతో వేల ఇళ్లను అమ్మకానికి ఉంచారు.అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో 14 రోజుల్లో 4,271 కన్నా ఎక్కువ ఇళ్లను అమ్మకానికి ఉంచారు. ఈవిషయాన్ని ఒక ఎక్స్ యూజర్ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఎలుకలు పారిపోతున్నాయి. అని కాప్షన్ ఇచ్చాడు. నగరవాసులు తమ వసుత్వులు సర్దుకుని సామూహికంగా నగరం విడిచి వెళ్లిపోతున్నారని తెలిపారు. ఈ వలసలకు కారణం ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ అని స్థానికులు చెబుతున్నారు. నగరంలో, చుట్టుపక్కలక అమ్మకానికి ఉన్న 14,825 ఇళ్లను చూపించే ఫొటోలు కూడా సోషల్ మీడియాలో షేర్‌చేశారు. నగరంలో 500లకుపైగా ఇళ్లు, రూ.8 కోట్లకన్నా ఎక్కువ ధరకు అమ్మకానికి ఉన్నాయి వెల్లడించారు. అమెరికన్లను సురక్షితంగా ఉంచే విధానాలపై పనిచేసే థింక్ ట్యాంక్ అయిన సెంటర్ ఫర్ సెక్యూరిటీ పాలసీలో పనిచేస్తున్న సీనియర్ విశ్లేషకుడు తెలిపారు.ఆన్‌లైన్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్లేస్ అయిన జిల్లోలో అమ్మకానికి ఉన్న ఇళ్ల జాబితాను మరో ఎక్క్ యూజర్ షేర్ చేశాడు. ఏడు రోజుల్లో 201, 14 రోజుల్ల 378, 30 రోజుల్లో 706, 90 రోజుల్లో 1,198 కొత్త ఇళ్లు అమ్మకానికి వచ్చినట్లు వివరించాడు. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలను కూడా ఎక్స్‌లో పోస్టు చేశాడు. అక్రమ వలసదారులను తరలిస్తుండడంతో వారంతా అప్పటికే కొనుగోలు చేసిన ఇళ్లను అమ్మకానికి పెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో ఇళ్ల అమ్మకాలు పెరుగుతున్నాయి.

# ఆసియాను శాసిస్తున్న ఇండియన్ బిలీయనీర్స్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18, ( వెలుతురు)**

ఆసియాలోని సంపద చార్టులలో భారతీయులు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ కొన్నేళ్లుగా అగ్రస్థానంలో ఉంటున్నారు. తాజాగా ఈ జాబితాలో పలు భారతీ కుటుంబాలు కూడా చేరాయి.ప్రపంచంలో అత్యంత ధనవంతుడు టెస్లా, స్పేస్ ఎక్, ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్, ప్రస్తుతం డోస్ చైర్‌పర్సన్‌గా కూడా ఉన్నారు. ఆయనతో అనేక మంది పోటీ పడుతున్నారు. కానీ, రెండేమూడేళ్లుగా మస్కే అగ్రస్థానంలో ఉంటున్నారు. ఇక ఆసియా ధనవంతుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ టాప్ వన్‌లో ఉన్నారు. ఆయనతో అనేక మంది పోటీ పడుతున్నా.. అగ్రస్థానంలో అంబానీ కుటుంబమే ఉంది. తాజాగా బ్లూమ్‌బెర్గ్ ఆసియాలో అత్యంత సంపన్నులైన 20 జాబితా విడుదల చేసింది. ఇందులో ఆరుగురు భారతీయులు ఉన్నారుఅంబానీ కుటుంబం 90.5 బిలియన్ డాలర్ల సంపదతో బ్లూమ్‌బెర్గ్ చార్టులలో అగ్రస్థానంలో ఉంది. ఈ కుటుంబానికి చెందిన ప్రధాన సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్. దివంగత పారిశ్రామికవేత్త ధీరూభాయ్ అంబానీ కుమారుడు ముఖేష్ అంబానీ నేతృత్వంలో ఈ సంస్థ ఉంది. అతని నివాసం, 27 అంతస్తుల భవనం, ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఖరీదైన ప్రైవేట్ నివాసంగా పిలువబడుతుంది.జాబితాలో రెండోస్థానంలో థాయిలాండ్‌లోని చీరవనాంట్ కుటుంబం, మొత్తం సంపద 42.6 బిలియన్ డాలర్లు. ఇది అంబానీల సంపదలో సగం కంటే తక్కువ. ఈ కుటుంబం ఆహారం, రిటైల్ మరియు టెలికాం యూనిట్లను నిర్వహించే చారోయెన్ పోక్‌ఫాండ్ గ్రూప్‌ను కలిగి ఉంది. బ్యాంక్ సెంట్రల్ ఆసియాతో వారి విజయం, పొగాకు వ్యాపారంతో వారి ప్రారంభం కారణంగా ఇండోనేషియాకు చెందిన హార్టోనో కుటుంబం 42.2 బిలియన్ల డాలర్ల సంపదతో తదుపరి స్థానంలో ఉంది. జాబితాలో నాల్గవ స్థానంలో భారతదేశానికి చెందిన మిస్త్రీ కుటుంబం ఉంది, ఈ కుటుంబం సంపద 37.5 బిలియన్ల డాలర్లు. ఈ కుటుంబానికి చెందిన షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ ఇంజనీరింగ్ నిర్మాణంతో సహా బహుళ రంగాలలో పనిచేస్తుంది. భారతదేశంలోని అతిపెద్ద సమ్మేళన సంస్థలలో ఒకటైన టాటా గ్రూప్‌లో ఈ కుటుంబం గణనీయమైన వాటాను కలిగి ఉంది.ఐదవ స్థానంలో హాంకాంగ్‌లోని అతిపెద్ద రియల్ ఎస్టేట్ డెవలపర్‌లలో ఒకటైన సన్ హంగ్ కై ప్రాపర్టీస్‌ను కలిగి ఉన్న హాంకాంగ్‌కు చెందిన క్వాక్ కుటుంబం ఉంది. ఈ కుటుంబ సంపద 35.6 బిలియన్ల డాలర్లుతైవాన్‌కు చెందిన త్సాయ్ కుటుంబం 30.9 బిలియన్ల డాలర్లతో ఆరవ స్థానంలో ఉంది. ఈ కుటుంబ సంపద ప్రధానంగా కాథే లైఫ్ ఇన్సూరెన్స్ మరియు ఫుబన్ ఇన్సూరెన్స్ నుండి వచ్చింది, అదే సమయంలో రియల్ ఎస్టేట్ మరియు టెలికాం వంటి ఇతర రంగాలలోకి కూడా విస్తరించింది.భారతదేశానికి చెందిన జిందాల్ కుటుంబం 28.1 బిలియన్ల డాలర్ల నికర విలువతో ఏడవ స్థానంలో ఉంది. ఇది ఉక్కు, శక్తి, సిమెంట్ మరియు క్రీడలు వంటి రంగాలలో వ్యాపార ప్రయోజనాలను కలిగి ఉన్న ప్రసిద్ధ జిందాల్ గ్రూప్‌ను కలిగి ఉంది.థాయ్‌లాండ్‌కు చెందిన యూవిధ్య కుటుంబం ఎనిమిదో స్థానంలో నిలిచింది, వీరికి టీసీపీ గ్రూప్ ఉంది. వీరి సంపద 25.7 బిలియన్ల డాలర్లు. ఈ గ్రూప్ రెడ్ బుల్ అనే ఎనర్జీ డ్రింక్‌ను ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ చేస్తుంది.బిర్లా కుటుంబం జాబితాలో తొమ్మిదవ స్థానంలో ఉంది. 23.0 బిలియన్ల డాలర్ల నికర విలువతో, ఆదిత్య బిర్లా గ్రూప్ ఆర్థిక సేవలు, మెటల్ మరియు రిటైల్ వంటి పరిశ్రమలలో ఆసక్తిని కలిగి ఉంది.శామ్‌సంగ్‌ను నడుపుతున్న దక్షిణ కొరియాకు చెందిన లీ కుటుంబం 22.7 బిలియన్ల డాలర్ల సంపదతో జాబితాలో పదవ స్థానంలో నిలిచింది.అలాగే, బజాజ్, హిందూజా కుటుంబాలు వరుసగా 20.1 బిలియన్లు 15.2 బిలియన్ల డాలర్ల నికర విలువతో ప్రపంచ వ్యాపార వేదికపై భారతదేశం ప్రభావాన్ని ప్రదర్శిస్తూ టాప్ 20లో ఉన్నాయి.

# మోడీ, రాహుల్ కులాల కుంపట్లు




**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ( వెలుతురు ) :**

తెలంగాణ రాజకీయాల్లో కొద్ది రోజుల నుంచి టాపిక్ మారిపోయింది. రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ బీసీ కాదని ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని వాదిస్తున్నారు. వెంటనే బీజేపీ నేతలు రాహుల్ గాంధీ కులం, మతం ఏమిటని ప్రశ్నించడం ప్రారంభించారు. ఈ వాదోపవాదాలు రెండు పార్టీల మధ్య హెూరాహెూరీగా సాగుతున్నాయి. ప్రతీ రోజూ ఎవరో ఒకరు ఈ అంశంపై చర్చ పెడుతున్నారు. దీంతో బీఆర్ఎస్ గురించి ఎవరూ మాట్లాడటం లేదు. ఆ పార్టీ నుంచి కూడా ఎవరూ ఈ టాపిక్ నుంచి మాట్లాడటం లేదు. బీజేపీ, కాంగ్రెస్ వ్యూహాత్మకంగానే ఈ టాపిక్ అందుకున్నాయని బీఆర్ఎస్ అనుమానిస్తోంది. ప్రధాని నరేంద్రమోదీది బీసీ కులం కాదని ఆయనది అగ్రకులమని అయినప్పటికీ తనను తాను బీసీగా చెప్పుకుని రాజకీయలబ్ది పొందుతున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై వారు కాంగ్రెస్ పార్టీ నేతలు వరుసగా స్పందిస్తున్నారు. మోదీ కులాన్ని రాజకీయంగా చర్చకు పెడుతున్నారు. వీరు మోదీని విమర్శిస్తే బీజేపీ నేతలు ఊరకనే ఉండే అవకాశం లేదు. వారు కూడా ఘాటుగా స్పందిస్తున్నారు. రాహుల్ గాంధీని టార్గెట్ చేసి ఆయనది .. ఏ కులం, ఏ మతం అని ప్రశ్నిస్తున్నారు. రాహుల్ గాంధీ కులమతాలపై బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ పార్టీ గట్టిగానే కౌంటర్ ఇస్తోంది. దేశవ్యాప్తంగా కులగణన చేసి .. ఆ ఫాంతో రాహుల్ గాంధీ ఇంటికి వెళ్తే ఏ కులమో తెలుస్తుందని కొంత మంది నేతలు సెటైర్లు వేస్తున్నారు. జగ్గారెడ్డి అయితే నేరుగా స్పందిస్తున్నారు. రాహుల్ గాంధీ బ్రాహ్మణ కులానికి చెందిన వ్యక్తి అని.. హిందువు అని చెబుతున్నారు. అయితే బీజేపీ మాత్రం రాహుల్ ఇల్లీగల్లీ కన్వర్టడ్ గాంధీ అని విమర్శలు చేస్తోంది. ఈ రెండు పార్టీల మధ్య తమ అగ్రనేతల, కుల మతాలపై చర్చ మాత్రం తెగడం లేదు. ఈ కుల, మతాల చర్చలోకి భారత రాష్ట్ర సమితి రాలేదు. అయితే ఈ రెండు జాతీయ పార్టీలు కుట్రపూరితంగా కుమ్మక్కు రాజకీయాలు చేసి కుల, మతాలపై చర్చలు పెడుతున్నారని.. తెలంగాణ ప్రజా సమస్యలను చర్చకు రానివ్వడం లేదని ఆరోపిస్తున్నారు. రాహుల్, మోదీలది ఏ కులం, ఏ మతమయితే ఏంటని.. తెలంగాణలో అమలు చేయాల్సిన హామీలను మలు చేయాలని కవిత డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో ప్రజావ్యతిరేకత కాంగ్రెస్ పై పెరుగుతూంటే..దాన్ని చర్చకు రానివ్వకుండా బీజేపీ సహకరిస్తోందని బీఆర్ఎస్ అనుమానిస్తోంది. అందులో రాజకీయం ఉందో లేదో కానీ.. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే తెలంగాణ పొలిటికల్ వార్ ఫిక్సయింది.

# పరమేశ్వరన్‌కు 'డ్రాగన్' బర్త్‌డే గిఫ్ట్ అయ్యేనా..?

మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో 2015లో చిత్రసీమలోకి అడుగుపెట్టిన అనుపమా పరమేశ్వరన్ ఈ దశాబ్ద కాలంలో దక్షిణాది భాషా చిత్రాలన్నింటిలోనూ నటించి నటిగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. మలయాళ సినిమాల్లో తొలిసారి నటించినా... ఆ తర్వాత సంవత్సరమే 'అ...ఆ'తో తెలుగు రంగంలోకి అడుగపెట్టింది. అంతేకాదు... మలయాళంలో 'ప్రేమమ్'లో చేసిన పాత్రనే తెలుగు రీమేక్ లోనూ చేసింది. 'అగరొత్తుల కురులే వలగ విసిరేసి' కుర్రకారు గుండెల్లో సెగలు రేపింది. అదే యేడాది 'కోడి' మూవీతో కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. దిల్ రాజ్ బ్యానర్ లో రూపుదిద్దుకున్న 'శతమానం భవతి' చిత్రం అనుపమా పరమేశ్వరన్ కు మంచి విజయాన్నే కాదు చక్కని పేరూ తెచ్చిపెట్టింది. ఈ సినిమా జాతీయ స్థాయిలో ఉత్తమ వినోదాత్మక చిత్రం అవార్డుతో పాటు రాష్ట్ర స్థాయిలో ఐదు నందీ అవార్డులనూ గెలుచుకుంది. ఆ తర్వాత అనుపమా తెలుగులో చేసిన చిత్రాలేవీ పెద్దంత కమర్షియల్ సక్సెస్ సాధించలేదు. కానీ తమిళ రీమేక్ వచ్చిన 'రాక్షసుడు' ఫర్వాలేదనిపించింది. ఇక మూడేళ్ళ క్రితం వచ్చిన 'రౌడీ బాయ్స్' నుండి అనుపమా కాస్తంత గ్లామర్ ట్రీట్ ఇవ్వడం మొదలెట్టింది. అప్పటి వరకూ పక్కింటి అమ్మాయిలా కనిపించిన అనుపమా కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్ గా మారిపోయింది. 'కార్తికేయ -2'లో పద్ధతి గల పాత్ర చేసినా... 'టిల్లు స్క్వేర్'లో లిప్ లాక్స్ తో సందడి చేసేసింది. గ్లామర్ పాత్రలకు అనుపమా న్యాయం చేస్తుందని ఆ సినిమా నిరూపించింది. పద్ధతిగల పాత్రల మీదుగా అందాల ఆరబోతకు జండా ఊపేసిన అనుపమా పరమేశ్వరన్ 'బట్లర్ ఫ్లై' వంటి లేడీ ఓరియంటెడ్ థ్రిల్లర్ మూవీలోనూ నటించింది. అలానే థాట్ ప్రొవోకింగ్ షార్ట్ ఫిల్మ్స్ సైతం చేసింది. ఇప్పుడు కూడా తెలుగులో 'పరదా' సినిమాలో అర్థవంతమైన పాత్రను పోషించింది. ఇవే కాకుండా 'బైసన్', లాక్ డౌన్, పెట్ డిటెక్టివ్, మరీచిక' వంటి సినిమాలలో అనుపమా నటిస్తోంది. ఫిబ్రవరి 21న రాబోతున్న 'డ్రాగన్'లో అనుపమా పరమేశ్వరన్... ప్రదీప్ రంగనాథన్ సరసన నటించింది. ఇది కూడా యూత్ ఫుల్ ఎంటర్ టైనరే! 'లవ్ టుడే'తో ఇప్పటికే యూత్ ను అట్రాక్స్ చేసిన ప్రదీప్ రంగనాథన్ లేటెస్ట్ మూవీ 'డ్రాగన్' కూడా హిట్ అయితే... అది అనుపమకు అభిమానులు ఇచ్చిన బర్త్ డే గిఫ్ట్ అనుకోవచ్చు.





## తొలి భర్త ఆత్మహత్య... రెండో పెళ్లి చేసుకుంటున్న హీరోయిన్ పావని రెడ్డి

సీరియల్స్ లో నటించి హీరోయిన్ గా మారిన వారిలో పావని రెడ్డి ఒకరు. పలు తెలుగు సీరియల్స్ లో నటించిన పావని రెడ్డి... ఆ తర్వాత సిల్వర్ స్క్రీన్ పై మెరిసింది. టాలీవుడ్ తో పాటు కోలీవుడ్ లో కూడా నటించింది. చారి 111, మళ్లీ మొదలైంది, గౌరవం, డ్రీమ్, డబుల్ ట్రబుల్ వంటి పలు సినిమాల్లో మెరిసింది. తాజాగా పావని రెడ్డి రెండో వివాహానికి సిద్ధమయింది. కొరియోగ్రాఫర్ ఆమిర్ తో ఆమె వివాహం ఈనెల 20న జరగనుంది. ఈమేరకు ఆమె ఇన్స్టాగ్రామ్ ద్వారా వెల్లడించింది. 2013లో పావని తొలి వివాహం జరిగింది. తెలుగు నటుడు ప్రదీప్ కుమార్ ను పావని ప్రేమించి పెళ్లి చేసుకుంది. 2017లో ప్రదీప్ ఆత్మహత్య చేసుకున్నాడు. పావని మరొకరితో చనువుగా ఉండటం వల్లే ప్రదీప్ ఆత్మహత్య చేసుకున్నాడనే వార్తలు అప్పట్లో వైరల్ అయ్యాయి. అయితే దీని గురించి పావని ఎప్పుడూ మాట్లాడలేదు. ఇప్పుడు ఆమె రెండో పెళ్లి చేసుకోబోతోంది. తమిళ బిగ్ బాస్ సీజన్-5లో పాల్గొన్న పావని సెకండ్ రన్నరప్ గా నిలిచింది. ఈ రియాల్టీ షోలో పాల్గొన్న కంటెస్టెంట్ ఆమిర్ తో ఆమె ప్రేమలో పడింది. వీరిద్దరూ కలిసే ఉంటున్నారన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఇప్పుడు పెళ్లితో వీరిద్దరూ వైవాహిక బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు.

## అల్లుఅర్జున్‌తో రోమాన్స్ చేయనున్న జాన్వీకపూర్

ఐకాన్ స్టార్ అల్లుఅర్జున్ నటించిన పుష్ప-2 మూవీ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. పుష్ప తర్వాత బన్నీ ఏం సినిమా చేయబోతున్నాడనే చర్చ సాగుతున్నది. సమాచారం మేరకు అల్లు అర్జున్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో ఓ సినిమా చేయనున్నాడనే వార్త తెగ వైరల్‌గా మారింది. అయితే, ఈ ప్రాజెక్టు కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉందని.. ఈ మూవీని పక్కన పెట్టి బన్నీ తమిళ ప్రముఖ దర్శకుడు అట్లీతో సినిమా చేయనున్నాడని ప్రచారం జరుగుతున్నది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ, అలనాటి అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్‌ను హీరోయిన్‌గా తీసుకోనున్నట్లు తెలుస్తున్నది. చాలారోజులుగా బన్నీతో అట్లీ సినిమా చేయాలనుకుంటున్నాడు. ఇద్దరి కాంబోలో హై యాక్షన్ సినిమా తెరకెక్కించనున్నట్లు టాక్ నడుస్తున్నది. త్వరలోనే వివరాలను ప్రకటించనున్నారు. ఇక అల్లు అర్జున్‌తో జాన్వీ కపూర్ రొమాన్స్ చేయనున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంపై ఇప్పటి వరకు ఎవరూ అధికారిక ప్రకటన చేయలేదు. జాన్వీ కపూర్ తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' మూవీతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది.



## ఫౌజీలో యువరాణిగా అలియాభట్

అగ్ర కథానాయకుడు ప్రభాస్, హను రాఘవపూడి కాంబోలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఫౌజీ అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఇమాన్ ఎస్మాయిల్ నటిస్తుంది. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నట్లు సమాచారం. అందుకే ఈ మూవీ టైటిల్ 'ఫౌజీ' అయితే బావుంటుందని బృందం భావిస్తున్నది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే కథతో రానుండగా బ్రిటీష్‌వారి సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారట. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు బాణీలు సమకూరుస్తున్నారు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో కీలకమైన బ్రిటిష్ యువరాణి పాత్రలో బాలీవుడ్ నటి ఆలియా భట్ నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. యువరాణి పాత్ర ఈ సినిమాలో కీలకం కావడంతో.. ఆలియా భట్‌ని తీసుకోబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. మరోవైపు ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ నటిస్తున్నాడు.

## మంచుమనోజ్ అరెస్టు..?

మంచువారి ఇంట వివాదం కొనసాగుతూనే ఉంది. హీరో మంచు మనోజ్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తున్నది. తిరుపతిలోని ఇంట్లో ఉన్న మనోజ్‌ను అదుపులోకి తీసుకుని భాకరాపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుటుంబ వివాదంలోమోహన్ బాబు చేసిన ఫిర్యాదు ఆధారంగానే అదుపులోకి తీసుకున్నట్లుగా సమాచారం. కాగా, భాకారాపేట సమీపంలోని ఉర్జా రిసార్ట్‌లో మనోజ్ బస చేస్తున్నారు. సోమవారం రాత్రి 12 గంటల తర్వాత పెట్రోలింగ్‌లో భాగంగా మనోజ్ వద్దకు వెళ్లిన పోలీసులు.. ఆయన్ను పలు ప్రశ్నలు అడిగారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. ఇక్కడ సెలబ్రిటీలకు అంత సురక్షితం కాదని సూచించారు. అయితే పోలీసుల డ్రామా అంటూ వారి తీరును తప్పుపట్టిన మనోజ్.. నేను ఇక్కడ విశ్రాంతి తీసుకుంటే మీకేంటి ఇబ్బంది అంటూ నిలదీశారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తున్నది.



## భాగ్యశ్రీకి వరుస ఆఫర్లు

ఔరా అనిపించే ఔరంగబాద్ అందం భాగ్యశ్రీ బోర్సే బంపర్ ఆఫర్ కొట్టేసింది. తమిళ అగ్ర కథానాయకుడు సూర్య సరసన నటించే ఛాన్స్ ఈ ముద్దుగుమ్మని వరించినట్టు చెన్నై మీడియాలో బలంగా వార్తలొస్తున్నాయి. సూర్య కథానాయకుడిగా తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటైర్టైన్మెంట్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మించనుంది. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీత దర్శకుడు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా ఖాయం అయ్యిందట. మే నెలలో షూటింగ్ మొదలు కానున్నట్టు సమాచారం. తొలి సినిమా 'మిస్టర్ బచ్చన్' ఫలితం ఎలా ఉన్నా.. భాగ్యశ్రీబోర్సే మాత్రం అందంతో మార్కులు కొట్టేసి యూత్‌ని కట్టిపడేసింది. అందుకే ఈ ముద్దుగుమ్మకు అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'కాంత' సినిమాలో హీరోయిన్‌గా చేస్తున్నది భాగ్యశ్రీబోర్సే. రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్ఘీస్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. రామ్ పోతినేని హీరోగా 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేం మహేశ్‌బాబు తెరకెక్కిస్తున్న చిత్రంలోనూ భాగ్యశ్రీనే కథానాయిక. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న 'కింగ్‌డమ్'లోనూ భాగ్యశ్రీనే హీరోయిన్. ఈ లైనప్‌ని బట్టి చూస్తుంటే.. ఈ ముద్దుగుమ్మకు మహర్దశ మొదలైందనిపిస్తుంది.



# హైవోల్టేజ్‌కు ఏపీ పాలిటిక్స్

**విజయవాడ, ఫిబ్రవరి 18 వెలుతురు:**
ఈ నెల 24 నుంచి ఏపీ అసెంబ్లీ సెషన్ ప్రారంభం కానుంది. సభాసమరం స్టార్ట్ కాకముందే ఇంతలోపే ఏపీ పాలిటిక్స్ హైవోల్టేజ్‌కు చేరుకుంటున్నాయి. మాజీ సీఎం జగన్ చుట్టే వ్యవహారం తిరుగుతోంది. వైసీపీకి పదకొండు సీట్లే ఉన్నాయ్..ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని కూటమి సర్కార్ అంటోంది. తమకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తామని వైసీపీ డిమాండ్ చేస్తోంది. ఈ పరిస్థితుల్లో ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మీడియా ముందుకు వచ్చి..పెద్ద బాంబే పేల్చారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని చెప్తూనే..సభకు రాకపోతే వేటేనని కరాఖండిగా చెప్పేశారు. 60 రోజులు సభకు రాకపోతే ఆటోమేటిక్‌గా సభ్యత్వం రద్దు అవుతుందని..అది రూల్స్ బుక్‌లోనే ఉందని గుర్తు చేస్తున్నారు. దీంతో మరోసారి హీటెక్కాయి ఏపీ పాలిటిక్స్.గత ఏడాది జూన్ తర్వాత జరిగిన ఏపీ అసెంబ్లీలో అధికార పక్షమే ఉంది. విపక్ష వైసీపీ అయితే సభకు వెళ్లడం లేదు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరుతోంది. కానీ అది అయ్యే పని కాదని రూల్స్‌ను ప్రస్తావిస్తోంది కూటమి ప్రభుత్వం. ఈ నేపథ్యంలో ఏకంగా 15రోజుల పాటు జరగబోతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ హాజరు అవుతుందా అన్నది ఆసక్తిని పెంచుతోంది.అసెంబ్లీకి రాకపోతే అనర్హత వేటు అని ఒక పక్కన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. దాంతో వైసీపీ సభకు అటెండ్ కాక తప్పదా అన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీలో కూటమి పార్టీలకే 164 సీట్లు ఉన్నాయి. వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. దాంతో పాటు విపక్ష హోదా ఇవ్వరు కాబట్టి జగన్‌తో పాటు అంతా సాధారణ ఎమ్మెల్యేలుగానే ఉంటారు.సాధారణ ఎమ్మెల్యేగా ఉంటే తనకు ఇచ్చే సమయం కూడా తక్కువగా ఉంటుందని అంటున్నారు జగన్. విపక్ష నేతగా ఉంటే కచ్చితంగా మైక్ దక్కుతుందని భావిస్తున్నారు. అపోజిషన్ హోదా ఉంటే సీఎం కానీ మంత్రులు కానీ మాట్లాడిన తర్వాత కౌంటర్ చేయడానికి వీలు ఉంటుంది. కానీ ఈసారి జగన్ సభకు వస్తే ఒక సాధారణ సభ్యుడికి ఇచ్చినట్లే అతి తక్కువ సమయం దక్కనుంది.ప్రతిపక్ష హోదా లేకపోతే మాట్లాడేందుకు ఎక్కువ




టైమ్ ఇవ్వరని..సభకు రాకుండా ఉంటే అనర్హత వేటు వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం పెద్ద వ్యూహంతోనే ఈ బడ్జెట్ సమావేశాలకు వెళ్తుందనే ప్రచారం జరుగుతోంది. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్న సాకు చూపి వైసీపీ సభకు అటెండ్ కాకపోతే..11 మంది ఎమ్మెల్యేల మీద వేటు వేసే అంశాన్ని పరిశీలిస్తుందట. అందులో భాగంగానే స్పీకర్, డిప్యూటీ స్పీకర్ మీడియా ముందుకు వచ్చి మరీ చెప్పేశారని అంటున్నారు. ఒకవేళ చర్యలు తీసుకుంటే కూడా స్పీకర్ నిర్ణయాన్ని కోర్టులు కూడా తప్పు పట్టే అవకాశాలు ఉండవని లెక్కలు వేసుకుంటున్నారట.సిచ్యువేషన్ చూస్తుంటే బాల్ ఇప్పుడు వైసీపీ కోర్టులోనే ఉన్నట్లు కనిపిస్తోంది. వైసీపీ సభ్యులు సభకు అటెండ్ కాకపోతే ఏదో ఒక డెసిషన్ తీసుకోవాలని కూటమి సర్కార్ భావిస్తోందట. ఆ విషయం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ మాటల్లో స్పష్టంగా అర్థమవుతోంది. ఈ క్రమంలో అసెంబ్లీ సమావేశాలకు వెళ్లబోనని ఇప్పటికే చెప్పేశారు వైసీపీ అధినేత జగన్. ఈ నెల 12న పార్టీ ముఖ్య నేతలతో సమావేశం అవుతారని..ఆ మీటింగ్‌లో అసెంబ్లీకి హాజరు కావాలా వద్ద అన్న దానిపై ఫైనల్ డెసిషన్ తీసుకుంటారని అంటున్నారు.అయితే చాలామంది వైసీపీ నేతలు మాత్రం శాసనసభా సమావేశాలకు వెళ్లడమే బెటరనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారట. ఇచ్చిన టైమ్‌లోనే అధికార పక్షాన్ని ఇరకాటంలో పెట్టేలా సబ్జెక్ట్ ప్రిపేర్ చేసుకుని వెళ్లాలని సూచిస్తున్నారట.

ఒకవేళ సభలో మాట్లాడే టైమ్ ఇవ్వకపోతే వాకౌట్ చేసి ప్రెస్‌మీట్ పెట్టే అవకాశం ఉండనే ఉందని గుర్తు చేస్తున్నారట. జగన్ అసెంబ్లీకి హాజరవుతారా లేదా అనే ఉత్కంఠ కంటిన్యూ అవుతోంది. అయితే 11మందిలో ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేలు అయిన కొందరు వైసీపీ సభ్యులు..తమ నియోజకవర్గ సమస్యలను చెప్పుకోవాలని ఆశ పడుతున్నారు. అధ్యక్షా అని సభలో తన గళం వినిపించాలని అనుకుంటున్నారట. దాంతో జగన్ మనసు మార్చుకుని అసెంబ్లీ హాజరవుతారా.? లేక ఏమైనా చేసుకోనీ అని ప్రతిపక్ష హోదా డిమాండ్‌కే కట్టుబడి ఉంటారా అన్నదే చర్చగా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# బలప్రదర్శనకు జనసేన...

**కాకినాడ, ఫిబ్రవరి 18, (వెలుతురు ) :**
జనసేన ఆవిర్భావ వేడుకలు పిఠాపురంలో జరగనున్నాయి. మార్చి 14న పెద్ద ఎత్తున ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. ఈ సంధర్భంగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యేలా జనసేన అధినాయకత్వం ప్రణాళిక రూపొందించింది. ఎన్నికల్లో విజయం తర్వాత నిర్వహించనున్న తొలి ఆవిర్భావ సభ కావడంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇంతకు ఈ సభ బలనిరూపణ కోసమా? వాస్తవంగా ఆవిర్భావ సభనే అంటూ రాజకీయ విశ్లేషకులు పెద్ద స్థాయిలో చర్చ సాగిస్తున్నారు.ఏపీలో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంలో జనసేన కీలకంగా వ్యవహరించిందన్నది బహిరంగ రహస్యమే. వెంటీలేటర్ పై ఉన్న టీడీపీకి బీజేపీతో జతచేయించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఊపిరి అందించారని పలువురి అభిప్రాయం. ఇదే మాటను పలుమార్లు టీడీపీ అధినేత చంద్రబాబు కూడా చెప్పకనే చెప్పారు. అయితే కూటమి ఏకంగా 164 సీట్లలో విజయఢంకా మోగించింది. ఆ తర్వాత సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ లు భాద్యతలు చేపట్టారు. ఈ ప్రభుత్వం ఇప్పటికే 8 నెలల పాలనా కాలాన్ని పూర్తి చేసుకుంది.అయితే ప్రభుత్వం వరకు ఓకే గానీ, కూటమిలోని పార్టీలు మాత్రం ఎవరి బలాన్ని వారు పెంచుకొనే పనిలో పడ్డారని చెప్పవచ్చు. ఇటీవల టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంను నిర్వహించగా, ఊహించని స్థాయిలో కోటికి పైగా సభ్యత్వ నమోదు సాగింది. అలాగే వైసీపీ నుండి వచ్చిన పలువురు నాయకులకు టీడీపీ వెల్ కమ్ చెప్పింది. పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడంలో ఏమాత్రం వెనక్కు తగ్గినా ఊరుకొనే ప్రసక్తే లేదని ఇప్పటికే పలుమార్లు తమ ఎమ్మెల్యేలకు చంద్రబాబు క్లాస్ తీసుకున్నారు. మొత్తం మీద



టీడీపీని మరింత బలోపేతం చేసేలా ఓ వైపు చంద్రబాబు, మరోవైపు నారా లోకేష్ తమ రాజకీయ పావులు కదుపుతున్నారు.ఇక కూటమిలో రెండో పార్టీగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీ జనసేన. ఇప్పటి వరకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రభుత్వ పాలనా పరమైన అంశాలపై దృష్టి సారించారు. అలాగే జనసేనలో నెంబర్ %-% 2 గా గల నాదెండ్ల మనోహర్ కూడా మంత్రి వర్గంలో ఉండడంతో పార్టీ క్యాడర్ కు అంతగా అందుబాటులో లేరని ప్రచారం. మరో జనసేన కీలక నేత, పవన్ సోదరుడు నాగబాబు పార్టీ వ్యవహారాలను చూస్తూ వస్తున్నారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో పార్టీలో చేరికల నేపథ్యంలో నాగబాబు హాజరై, పార్టీలోకి వారిని సాదరంగా స్వాగతించారు. ఈ దశలోనే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మరికొందరు నేతలకు జనసేన కూడా స్వాగతం పలికింది. ఓ వైపు కోటికి పైగా సభ్యత్వ నమోదు పూర్తి చేసుకొని టీడీపీ క్యాడర్ హుషారుగా ఉండగా, ప్రస్తుతం జనసేన బలాన్ని కూడా పెంచుకోవాలన్న లక్ష్యం పార్టీ అగ్ర నాయకత్వంలో కనిపిస్తోంది. ఈ సందర్భంగానే పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో మార్చి 14న పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు పవన్ సిద్ధమయ్యారు. ఎన్నికల్లో తమ పార్టీ వందశాతం స్ట్రైక్ రేట్ తో విజయాన్ని అందుకున్న తర్వాత నిర్వహిస్తున్న తొలి పార్టీ సమావేశం ఇది. ఈ భారీ బహిరంగ సభ ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసుకొనేలా పవన్ ప్లాన్ చేసినట్లు టాక్ నడుస్తోంది. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేందుకు ఇప్పటి నుండే ఆయా జిల్లాల పార్టీ నాయకులకు తగు సూచనలు చేసినట్లు సమాచారం.ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేసి, మళ్ళీ యావత్ దేశం దృష్టి ఆకర్షించేలా చేయాలన్నది పవన్ అభిమతమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా విస్తృతం చేసి, పార్టీ క్యాడర్ కు ఇప్పటి నుండి అందుబాటులో ఉండాలని పవన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. 2029 ఎన్నికల సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా జనసేనకు ప్రతి గ్రామంలో క్యాడర్ ఉండాలన్నది పవన్ అభిమతమట. మొత్తం మీద పిఠాపురం జనసేన ఆవిర్భావ సభ.. బల నిరూపణ సభ కానుందని రాజకీయ విశ్లేషకుల మధ్య తీవ్రస్థాయిలో చర్చ సాగుతోంది.

# టీడీపీ టార్గెట్ లో మరో ఇద్దరు వైసీపీ నేతలు

**విజయవాడ, ఫిబ్రవరి 18, ( వెలుతురు)**
కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన ఎనిమిది నెలల తర్వాత వైసీపీ కీలక నేతల అరెస్ట్ లు ప్రారంభమయ్యాయి. బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ను ఒక మర్డర్ కేసులో జైలుకు పంపారు. అదే సమయంలో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సయితం నెల్లూరు జైలు లో కొద్ది రోజులు ఉండి తర్వాత బెయిల్ పై బయటకు వచ్చారు. తాజాగా వల్లభనేని వంశీ అరెస్ట్ కావడంతో తర్వాత గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నానిని అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జోరుగా జరుగుతుంది. కొడాలి నాని ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని అంటున్నారు. తాజాగా మరో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పేరు కూడా అదే స్థాయిలో వినపడుతుండటం విశేషం.వెల్లంపల్లి శ్రీనివాస్ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పై వ్యక్తిగత విమర్శలు చేసి కూటమి ప్రభుత్వం ఆగ్రహానికి గురయ్యారు. దీంతో పాటు ఆయనపై అనేక కేసులు నమోదు కావడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిసింది. మంత్రిగా ఉన్న సమయంలోనూ, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దుర్గగుడి లో జరిగిన అవినీతిపై అనేక ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించిన ఫిర్యాదుల కోసం వెయిట్ చేస్తున్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే వెల్లంపల్లి శ్రీనివాస్ పై కేసు నమోదు చేసే అవకాశముంది.



దీనికి సంబంధించిన ఆధారాలను సేకరించడంలో ఒక బృందం బిజీగా ఉందని చెబుతున్నారు. వెల్లంపల్లి శ్రీనివాస్ పై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సిద్ధం చేస్తున్నారు.వెల్లంపల్లి శ్రీనివాస్ అనేక పార్టీలు మారారు. తొలుత ప్రజారాజ్యం పార్టీలో చేరి 2009 లో ఆయన విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి గెలిచారు. అనంతరం కాంగ్రెస్ లో ప్రజారాజ్యం విలీనం చేయడంతో వెల్లంపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ లో చేరిపోయారు. తర్వాత బీజేపీలో చేరారు. అనంతరం వైసీపీలో చేరి 2019 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత జగన్ కేబినెట్ లో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన వెల్లంపల్లి శ్రీనివాస్ అధికారంలోకి రాగానే పవన్ కల్యాణ్ ను టార్గెట్ చేశారు. పవన్ కల్యాణ్ పై వ్యక్తిగతంగా విమర్శలకు దిగడంతో జనసైనికుల ఆగ్రహానికి గురయ్యారు. జగన్ ప్రాపకం సంపాదించడం కోసమే వెల్లంపల్లి శ్రీనివాస్ ఈ రకమైన వ్యాఖ్యలు చేశారన్న టాక్ ఉంది.గన్నవరం తర్వాత గుడివాడ.. ఆ తర్వాత విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ను ప్రభుత్వం టార్గెట్ చేస్తుందన్న ప్రచారం ఉంది. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో మంత్రి హోదాలో కనకదుర్గ దేవాలయంలో పాల్పడిన అవకతవకలు ఆయనకు ఉచ్చు బిగియనున్నాయి. టిక్కెట్ల విషయంలోనూ, చీరల అమ్మకాల్లోనూ అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో వెల్లంపల్లి శ్రీనివాస్ పై వరసగా కేసులు నమోదయ్యే అవకాశాలున్నాయని బెజవాడలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. దీనిని ప్రచారంగా మాత్రమే కొట్టిపారేయాల్సిన అవసరం లేదని, త్వరలోనే మరికొందరు నేతలు జైలు పాలు కాక తప్పదన్న టీడీపీ నేతల హెచ్చరికలు ఇందుకు అద్దం పడుతున్నాయి.

# ఢిల్లీ సిఎం ఎంపికపై నేడు బిజెపి భేటీ

- పర్వేశ్ వర్మవైపు బిజెపి నేతల మొగ్గు
- రేపటి ప్రమాణ స్వీకారానికి భారీగా ఏర్పాట్లు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18( వెలుతురు ):**
ఈ నెల 20 ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరనుందని సమాచారం. సిఎం అభ్యర్థి ఎంపిక సోమవారమే జరగాల్సి ఉన్నా..దానిని 19కి వాయిదా వేశారు. బుధవారం జరిగే భేటీలో సిఎం ఎంపిక జరగవచ్చు. 27 ఏళ్ల కలను సాకారం చేసుకుంటూ దేశ రాజధాని దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది భారతీయ జనతా పార్టీ త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. ఇన్నేళ్ల తర్వాత అధికారంలోకి వస్తుండటంతో నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున సినీ తారలు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 20న గురువారం సాయంత్రం 4.30 గంటలకు కొత్త సీఎం ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఖరారైనట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. ప్రఖ్యాత రామ్‌లీలా మైదాన్‌లో జరిగే ఈ వేడుకకు కమలదళం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రమాణస్వీకారానికి ముందు ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇక, 50 మంది సినీతారలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు ఇతర దేశాల దౌత్యవేత్తలు, 20 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు, కేంద్రమంత్రులు, భాజపా అగ్రనేతలు ఈ కార్యక్రమానికి హాజరవుఉతన్నట్లు సమాచారం. వీరితోపాటు దిల్లీకి చెందిన పలువురు రైతులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్దిదారులను కూడా ఆహ్వానించినట్లు సమాచారం. బాబా రాందేవ్, స్వామి చిదానంద, బాబా బాగేశ్వర్ ధీరేంద్రశాస్త్రి వంటి ఆధ్యాత్మిక గురువులు ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నట్లు భాజపా వర్గాలు పేర్కొన్నాయి. ఈనెల 8న వెలువడిన శాసనసభ ఎన్నికల ఫలితాల్లో భాజపా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి 10 రోజులు అవుతున్నా నూతన ముఖ్యమంత్రి ఎవరనేది ఇంకా తేల్చలేదు. మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్‌వర్మ పేరు సీఎం రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. ఈయన తాజా ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌పై విజయం సాధించారు. బుధవారం భాజపా శాసనసభాపక్ష భేటీ జరగనుంది. అందులో కొత్త సీఎంతో పాటు కేబినెట్ మంత్రులను ఎన్నుకోనున్నారు. దీంతో లాంఛనం పూర్తి కానుంది. ఆ తరవాత సిఎం గురువారం ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది.

# పాపులారిటీ ఉందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతారా

- సభ్య సమాజం అంగీకరిస్తుందని అనుకుంటున్నారా
- యూ ట్యూబర్ రణ్‌వీర్ అల్హాదియాకు సుప్రీం మొట్టికాయలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18( వెలుతురు ):**
పాపులారిటీ ఉందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతారా ...సభ్య సమాజం అంగీకరిస్తుందని అనుకుంటున్నారా.. అంటూ యూ ట్యూబర్ రణ్‌వీర్ అల్హాదియాకు సుప్రీం మొట్టికాయలు వేసింది. ఇండియాస్ గాట్ లాటెంట్’ కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. పాపులారిటీ ఉంటే ఏదైనా మాట్లాడతారా..? ఇలాంటి భాషను ఎవరైనా ఇష్టపడతారా..? అంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. ‘ఇదంతా అసభ్యత కాకపోతే ఇంకేంటి..? మీ మెదడులోని చెత్తనంతా ఆ ప్రోగ్రామ్ ద్వారా బయటపెట్టారు. ఇలాంటి ప్రవర్తన ఖండించదగినదని వ్యాఖ్యానించింది. . మీరు పాపులర్ అని చెప్పి, ఏదైనా మాట్లాడతా అంటే సమాజం ఆమోదించదు. ఇలాంటి భాషను ఎవరైనా ఇష్టపడతారా..? ఇలాంటి వ్యక్తులకు కోర్టు ఎందుకు రక్షణ కల్పించాలని సుప్రీం ప్రశ్నించింది. రణ్‌వీర్‌ను తీవ్రంగా మందలించిన కోర్టు.. ఆ తర్వాత ఊరట కల్పించింది. ఇక ఈ వ్యవహారంలో మరో పోలీసు కేసు నమోదు చేయొద్దని ఆదేశాలు ఇచ్చింది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచివెళ్లే ప్రయత్నాలు చేయొద్దని రణ్‌వీర్‌ను హెచ్చరించింది. అలాగే యూట్యూబర్ తన పాస్‌పోర్టును మహారాష్ట్రలోని ఠాణె పోలీసులకు అప్పగించాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి షోలు చేయకూడదని తేల్చిచెప్పింది. అసలేం జరిగిందంటే.. ఐజీఎల్‌లో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించడంతో ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. అతడి వ్యాఖ్యలపై పలువురు పార్లమెంటు సభ్యులు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సమయ్ రైనా షోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. దాంతో అతడిపై పలు రాష్ట్రాల్లో ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. వాటిపై ఇటీవల యూట్యూబర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లు అన్నింటినీ క్లబ్ చేయాలని ఓ పిటిషన్‌లో పేర్కొన్నాడు. దానిపైనే తాజాగా విచారణ జరిగింది. ఇటీవలే సుప్రీంకోర్టు సీజేఐ బాధ్యతల నుంచి రిటైరైన జస్టిస్ డీవై చంద్రచూడ్ కుమారుడు అభినవ్ చంద్రచూడ్.. రణ్‌వీర్ తరఫున వాదనలు వినిపించారు. నైతిక విలువల ప్రకారం తన క్లయింట్ వ్యాఖ్యలు సమర్థించనని, అయితే అతడిని హత్య చేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయని కోర్టుకు వెల్లడించారు. ఆ సమయంలో మహారాష్ట్ర, అస్సాం పోలీసులను ఆశ్రయించవచ్చని కోర్టు సూచించింది. అలాగే సామాజిక మాధ్యమాల్లో అశ్లీల కంటెంట్‌ను నియంత్రించడానికి ఏవైనా చర్యలు తీసుకొనే యోచనలో ఉన్నారా..? అని ఈసందర్భంగా కేంద్రాన్ని ప్రశ్నించింది. దానిపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com